అమరవీరులకు అరుణాంజలి
రూ॥ 220/-
పేజీలు: 230




ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68, ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★



మహిళా కానిస్టేబుల్ ఆత్మహత్య 04

మున్సిపల్ పోరుకు ముగిసిన నామినేషన్లు 02



సంపుటి 09, సంచిక: 63 | శనివారం | 31-01-2026 | మహబూబ్‌నగర్ | Published from: **Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar** | పేజీలు: 12+8 | వెల రూ. 5.00


## '21వ శతాబ్దపు లీడర్‌షిప్ కోర్సు' పూర్తి

### ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సర్టిఫికెట్ అందజేసిన హార్వర్డ్ కెన్నెడీ స్కూల్



ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి మరో అరుదైన ఘనత సాధించారు. హార్వర్డ్ యూనివర్సిటీకి చెందిన ప్రతిష్టాత్మక హార్వర్డ్ కెన్నెడీ స్కూల్లో నిర్వహించిన '21వ శతాబ్దపు లీడర్షిప్' అనే ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్‌ను ఆయన విజయవంతంగా పూర్తి చేశారు. ఈ కోర్సు పూర్తి చేసిన వారిలో మరో 62 మంది విద్యార్థులు కూడా ఉన్నారు. ప్రతిరోజూ ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు సాగిన ఈ శిక్షణా కార్యక్రమం మైనస్ 15 నుంచి 24 డిగ్రీల సెల్సియస్ తీవ్ర చలిలో నిర్వహించబడడం విశేషం. సిఎం రేవంత్ రెడ్డి పూర్తి అంకితభావంతో కోర్సు తరగతులకు

తరువాయి 2లో

## కెసిఆర్‌కు మళ్లీ నోటీసు

- ఎర్రవల్లిలో విచారించాలన్న మాజీసిఎం విజ్ఞప్తిని తిరస్కరించిన పోలీసు శాఖ
- ఫిబ్రవరి 1 న హైదరాబాద్‌లోని నివాసంలోనే విచారణకు హాజరు కావాలని స్పష్టీకరణ



ప్రజాపక్షం/హైదరాబాద్

ఫోన్ ట్యాపింగ్ కేసులో బిఆర్ఎస్ అధ్యక్షుడు, గజ్వేల్ ఎమ్మెల్యే కె.చంద్రశేఖర్ రావుకు (కెసిఆర్) పోలీసులు మరోసారి స్పష్టమైన సూచనలు చేశారు. ఫిబ్రవరి 1వ తేదీన మధ్యాహ్నం 3 గంటలకు హైదరాబాద్‌లోని ఆయన నివాసంలోనే విచారణకు హాజరుకావాలని కెసిఆర్‌ను పోలీసులు ఆదేశించారు. హైదరాబాద్ పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో నమోదైన క్రైమ్ నంబర్ 243/2024 కేసుకు సంబంధించి కెసిఆర్‌కు సిఆర్‌పిసి సెక్షన్ 160 కింద జారీ చేసిన నోటీసుపై వివరణ ఇస్తూ జూబ్లీహిల్స్ సబ్ డివిజన్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్

తరువాయి 12లో

## బాలికలకు ఉచితంగా శానిటరీ ప్యాడ్స్

- ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో అందుబాటులో ఉంచాలని రాష్ట్రాలు, యుటిలకు సుప్రీంకోర్టు ఆదేశం
- బాలికల ఆరోగ్యం, గౌరవం, విద్యా హక్కుల పరిరక్షణకు ఇది తప్పనిసరి అని సూచన
- రుతుక్రమ ఆరోగ్య హక్కు అనేది జీవించే ప్రాథమిక హక్కులో భాగమని స్పష్టీకరణ



**న్యూఢిల్లీ :** విద్యాసంస్థల్లో చదువుతున్న బాలికల రుతుక్రమ ఆరోగ్యాన్ని ప్రాథమిక హక్కుగా గుర్తిస్తూ సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. దేశవ్యాప్తంగా ఉన్న అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదివే బాలికలకు ఉచితంగా బయోడిగ్రేడబుల్ శానిటరీ ప్యాడ్స్ అందుబాటులో ఉంచాలని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. బాలికల ఆరోగ్యం, గౌరవం, విద్యా హక్కుల పరిరక్షణకు ఇది తప్పనిసరి చర్య అని కోర్టు పేర్కొంది. జస్టిస్ జె.బి. పార్దివాలా, జస్టిస్ ఆర్. మహదేవన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఈ మేరకు అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు స్పష్టమైన దిశానిర్దేశాలు ఇచ్చింది. 'రుతుక్రమ ఆరోగ్య హక్కు అనేది రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 కింద వచ్చే జీవన హక్కులో భాగం' అని బెంచ్ వ్యాఖ్యానించింది. బాలికలకు సరైన సౌకర్యాలు లేకపోవడం వల్ల వారి చదువు, ఆరోగ్యం, గౌరవం

తరువాయి 12లో

# అనుమతి ఇవ్వలేదు



- పోలవరం, నల్లమల సాగర్‌కు డిపిఆర్‌ను కూడా అనుమతించలేదు
- ప్రీ ఫీజిబిలిటీ రిపోర్టుపై వివిధ రాష్ట్రాల అభిప్రాయాలు కోరినట్లు సిడబ్ల్యుసి స్పష్టం చేసింది
- కేంద్ర జలశక్తిమంత్రి సి.ఆర్. పాటిల్‌కు లేఖ రాసినట్లు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడి
- కృష్ణా, గోదావరి జలాల వాటాల్లో ఒక్క చుక్క నీటినీ వదులుకోబోమని మంత్రి స్పష్టీకరణ
- ఎంతదూరమైనా పోరాటం చేసేందుకు సిద్ధమని ప్రకటన
- ఇరిగేషన్‌ను సర్వనాశనం చేసింది గత బిఆర్ఎస్ ప్రభుత్వమేనని మండిపాటు

ప్రజాపక్షం/హైదరాబాద్

ఎపిలోని పోలవరం నల్లమల సాగర్ విషయంలో ఎపి ప్రభుత్వానికి ఎటువంటి అనుమతి ఇవ్వలేదని, డిపిఆర్‌ను కూడా అనుమతించలేదని సెంట్రల్ వాటర్ కమిషన్ (సి డబ్ల్యుసి ) లేఖ ద్వారా స్పష్టం చేసిందని తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. ఈ ప్రాజెక్ట్‌కు ఎటువంటి అనుమతి ఇవ్వలేదని, ప్రీ ఫీజిబిలిటీ రిపోర్ట్ విషయంలో అంతర్రాష్ట్ర వివాదాల నేపథ్యంలో వివిధ రాష్ట్రాల అభిప్రాయాలు కోరినట్టు కేంద్ర జలశక్తి మంత్రి సి.ఆర్ పాటిల్ తమకు లేఖ రాసినట్టు స్పష్టం చేశారు. కృష్ణా,గోదావరి నదీజలాల్లో తెలంగాణ రాష్ట్ర వాటాలో ఒక చుక్క నీటిని కూడా వదులుకోబోమని, ఇందుకు ఎంత దూరమైన పోరాటం చేసేందుకు సిద్ధంగా ఉన్నామని, ఇందుకు అన్ని వేదికలను ఉపయోగించుకుంటామని అన్నారు. ఇరిగేషన్‌ను సర్వనాశనం చేసిందే గత బిఆర్ఎస్ ప్రభుత్వమని విమర్శించారు.జూమ్ యాప్ ద్వారా శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ నల్లమల పోలవరం సాగర్ ఏజెండాలో చేర్చేందుకు తాము ఒప్పుకోబోమని, అంతర్రాష్ట్ర వివాదాల వల్ల ఆగిన ప్రాజెక్టలపైన చర్చించేందుకు

తరువాయి 2లో

ఆ రెండు ప్రాజెక్టులను

## ఎజెండాలో పెట్టొద్దు

- పోలవరం, నల్లమలసాగర్‌పై కేంద్ర జలవివాదాల పరిష్కార కమిటీకి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తి
- తొలిసారి కమిటీ భేటీ
- ఎజెండాలో 12 అంశాలు చేర్చాలని ప్రతిపాదనలు

ప్రజాపక్షం/హైదరాబాద్

పోలవరం, నల్లమలసాగర్ ప్రాజెక్టును సమావేశ ఎజెండాలో పెట్టవద్దని కేంద్ర జల వివాదాల పరిష్కార కమిటీకి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కోరింది. తెలుగు రాష్ట్రాల మధ్య నదీ జల వివాదాలపై ఏర్పాడిన 'కేంద్ర జల వివాదాల పరిష్కార కమిటీ' మొదటి సమావేశం ఢిల్లీలోని కేంద్ర జల సంఘం కార్యాలయంలో జల సంఘం చైర్మన్ అనుపమ్ ప్రసాద్ అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఈ సమావేశంలో సుమారు రెండు గంటల పాటు కొనసాగింది. ఈ సమావేశానికి సిడబ్ల్యుసి అధికారులు, కృష్ణా నది యాజమాన్య మండలి (కెఆర్ఎంబి ), గోదావరి నది యాజమాన్య మండలి (జిఆర్ఎంబి ), నేషనల్ వాటర్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ (ఎన్‌డబ్ల్యుడిఎ) ఛైర్మన్లు, కేంద్ర జలసంఘం చీఫ్ ఇంజినీర్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు హాజరయ్యారు. అజెండాలో 12 అంశాలు

తరువాయి 2లో



దానంపై అనర్హత పిటిషన్లు

## విచారించిన స్పీకర్ గడ్డం

ప్రజాపక్షం/హైదరాబాద్

హైదరాబాద్‌లోని ఖైరతాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం ఎంఎల్‌ఎ దానం నాగేందర్‌పై దాఖలైన రెండు అనర్హత పిటిషన్లపై తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ శుక్రవారం తన ఛాంబర్‌లో విచారణ నిర్వహించారు. బిఆర్ఎస్ తరపున పిటిషన్ వేసిన ఎంఎల్‌ఎ పాడి కౌశిక్ రెడ్డితో పాటు ఆయన తరఫు న్యాయవాదులు స్పీకర్ ఎదుట హాజరై తమ వాదనలు వినిపించారు. మరోవైపు దానం నాగేందర్ తన న్యాయవాదులతో విచారణకు

తరువాయి 2లో

## భక్తజన గుడారం...

- జాతరకు వెల్లువెత్తుతున్న భక్తులు
- పుణ్యస్నానాలతో జలధారగా మారిన జంపన్న వాగు
- సమ్మక్క, సారలమ్మను దర్శించుకున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, మంత్రి కొండా సురేఖ సహా పలువురు ప్రముఖులు

12



పోటెత్తిన మేడారం



47 కీలక ప్రతిపాదనలు

## కేంద్రం వద్దే..

- రాష్ట్ర విభజన జరిగి పదేళ్లు దాటినా రూ.లక్ష కోట్లకుపైగా నిధులు, ప్రాజెక్టులు పెండింగ్
- తెలంగాణ అభివృద్ధిపై ప్రభావం



ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్ర విభజన జరిగి పదేళ్లు దాటినా తెలంగాణకు రావాల్సిన కీలక నిధులు, ప్రాజెక్టులు, అనుమతులు ఇంకా కేంద్ర ప్రభుత్వ పరిధిలోనే నిలిచిపోయాయి. సుమారు 12 విభాగాలకు సంబంధించిన 47 అంశాలు కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉండటంతో రాష్ట్ర అభివృద్ధి లక్ష్యాలకు ఆటంకం ఏర్పడుతోందని రాష్ట్ర ప్రభుత్వవర్గాలు పేర్కొంటున్నాయి. మౌలిక వసతులు, రవాణా, పరిశ్రమలు, విద్య, హౌజింగ్ వంటి కీలక రంగాల్లో కేంద్ర సహకారం కోసం రాష్ట్ర ప్రభుత్వం పదే పదే విజ్ఞప్తులు చేస్తున్నప్పటికీ నిర్ణయాలు తీసుకోవడంలో జాప్యం జరుగుతుందని, ఫలితంగా పలు ప్రాజెక్టులు అమలుకు నోచుకోవడంలేదని అధికారవర్గాలు చెబుతున్నాయి. ముఖ్యంగా హైదరాబాద్ చుట్టూ సుమారు 350 కిలో మీటర్ల రీజనల్ రింగ్ రోడ్డు నిర్మాణం అనుమతులతో పాటు రూ. 34,367 కోట్లు కేంద్రం నుంచి ఆర్థిక సహాయం కోరింది. ఓఆర్‌ఆర్ నుంచి ఆర్‌ఆర్‌ఆర్ రేడియల్ రోడ్లు రూ.45,000 కోట్లు, ఓఆర్‌ఆర్ నుంచి

తరువాయి 2లో



## భూ సంస్కరణలకు ఆద్యుడు

- బూర్గుల రామకృష్ణారావుది ఉద్యమ బాట : డిప్యూటీ సిఎం భట్టి
- రంగారెడ్డి జిల్లా మొగిలిగిద్ద జెడ్‌పిహెచ్‌ఎస్ 150వ వార్షికోత్సవ వేడుకలు

**ప్రజాపక్షం/రంగారెడ్డి/షాద్‌నగర్:** సామాజిక మార్పు కోసం తన జీవితం ఉపయోగపడాలని ఎంతో కష్టపడి చదివిన న్యాయవాద వృత్తిని వదిలి ఉద్యమ బాట పట్టిన గొప్ప వ్యక్తి బూర్గుల రామకృష్ణారావు అని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు అన్నారు. శుక్రవారం రంగారెడ్డి జిల్లా ఫరూక్ నగర్ మండలం మొగిలిగిద్ద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 150వ వార్షికోత్సవ వేడుకలలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, స్థానిక శాసనసభ్యులు వీర్లపల్లి శంకరయ్య, ప్రొఫెసర్ హరగోపాల్‌లతో కలిసి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజాంకు వ్యతిరేక గ్రంథాలయ ఉద్యమాలతో పోరాటం మొదలుపెట్టిన బూర్గుల రామకృష్ణారావు...ఈ ప్రాంతంలో దున్నేవానికే భూమి కావాలన్న నినాదంతో రైతులు చేపట్టిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటాన్ని దృష్టిలోకి తీసుకొని తాను ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత యాక్ట్ ను తీసుకువచ్చిన మహానుభావుడు ఆయన అని డిప్యూటీ సిఎం భట్టి

తరువాయి 12లో

వెనిజులాలో అమల్లోకి

## కొత్త చమురు చట్టం

అమెరికాకు అనుకూలించేదిగా అభివర్ణిస్తున్న పరిశీలకులు



**కారకస్ :** వెనిజులా చమురు పరిశ్రమపై కొత్త చట్టం అమల్లోకి వచ్చింది. దేశ కార్యనిర్వాహక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగెస్ సంతకం చేసిన ఈ చట్టాన్ని అమెరికా అనుకూలమైనదిగా పరిశీలకులు భావిస్తున్నారు. తాజాగా అమల్లోకి వచ్చిన ఈ చట్టం, స్థూలంగా చూస్తే దేశ ఆర్థిక పునరుద్ధరణ కోసం తీసుకున్న సంస్కరణగా కనిపించినప్పటికీ, లోతుగా పరిశీలిస్తే ఇది అమెరికా ప్రయోజనాలకు అనుకూలంగా రూపొందిన వ్యూహాత్మక చర్యగా కూడా అర్థమవుతుంది. ఈ కొత్త చట్టంతో, రెండు దశాబ్దాలుగా కొనసాగిన ప్రభుత్వ ఆధిపత్యాన్ని తగ్గించి, ప్రైవేటు పెట్టుబడులకు తలుపులు తెరిచింది. హ్యూగో చావెజ్ కాలం నుంచి సామ్యవాద సిద్ధాంతానికి కేంద్రబిందువుగా ఉన్న చమురు జాతీయాకరణ విధానానికి ఇది పూర్తిగా విరుద్ధమైన మార్పు. ఈ చట్టం ప్రకారం, చమురు ఉత్పత్తి, విక్రయం వంటి కీలక రంగాల్లో ఇకపై ప్రైవేటు సంస్థలకు నియంత్రణ హక్కులు ఉంటాయి. ఇప్పటివరకు ప్రభుత్వ సంస్థ పిడివిఎస్‌ఎకి మాత్రమే ఉన్న ఏకాధిపత్యం ముగుస్తుంది. ప్రైవేటు కంపెనీలు తమ ఖర్చు, ప్రమాదం మీదే ఉత్పత్తి నిర్వహించాలి, అయితే చమురు నిల్వల యాజమాన్యం మాత్రం రాష్ట్రానిదిగానే ఉంటుంది. అంతేకాదు, వివాదాల పరిష్కారానికి వెనిజులా కోర్టులకే పరిమితం కాకుండా, స్వతంత్ర అంతర్జాతీయ ఆర్బిట్రేషన్‌కు అవకాశం కల్పించడం ఈ చట్టంలోని కీలక అంశం. ఇది విదేశీ పెట్టుబడిదారులకు భరోసా కలిగించే అంశంగా ప్రభుత్వం ప్రచారం చేస్తోంది. స్థూలంగా పరిశీలిస్తే, ఈ చట్టం వెనిజులా ఆర్థిక వ్యవస్థకు ఊతమివ్వడానికే రూపొందించినట్టుగా కనిపిస్తుంది. దశాబ్దాలపాటు చమురు ఆదాయాలపై ఆధారపడి, ఆ తర్వాత ధరల పతనం, అవినీతి, దుర్వ్యవస్థ వల్ల

తరువాయి 2లో

## హాంగ్‌కాంగ్ కంపెనీకి రాయితీ రాజ్యాంగ విరుద్ధం

పనామా సుప్రీంకోర్టు తీర్పు

**పనామా సిటీ :** పనామా కాలువ వద్ద ఉన్న కీలక నౌకాశ్రయాలను నిర్వహించే హాంగ్‌కాంగ్ కంపెనీకి ఇచ్చిన కన్సెషన్‌ను పనామా సుప్రీంకోర్టు రాజ్యాంగ విరుద్ధమని తీర్పు ఇవ్వడం అంతర్జాతీయ రాజకీయాల్లో కీలక పరిణామంగా మారింది. హాంగ్‌కాంగ్‌కు చెందిన సికె హచిసన్ హోల్డింగ్స్‌కు అనుబంధ సంస్థ అయిన పనామా పోర్ట్స్ కంపెనీకి, పనామా కాలువకు ఇరువైపులా ఉన్న నౌకాశ్రయాలను నిర్వహించే హక్కు ఉంది. అయితే ఆ హక్కును 2021లో మరో 25 సంవత్సరాల పాటు పొడిగించిన తీరు చట్టబద్ధం కాదని సుప్రీంకోర్టు తేల్చింది.ఈ తీర్పుకు ముందు పనామా కంప్ట్రోలర్ నిర్వహించిన ఆడిట్‌లో అనేక అక్రమాలు బయటపడ్డాయి. కన్సెషన్ పొడిగింపు సమయంలో అవసరమైన అనుమతులు తీసుకోకపోవడం, చెల్లించాల్సిన మొత్తాలు చెల్లించకపోవడం, లెక్కల లోపాలు, 2015 నుంచి భూత కన్సెషన్ (గ్రోస్ కన్సెషన్) పనిచేసే నట్టు అనుమానాలు ఉన్నాయని ఆడిట్ పేర్కొంది. ఈ అక్రమాల వల్ల ప్రభుత్వానికి 2021 తర్వాత సుమారు 300 మిలియన్ డాలర్లు, మొదటి 25 ఏళ్ల ఒప్పంద కాలంలో దాదాపు 1.2 బిలియన్ డాలర్ల వరకు నష్టం జరిగిందని కంప్ట్రోలర్ అనెల్ ఫ్లోరెస్ తెలిపారు. ముఖ్యంగా, ఈ పొడిగింపుకు తన కార్యాలయ ఆమోదం తీసుకోలేదని ఆయన స్పష్టం చేశారు. ఈ న్యాయ తీర్పు అమెరికా దీర్ఘకాల లక్ష్యాలకు అనుకూలంగా మారిందని విశ్లేషకులు చెబుతున్నారు.

## కెనడా విమానాలపై.. 50 శాతం సుంకం పెంపు

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరిక

**వాషింగ్టన్ :** అమెరికా–కెనడాల మధ్య ఇప్పటికే ఉద్రిక్తంగా ఉన్న వాణిజ్య సంబంధాలు మరోసారి తీవ్రమయ్యాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, అమెరికాలో విక్రయించే కెనడా విమానాలపై 50 శాతం సుంకం (టారిఫ్) విధిస్తామని బెదిరించడం ద్వారా ఈ వాణిజ్య యుద్ధాన్ని మరింత విస్తరించారు. ఈ హెచ్చరిక ప్రధానంగా కెనడాకు చెందిన అతిపెద్ద విమాన తయారీ సంస్థ బాంబార్డియర్‌పై ప్రత్యక్ష ప్రభావం చూపడం ఖాయంగా కనిపిస్తున్నది. కెనడా, జార్జియాలోని సవన్నాలో ఉన్న గల్ఫ్‌స్ట్రీమ్ ఏరోస్పేస్ తయారు చేసిన విమానాలకు సర్టిఫికేషన్ ఇవ్వడాన్ని నిరాకరించిందని ట్రంప్ ఆరోపించారు. దీనికి ప్రతీకారంగా, అమెరికాలో పనిచేస్తున్న కెనడా విమానాల సర్టిఫికేషన్‌ను రద్దు చేస్తామని, అన్ని ఇతర కెనడా విమానాలపై 50 శాతం టారిఫ్ విధిస్తామని ఆయన సోషల్ మీడియా ద్వారా ప్రకటించారు. అంతేకాదు, బాంబార్డియర్ గ్లోబల్ ఎక్స్‌ప్రెస్ బిజినెస్ జెట్‌ను తక్షణమే డీసర్టిఫై చేస్తున్నట్లు కూడా పేర్కొన్నారు. ప్రస్తుతం అమెరికాలో సుమారు 150 బాంబార్డియర్ గ్లోబల్ ఎక్స్‌ప్రెస్ విమానాలు సేవలందిస్తున్నాయి. ఇవి ప్రైవేట్ యజమానులు, కార్పొరేట్ సంస్థలు, నెట్‌జెట్స్, ఫ్లెక్స్‌జెట్ వంటి ఫ్రాక్షనల్ జెట్ కంపెనీల ద్వారా విస్తృతంగా ఉపయోగంలో ఉన్నాయి. గల్ఫ్‌స్ట్రీమ్, బాంబార్డియర్ రెండూ బిజినెస్ జెట్ మార్కెట్‌లో ప్రత్యర్థులు కావడంతో, ఈ నిర్ణయం వెనుక వాణిజ్య ప్రయోజనాలే ఉన్నాయని విమర్శలు వినిపిస్తున్నాయి. కాగా, ఈ ఆరోపణలను బాంబార్డియర్ ఖండిస్తూ, తమ విమానాలు పూర్తిగా అమెరికా ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ (ఎఫ్ఏఏ) ప్రమాణాలకు అనుగుణంగానే సర్టిఫై అయ్యాయని, అమెరికాలో తమ కార్యకలాపాలను మరింత విస్తరిస్తున్నామని స్పష్టం చేసింది. ఈ వివాదం త్వరగా పరిష్కారమవ్వకపోతే విమాన రాకపోకలకు, ప్రజలకు తీవ్రమైన ఇబ్బందులు ఎదురయ్యే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరించారు. ఇదిలా ఉండగా, అమెరికా ట్రెజరీ కార్యదర్శి స్కాట్ బెసెంట్, అమెరికా–మెక్సికో–కెనడా వాణిజ్య ఒప్పందం సమీక్షకు ముందు కెనడా ప్రధాని మార్క్ కార్నీ వ్యాఖ్యలు ప్రతికూలంగా మారవచ్చని హెచ్చరించారు.

# షాంఘై చేరుకున్న స్టార్మర్



**బీజింగ్ :** బ్రిటిష్ ప్రధాని కెయిర్ స్టార్మర్ శుక్రవారం చైనా వాణిజ్య కేంద్రం షాంఘై చేరుకున్నారు. యునైటెడ్ కింగ్‌డమ్ (యుకె)తో చైనా సంబంధాలను మరింత పెరుగుపరచుకునే దిశగా ఆయన పర్యటన సాగనుంది. ప్రపంచంలో రెండో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ కలిగిన చైనాతో ఎలాంటి ఒప్పందాలు చేసుకోకూడదంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించిన కొన్ని గంటల్లోనే స్టార్మర్ షాంఘై చేరుకోవడం ప్రాధాన్యతను సంతరించుకుంది. స్టార్మర్ వెంట యాభై కంటే ఎక్కువ మంది ప్రముఖ వ్యాపారవేత్తలు ఉన్నారు. బ్రిటిష్ ప్రధాని చైనా పర్యటనకు రావడం ఎనిమిది సంవత్సరాల్లో ఇదే మొదటిసారి. మొదట బీజింగ్ చేరుకున్న స్టార్మర్ ఆ తర్వాత చైనా అధ్యక్షుడు షి జిన్‌పింగ్‌తోసహా పలువురు కీలక నాయకులతో భేటీ అయ్యారు. పరస్పర సహకారం, వ్యూహాత్మక భాగస్వామ్యాలకు ఇరు దేశాల నాయకులు అంగీకరించారు. ఇయితే ఎలాంటి ఒప్పందం కుదుర్చుకోరాదంటూ ట్రంప్ చేసిన హెచ్చరికలను బ్రిటిష్ ప్రధాని ఖాతరు చేయలేదు. అంతకు ముందు కెనడాకు కూడా ఆయన ఇదే విధమైన హెచ్చరిక జారీ చేశారు. కానీ, కెనడా ప్రధాన మంత్రి మార్క్ ఆర్నీ ఈ నెల ఆరంభంలో చైనాలో పర్యటించారు. ఇప్పుడు స్టార్మర్ కూడా అదే విధంగా, ట్రంప్ హెచ్చరికలను పట్టించుకోలేదు.

## బహుమతుల సమగ్ర జాబితా విడుదల చేసిన యుఎస్




**న్యూయార్క్ :** భారత ప్రధాని నరేంద్ర మోదీతో పాటు ఇతర భారత ప్రభుత్వ ప్రముఖులు యుఎస్ నాయకులకు అందజేసిన బహుమతుల వివరాలతో కూడిన సమగ్ర జాబితాను అమెరికా విదేశాంగ శాఖ విడుదల చేసింది. ఈ వివరాలను అమెరికా స్టేట్ డిపార్ట్‌మెంట్‌లోని ఆఫీస్ ఆఫ్ ది చీఫ్ ఆఫ్ ప్రోటోకాల్, 2024 క్యాలెండర్ సంవత్సరానికి సంబంధించి చట్టబద్ధంగా సమర్పించింది. ఈ నివేదికలో, విదేశీ ప్రభుత్వాల నుంచి అమెరికా ఫెడరల్ ఉద్యోగులు స్వీకరించిన బహుమతులపై దాఖలైన ప్రకటనలన్నింటిని ఒకేచోట పొందుపరిచారు. ఇందులో భౌతిక బహుమతులతో పాటు ప్రయాణం లేదా ప్రయాణ వ్యయాలకు సంబంధించిన బహుమతుల వివరాలు కూడా ఉన్నాయి. 2024 సంవత్సరానికి కనీస విలువగా అమెరికా ప్రభుత్వం 480 డాలర్లను నిర్ణయించిందని, ఆ విలువను మించిన బహుమతులన్నీ తప్పనిసరిగా నివేదించాల్సి ఉంటుందని ఈ నివేదిక స్పష్టం చేసింది. ఈ జాబితా ప్రకారం, 2023 సెప్టెంబర్ 10న భారత ప్రధాని నరేంద్ర మోదీ, అప్పటి అమెరికా అధ్యక్షుడు జో బైడెన్‌కు చెక్క పెట్టె, స్కార్ఫ్, కుంకుమపువ్వు ఉన్న సీసా, టీ పెట్టెను బహుమతిగా అందజేశారు. వీటి అంచనా విలువ 562 డాలర్లు. ఈ బహుమతుల్లో చెక్క పెట్టె, దుప్పటి, సీసా, టీ పెట్టెను అమెరికా నేషనల్ ఆర్కైవ్స్‌కు బదిలీ చేయగా, కుంకుమపువ్వు, టీ వంటి పాడయ్యే వస్తువులను అమెరికా సీక్రెట్ సర్వీస్ నిబంధనల ప్రకారం తొలగించారు. జో బైడెన్ 2023 సెప్టెంబర్‌లో భారత్ నిర్వహించిన జి20 శిఖరాగ్ర సదస్సులో పాల్గొనడానికి న్యూఢిల్లీకి వచ్చిన సందర్భంగా ఈ బహుమతులు లభించాయి. అలాగే, 2024 జూలై 16న మోదీ బైడెన్‌కు మరో విలువైన బహు మతిగా స్టెర్లింగ్ సిల్వర్ మెటల్ ట్రైన్ సెట్‌ను అందజేశారు. దీని అంచనా విలువ 7,750 డాలర్లు. అదే విధంగా, 2024 అక్టోబర్ 21న మాజీ ఫస్ట్ లేడీ జిల్ బైడెన్‌కు మోదీ పాష్మినా షాల్‌ను బహుమతిగా ఇచ్చారు. దాని విలువ సుమారు 2,969 డాలర్లు. భారత జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్, అప్పటి అమెరికా జాతీయ భద్రతా సలహాదారు జేకబ్ సలివన్‌కు 2024 ఆగస్టు 23న కాశ్మీర్ పాష్మినా స్కార్ఫ్‌ను బహుమతిగా అందజేశారు. దీని విలువ 599 డాలర్లు కాగా, జనరల్ సర్వీసెస్ అడ్మినిస్ట్రేషన్‌కు బదిలీ చేశారు. అలాగే, మాజీ ఉపాధ్యక్షురాలు కమలా హారిస్‌కు మోదీ 2024 అక్టోబర్ 18న శ్రీకృష్ణ రాసలీల వెండి పెట్టెను బహుమతిగా ఇచ్చారు. దీని విలువ 1,330 డాలర్లు. ఆమె భర్త డగ్లస్ ఎంహాఫ్‌కు ఇచ్చిన కఫ్‌లింక్స్ విలువ 585.65 డాలర్లు. ఇదే జాబితాలో, భారత రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, అప్పటి అమెరికా రక్షణ శాఖ కార్యదర్శి లాయిడ్ ఆస్టిన్‌కు 2022 నవంబర్ 24న శివ నటరాజ కాంస్య విగ్రహాన్ని బహుమతిగా ఇచ్చినట్టు కూడా పేర్కొన్నారు. దాని అంచనా విలువ 3,700 డాలర్లు కాగా, జీఎస్ఏకు బదిలీ ప్రక్రియ కొనసాగుతోంది. ఈ బహుమతుల స్వీకరణకు కారణాలుగా, బహుమతులను స్వీకరించకపోతే దాత దేశానికి మరియు అమెరికాకు అసౌకర్యం కలగవచ్చు అనే అంశాన్ని నివేదిక స్పష్టం చేసింది.

## సార్వభౌమాధికారం విషయంలో రాజీ ప్రసక్తే లేదు

మెక్సికో అధ్యక్షురాలు క్లాడియా

**మెక్సికో సిటీ :** తమ దేశ సార్వభౌమాధికారం విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని మెక్సికో అధ్యక్షురాలు క్లౌడియా షెయిన్‌బామ్ స్పష్టం చేశారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో జరిగిన తాజా ఫోన్ సంభాషణ అనంతరం మెక్సికో సార్వభౌమాధికారాన్ని మరోసారి స్పష్టంగా పునరుద్ఘాటించారు. ముఖ్యంగా ఒక మాజీ ఒలింపిక్ స్నోబోర్డర్ డ్రగ్ అక్రమ రవాణా ఆరోపణలపై అరెస్టు అయి అమెరికాకు తరలించిన ఘటన నేపథ్యంలో, మెక్సికో భూభాగంలో అమెరికా జోక్యం ఉందనే అనుమానాలు వెల్లువెత్తడంతో ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ అంశంపై రోజువారీ ప్రెస్ సమావేశంలో క్లాడియా మాట్లాడుతూ, మెక్సికో భూభాగంలో జరిగే భద్రతా సంబంధమైన అన్ని కార్యకలాపాలను స్వదేశీ భద్రతా దళాలే నిర్వహిస్తాయని స్పష్టం చేశారు. తమ దేశంలో అమెరికా ఆపరేషన్లు చేపట్టడాన్ని తాము ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోమని ఆమె మరోసారి తేల్చి చెప్పారు. ఈ మాటలు, కెనడాకు చెందిన మాజీ ఒలింపిక్ స్నోబోర్డర్ ర్యాన్ వెడ్డింగ్ అరెస్టు చుట్టూ నెలకొన్న వివాదానికి కొనసాగింపుగా పరిశీలకులు భావిస్తున్నారు. మెక్సికో ప్రభుత్వం, అమెరికాలోని మెక్సికన్ రాయబారి రోనాల్డ్ జాన్సన్, వెడ్డింగ్ గత వారం అమెరికా రాయబార కార్యాలయంలో స్వయంగా లొంగిపోయాడని చెబుతుండగా, అతని న్యాయవాది మాత్రం ఈ వాదనను ఖండించారు.

## భారత్‌కు మూడు కాంస్య శిల్పాలను తిరిగి అప్పగించనున్న అమెరికా



**న్యూయార్క్ :** గతంలో, భారతదేశంలోని ఆలయాల నుంచి అక్రమంగా తరలించిన మూడు ప్రాచీన కాంస్య శిల్పాలను అమెరికా భారత్‌కు తిరిగి అప్పగించనుంది. వాషింగ్టన్ డిసిలోని స్మిత్సోనియన్ నేషనల్ మ్యూజియం ఆఫ్ ఏషియన్ ఆర్ట్, సుదీర్ఘమైన పరిశోధన అనంతరం ఈ శిల్పాలు చట్టవిరుద్ధంగా ఆలయాల నుంచి తొలగించారని నిర్ధారించి, వాటిని భారత ప్రభుత్వానికి తిరిగి ఇవ్వాలని నిర్ణయించింది. మ్యూజియం విడుదల చేసిన ప్రకటన ప్రకారం, ఈ మూడు శిల్పాల్లో ఒకటైన 'శివ నటరాజ' విగ్రహాన్ని దీర్ఘకాలిక రుణ ప్రాతిపదికన మ్యూజియంలోనే ఉంచేందుకు భారత ప్రభుత్వం అంగీకరించింది. దీని ద్వారా ఆ శిల్పం మూలాలు, అది ఆలయం నుంచి తొలగించబడిన విధానం, తిరిగి భారత్‌కు అప్పగించే ప్రక్రియ వంటి పూర్తి కథను ప్రజల ముందు ఉంచేందుకు అవకాశం కలుగుతుందని మ్యూజియం తెలిపింది. ఇది సంస్కృతిక వారసత్వ పరిరక్షణలో పారదర్శకతకు తమ నిబద్ధతను చాటుతుందని పేర్కొంది. చోళుల కాలానికి చెందిన (సుమారు క్రీ.శ. 990) 'శివ నటరాజ', 12వ శతాబ్దానికి చెందిన చోళుల కాలపు 'సోమాస్కంద', అలాగే 16వ శతాబ్దానికి చెందిన విజయనగర కాలపు 'పరవాయితో సంత్ సుందరర్' శిల్పాలను తిరిగి ఇస్తారు. ఇవన్నీ దక్షిణ భారతదేశంలోని కాంస్య శిల్పకళా సంప్రదాయానికి అద్భుతమైన ఉదాహరణలుగా నిలుస్తాయని, ఆలయ ఉత్సవాల్లో ఊరేగింపులకు ఉపయోగించే పవిత్ర విగ్రహాలుగా ఇవి ఉండేవని మ్యూజియం తెలిపింది. దీర్ఘకాలిక రుణంగా మ్యూజియంలో ప్రదర్శించనున్న 'శివ నటరాజ' విగ్రహం, 'దక్షిణ ఆసియా, ఆగ్నేయ ఆసియా హిమాలయ ప్రాంతాల్లో జ్ఞాన కళ' అనే ప్రదర్శనలో భాగంగా దర్శనమివ్వనుంది. ఈ ఒప్పందానికి సంబంధించిన ఏర్పాట్ల కోసం మ్యూజియం, భారత రాయబార కార్యాలయం పరస్పర సంప్రదింపుల్లో ఉన్నాయని వెల్లడించింది.

## విచారించిన స్పీకర్ గడ్డం

(మొదటి పేజీ తరువాయి)

హాజరయ్యారు. అయితే, విచారణకు ముందే దానం స్పీకర్‌కు ఓ అఫిడవిట్ సమర్పించారు. అందులో తాను బిఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేయలేదని, ఇప్పటికీ ఆ పార్టీలోనే కొనసాగుతున్నానని పేర్కొన్నారు. 2024 మార్చిలో తాను కాంగ్రెస్ సమావేశానికి హాజరైంది కేవలం వ్యక్తిగత హోదాలోనే తప్ప పార్టీ మారినట్లుగా కాదని దానం నాగేందర్ తెలిపారు. ఇదే కేసులో బిజెపి శాసనసభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై స్పీకర్ ప్రసాద్ కుమార్ మధ్యాహ్నం విచారించారు. ఇదిలా ఉండగా, దానంపై పిటిషన్ ఎందుకు వేశారు?, పార్టీ మారారని చెప్పేందుకు గల ఆధారాలపై స్పీకర్ ప్రశ్నించారని, ఈ క్రమంలో తన వద్ద ఉన్న ఆధారాలను స్పీకర్‌కు అందజేసినట్లు పాడి కౌశిక్ అనంతరం మీడియాతో చెప్పారు. బిఆర్‌ఎస్ నుంచి దానం నాగేందర్ పోటీ చేసి ఖైరతాబాద్ ఎంఎల్‌ఏగా గెలుపొందడం, ఆ తరువాత కాంగ్రెస్ నుంచి సికింద్రాబాద్ ఎంపిగా పోటీ చేయడం, దానం నాగేందర్ ప్రచార ఫొటోలు, వీడియోలు, కాంగ్రెస్ కండువా వేసుకున్న ఫొటోలను స్పీకర్‌కు అందజేసిట్లు తెలిపారు.

## లీడర్‌షిప్ కోర్సు పూర్తి

(మొదటి పేజీ తరువాయి)

హాజరై, అంతర్జాతీయ స్థాయి నాయకత్వ పాఠాలను అధ్యయనం చేశారు. కోర్సు ముగింపు సందర్భంగా హార్వర్డ్ కెన్నెడీ స్కూల్ ఫ్యాకల్టీ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా సిఎం రేవంత్‌రెడ్డి నాయకత్వ లక్షణాలు, ప్రజాపాలనపై ఆయనకు ఉన్న స్పష్టమైన దృక్పథాన్ని ఫ్యాకల్టీ ప్రశంసించిందని ముఖ్యమంత్రి కార్యాలయం తెలియజేసింది.

# ముగిసిన నామినేషన్‌ల తుది గడువు..రంగంలోకి కొత్త పార్టీలు

ప్రచారానికి స్వల్ప సమయం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ ఎన్నికల సందడి కీలక దశకు చేరుకుంది. 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్‌ల పరిధిలో నామినేషన్‌ల తుది గడువు శుక్రవారంతో ముగిసింది. సాయంత్రం 5 గంటల వరకు క్యూలైన్‌లలో ఉన్న అభ్యర్థులందరికీ అధికారులు నామినేషన్లు దాఖలు చేసేందుకు అవకాశం కల్పించారు. దీంతో ఎన్నికల తొలి దశ పూర్తయింది. రాష్ట్రవ్యాప్తంగా 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్ల పరిధిలోని మొత్తం 2,996 వార్డులు, డివిజన్‌లకు ఎన్నికలు జరగనున్నాయి. వీటిలో 2,582 మున్సిపల్ వార్డులు, 414 కార్పొరేషన్ డివిజన్లు ఉన్నాయి. నామినేషన్ల పరిశీలన జనవరి 31న జరగనుంది. నామినేషన్లు తిరస్కరించిన అభ్యర్థులకు ఫిబ్రవరి 1 వరకు అప్పీల్ చేసుకునే అవకాశం కల్పించారు. ఫిబ్రవరి 3 సాయంత్రం వరకు నామినేషన్‌ల ఉపసంహరణ కొనసాగనుంది. అదే రోజున తుది అభ్యర్థుల జాబితా విడుదల చేసి, ఎన్నికల గుర్తులను కేటాయించనున్నారు. ఫిబ్రవరి 11న పోలింగ్ జరగనుండగా, ఫిబ్రవరి 13న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. పోలింగ్‌కు 48 గంటల ముందు ఫిబ్రవరి 9న ప్రచారం ముగియనుంది. ప్రచారానికి కేవలం ఆరు రోజులే సమయం ఉండటంతో పలువురు అభ్యర్థులు ఇప్పటికే ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా 52.43 లక్షల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఇందులో మహిళలు 26.80 లక్షలు, పురుషులు 25.62 లక్షలు, ఇతరులు 640 మంది ఉన్నారు. పోలింగ్ కోసం 8,203 పోలింగ్ కేంద్రాలు, ఓట్ల లెక్కింపుకు 136 కౌంటింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. నామినేషన్‌ల పరిశీలన పూర్తయ్యాక ఎన్ని వార్డులు, డివిజన్‌లలో సింగిల్ నామినేషన్లు దాఖలయ్యాయన్న వివరాలు శుక్రవారం రాత్రికి స్పష్టతకు రానున్నాయి. ఈ ఎన్నికల ఫలితాలతో రాష్ట్రంలోని మున్సిపల్ రాజకీయ సమీకరణాల్లో మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

**బరిలో కొత్త పార్టీలు – రసవత్తరంగా రాజకీయం**

ఈసారి ఎన్నికల్లో ప్రధాన పార్టీలైన సిపిఐ, కాంగ్రెస్, బిఆర్‌ఎస్, సిపిఐ(ఎం), బిజెపిలతో పాటు కొత్త పార్టీలు కూడా అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నాయి. ఈ ఎన్నికల్లో ఈసారి కొత్తగా మూడు రాజకీయ పార్టీలు బరిలోకి దిగాయి. మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత నేతృత్వంలో 'ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్' (సింహం గుర్తు) తరపున అభ్యర్థులను బరిలో నిలిపింది. పవన్ కల్యాణ్ నేతృత్వంలోని జనసేన పార్టీ పలు కీలక స్థానాల్లో పోటీ చేస్తోంది. తెలంగాణ రాజ్యాధికార పార్టీ తరపున తీన్మార్ మల్లన్న నాయకత్వంలో పలు కౌన్సిలర్, కార్పొరేటర్ స్థానాల్లో అభ్యర్థులను పోటీలోకి దించారు. దీంతో కొత్త పార్టీలను ఓటరు దేవుళ్ల ఏవిధంగా ఆదరిస్తారనే విషయం ప్రస్తుతం సర్వత్రా ఆసక్తికరంగా మారింది. మున్సిపల్ ఎన్నికల్లో కవిత తొలిసారిగా పురపోరులో అదృష్టం పరీక్షించుకుంటున్నారు. కల్వకుంట్ల కవిత సింహం గుర్తుపై రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. సింహం గుర్తుపై గతంలో పోటీ చేసిన వారు సానుకూలమైన ఫలితాలు సాధించారనే నమ్మకంతోనే కవితను ఈ గుర్తుపై ధీమాతో ఉన్నట్లు జాగృతి కార్యకర్తలు అంటున్నారు.

**ప్రచారానికి స్వల్ప సమయం**

ఫిబ్రవరి 3న గుర్తుల కేటాయింపు పూర్తయిన తర్వాత, అభ్యర్థులకు ప్రచారం కోసం కేవలం 6 రోజులు మాత్రమే సమయం ఉంటుంది. ఫిబ్రవరి 9వ తేదీ సాయంత్రంతో ప్రచారం ముగియనుంది. దీంతో ఇప్పటికే పలువురు అభ్యర్థులు అనధికారికంగా ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ఏయే వార్డుల్లో సింగిల్ నామినేషన్లు దాఖలై అభ్యర్థులు ఏకగ్రీవం అయ్యారనే అంశంపై ఈ రాత్రికి స్పష్టత వస్తుందని అధికారులు తెలిపారు.

## ఎజెండాలో పెట్టవద్దు

(మొదటి పేజీ తరువాయి)

చేర్చాలని తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదించింది. ట్రిబ్యునల్ తీర్పు వచ్చే వరకు 50 శాతం నీటిని వాడుకునే అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేసింది. కాగా తెలంగాణ రాష్ట్ర అధికారులు లేవనెత్తిన పలు అంశాలపై ఎపి ప్రభుత్వం అభ్యంతరం వ్యక్తం చేసింది. వారంలోగా అజెండా అంశాలను ఖరారు చేసి, లిఖితపూర్వకంగా ఇవ్వాలని సిడబ్ల్యుసి చైర్మన్ సూచించారు. అజెండా అంశాలు ఖరారైన తర్వాత సమావేశ తేదీని ఖరారు చేస్తామని వెల్లడించారు. కాగా ఈనెల 2న కేంద్ర జలశక్తి శాఖ కమిటీని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. సమావేశం అనంతరం తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్‌బొజ్జా మాట్లాడుతూ ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ తన అజెండాను వెల్లడించలేదని మీడియాకు వివరించారు.

## అనుమతి ఇవ్వలేదు

(మొదటి పేజీ తరువాయి)

మాత్రమే తాము సిద్ధంగా ఉన్నామని ఢిల్లీలో జరిగిన సమావేశంలో ప్రభుత్వం స్పష్టం చేసిన విషయన్ని వివరించారు. నీటి ప్రాజెక్ట్‌లు, కేటాయింపులపైన పూర్తి అవగాహణ ఉన్న, తెలంగాణ ప్రయోజనాల కాపాడే ఆదిత్యనాథ్‌దాస్‌ను తాము సలహాదారునిగా పెట్టుకున్నామని, గతంలో ఎస్‌కె.జోషి ఎపి ప్రాజెక్ట్‌ల కోసం పనిచేశారని ఉత్తమ్ తెలిపారు. కేంద్ర ఢిల్లీలో సమావేశాన్ని ప్రస్తావించారని, ఢిల్లీలో హరీశ్‌రావు తెలంగాణ పరభుత్వం, ఎపి ప్రభుత్వం, కేంద్రంతో ఎవరితోనైనా నీటి హక్కుల, నది జలాలో చుక్క నీటికి చర్చలకు సిద్ధమేనని, కానీ ఒక్క చుక్క నీటిని వదులుకునేందుకు సిద్ధంగా లేమన్నారు. మేడిగడ్డ బ్యారేజీ అత్యంత ప్రమాదకరమనే విషయాన్ని కేంద్రం ప్రభుత్వం పార్లమెంట్‌లో లిఖితపూర్వకంగా సమాధానం చెప్పిన విషయాన్ని ఉత్తమ్ వివరించారు. తమ రెండేళ్ల పాలనలో కృష్ణా, గోదావరి నది జలాలు ఎక్కువగా వాడుకున్నామని, గోదావరి బేసిన్‌లో ఎక్కువ నీళ్లు ఇచ్చామని, అత్యధికంగా వరి సాగు జరిగిందని, ఈ విషయమై కేంద్ర ప్రభుత్వం కూడా కితాబునిచ్చిందని వివరించారు.

సర్వ శక్తులూ ఒడ్డుతున్నాం

తెలంగాణ నీటి హక్కులను కాపాడుకునేందుకు సర్వ శక్తులు ఒడ్డుతున్నామని, నీటి చుక్కను కూడా తాము వదులుకునేందుకు సిద్ధంగా లేమని ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. అందుకు ఎపి ప్రభుత్వంపైన అన్ని వేదికపలైన పోరాటం చేస్తామన్నారు. నీటి వాటాల అంశంలో తెలంగాణ రాష్ట్రానికి గత బిఆర్‌ఎస్ పదేళ్ల కాలంలో మోసం జరిగిందని, రూ 17 లక్షల కోట్ల బడ్జెట్‌లో రూ 1.8 లక్షల కోట్లు నీటిపారుదల శాఖపై ఖర్చుపెట్టారని, అయినప్పటికీ ఒక్క ప్రాజెక్ట్‌ను కూడా గత ప్రభుత్వం పూర్తి చేయలేదని ఆరోపించారు. ఒక కాళేశ్వరం ప్రాజెక్ట్‌ను మాత్రమే డిజైన్ చేసి,నిర్మించడం కూలిపోవడం మొత్తం బిఆర్‌ఎస్ హయాంలోనే జరిగిందన్నారు. కృష్ణా నదిజలాలల్లో ఎపికి 811 టిఎంసిలు, తెలంగాణకు 299 టిఎంసి నీరు సరిపోతుందని సాక్షాత్తు కేంద్ర జలశక్తి మంత్రి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో నాటి సిఎం కెసిఆఆర్, నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్ రావు రాసి ఇచ్చారని ఉత్తమ్ విమర్శించారు. తెలంగాణకు 299 టిఎంసి నీరు సరిపోతుందని రాసి ఇచ్చిన ఘనత గత బిఆర్‌ఎస్ ప్రభుత్వానికి, కెసిఆర్‌కు, హరీశ్‌రావుకే దక్కుతుందని ఎద్దేవా చేశారు. కృష్ణా నదిలో తెలంగాణకు 70 శాతం వాటా కేటాయించాని కేంద్ర ప్రభుత్వానికి, కెఆర్‌ఎంబికి నివేదించామని, ఆ దిశగానే పోరాటం చేస్తున్నామని వివరించారు.

'రాయలసీమ' ప్రాజెక్ట్‌ను ముందుకు తీసుకెళ్లిందే కెసిఆర్ : గోదావరి నీటిని రాయలసీమ తీసుకెళ్తామని, రాయలసీమను రత్నాల సీమగా మారస్తామని చెప్పిన కెసిఆర్, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఎపితో కుమ్మక్కు అయిందని తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఉత్తమ్ మండిపడ్డారు. ఎపి సిఎం జగన్‌మోహన్ రెడ్డితో కెసిఆర్ అలయ్ బలాయ్ చేసుకుని, అపెక్స్ సమావేశాన్ని మార్చుకున్నారని, రాయలసీమ ప్రాజెక్ట్‌కు ఎపి ముందుకు తీసుకెళ్లే విధంగా సహకరించారన్నారు. బనకచర్ల పేరు మార్చి నల్లమల సాగర్ నిర్మించడాన్ని కూడా తాము వ్యతిరేకించామని, ఈ విషయమై న్యాయస్థానంలో సూట్ కూడా దాఖలు చేశామన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ గురించి బిఆర్‌ఎస్, ఆ పార్టీ నాయకులు మాట్లాడడం వింత, వికారమని ఉత్తమ్ అన్నారు. ఇరిగేషన్ శాఖను నాటి బిఆర్‌ఎస్ ప్రభుత్వం ఒక దోపిడీ వ్యవస్థగా మార్చిందని మండిపడ్డారు.

## కేంద్రం వద్దే.. (మొదటి పేజీ తరువాయి)

ఆర్‌ఆర్‌ఆర్ కు కలుపుతూ కొత్తగా 10 రేడియల్ రోడ్ల అభివృద్ధి ప్రతిపాదలను సిఎం ఇప్పటికే కేంద్రానికి సమర్పించారు. వీటికి రూ. 45,000 కోట్ల నిధుల మంజూరు కోరింది. హైదరాబాద్ మెట్రో విస్తరణలో భాగంగా మెట్రో రైల్ ఫేజ్–2 ప్రాజెక్టు ఫేజ్ 2ఎ, ఫేజ్ 2బి లకు సంబంధించిన రూ.44,028 కోట్ల పప్రతిపాదనలు కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. గోదావరి నుంచి మూసీకి నీటిని మళ్లించే లింక్ ప్రాజెక్టుకు కేంద్రం నుంచి రూ.6,000 కోట్ల ఆర్థిక సాయం కోరింది. వరంగల్ భూగర్భ డ్రైనేజీ (యుజిడి) ప్రాజెక్టుకు కేంద్ర నిధులు, హైదరాబాద్ సమగ్ర మురుగు నీటి మాస్టర్ ప్లాన్ (అమృత్ 2.0 / స్పెషల్ ప్రాజెక్ట్), బందర్ పోర్ట్ హైదరాబాద్ డ్రై పోర్ట్ గ్రీన్‌ఫీల్డ్ హైవే కోసం రూ.17,000 కోట్లు, బందర్ పోర్ట్ నుంచి హైదరాబాద్ సమీప డ్రై పోర్ట్ వరకు కొత్త గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణ ప్రతిపాదనలకు ఆమోదం, దాదాపు రూ.17 వేల కోట్లతో ఈ ప్రాజెక్టు చేపట్టాలని కోరింది. విమానాశ్రయాల అభివృద్ధిలో భాగంగా ఆదిలాబాద్, కొత్తగూడెం, బసంత్ నగర్ విమానాశ్రయాలు, ఇటీవలే వరంగల్ మామునూర్ ఎయిర్ పోర్ట్‌లకు ఆమోదం తెలిపింది. ఇందుకు సంబంధించిన పనులను ప్రారంభించాల్సి ఉంది. రైల్వే మార్గాల అనుసంధానం కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేసిన 8 కొత్త రైల్వే లైన్ల ప్రతిపాదనలు కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. వికారాబాద్ – కృష్ణ కొత్త రైలు మార్గం, కల్వకుర్తి – మాచర్ల రైలు లైన్, గద్వాల్–డోర్నకల్ రైలు మార్గం, కాచిగూడ – జగ్గయ్యపేట రైలు మార్గం, పటాన్‌చెరు– ఆదిలాబాద్ రైలు లైన్, బోధన్–లాతూర్ రోడ్ లైన్, అక్కన్నపేట బైపాస్ రైలు లైన్, పాండురంగాపురం–భద్రాచలం రోడ్ లైన్ తదితర రైల్వే లైన్ల ప్రతిపాదనలు పెండింగ్‌లో ఉన్నాయి.

ఇదిలా ఉండగా, పరిశ్రమలు, పెట్టుబడులకు ఇండియా సెమీకండక్టర్ మిషన్‌లో తెలంగాణను చేర్చడం, ఖమ్మం లేదా మహబూబాబాద్ ప్రాంతంలో ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటు, పిఎం మిత్ర కింద కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కుకు కేంద్రం సాయం, తెలంగాణ రైజింగ్ విజన్–2047 లక్ష్యానికి అనుగుణంగా లాజిస్టిక్స్, ఇండస్ట్రియల్ కారిడార్ ప్రాజెక్టులకు సంబంధించిన అంశాలు ఇంకా కేంద్రం వద్ద పెండింగ్‌లోనే ఉన్నాయి. కాగా విద్యుత్ రంగంలో 'పవర్ సిస్టం డెవలప్‌మెంట్ ఫండ్' కింద 6 ట్రాన్స్‌మిషన్ ప్రాజెక్టులు, 'పిఎం కుసుమ్' కింద సోలార్ పంప్ సెట్ల కేటాయింపు, సింగరేణికి బొగ్గు బ్లాకుల గుర్తింపు, తాడిచెర్ల కోల్ బ్లాక్–2 మైనింగ్ లీజ్ కేంద్రం చేపట్టాల్సి ఉంది. విద్యారంగంలో నవోదయ విద్యాలయాలు లేని జిల్లాల్లో జవహర్ నవోదయ విద్యాలయాల మంజూరు, కొత్త జిల్లాలకు కేంద్రీయ విద్యాలయాలు, హైదరాబాద్‌లో ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం) ఏర్పాటు చేయాల్సి ఉంది. గృహ నిర్మాణ రంగంలో పిఎంఎవైజిలో గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్ల మంజూరు, కొత్తగా ఏర్పడిన మున్సిపాలిటీలకు పిఎంఎవైయు విస్తరణ జరగాల్సి ఉంది.

## కొత్త చమురు చట్టం

(మొదటి పేజీ తరువాయి)

కుప్పకూలిన ఆర్థిక వ్యవస్థను తిరిగి నిలబెట్టేందుకు విదేశీ పెట్టుబడులు అత్యవసరం అనే వాదన బలంగా వినిపిస్తోంది. చమురు ఉత్పత్తి పెరిగితే ఉపాధి అవకాశాలు, ప్రభుత్వ ఆదాయం పెరుగుతాయనే ఆశ కూడా ఉంది. అయితే ఈ మార్పులు నిజంగా వెనిజులా ప్రజల కోసం ఎంతవరకు ఉపయోగపడతాయన్నది ప్రశ్నార్థకమే. ఈ చట్టం అమెరికాకు మరుగున లాభం చేకూర్చే విధంగా ఎలా పనిచేస్తుందో గమనిస్తే, ముందుగా అమెరికా అవసరాలను ప్రస్తావవించాలి. ప్రపంచంలోనే అతి పెద్ద చమురు వినియోగ దేశాల్లో అమెరికా ఒకటి. వెనిజులాకు ప్రపంచంలోనే అత్యధిక నిర్ధారిత చమురు నిల్వలు ఉన్నాయి. ఈ రెండు అంశాలను కలిపితే, వెనిజులా చమురు రంగం అమెరికాకు వ్యూహాత్మకంగా ఎంత ముఖ్యమో అర్థమవుతుంది. గతంలో చావెజ్, మదూరో ప్రభుత్వాలు జాతీయాకరణ, సామ్యవాద విధానాల పేరుతో అమెరికా కంపెనీలను దూరం పెట్టాయి. ఎక్సాన్‌మొబిల్, కొనోకోఫిలిప్స్ వంటి దిగ్గజ సంస్థలు తమ పెట్టుబడులు కోల్పోయాయి. ఇప్పుడు కొత్త చట్టం ద్వారా అదే అమెరికా కంపెనీలకు తిరిగి ప్రవేశ ద్వారం తెరుచుకుంది. ఇదే సమయంలో, ఈ చట్టం అమల్లోకి వచ్చిన సమయాన్ని గమనించాలి. అమెరికా ఖజానా శాఖ ఒకవైపు వెనిజులా చమురుపై ఉన్న ఆంక్షలను సడలించడం, మరోవైపు అమెరికా ఎనర్జీ కంపెనీల కార్యకలాపాలకు అనుమతులు పెంచడం జరిగింది. ఇదే సమయంలో వెనిజులా ప్రభుత్వం ప్రైవేటీకరణకు సన్నద్ధమవడం యాదృచ్ఛికం కాదు. ఆంక్షలు.. సంస్కరణలు అనే రెండు చర్యలు కలసి, వెనిజులా చమురు రంగాన్ని అమెరికా ప్రభావానికి మరింత లోబరుచుకునే పరిస్థితిని సృష్టిస్తున్నాయి. మూడవ అంశంగా డాలర్ ఆధిపత్యాన్ని చూడాలి. చమురు వ్యాపారం ఎక్కువగా డాలర్లలోనే జరుగుతుంది. వెనిజులా చమురు ఉత్పత్తి, విక్రయం మళ్లీ అంతర్జాతీయ మార్కెట్లో చురుకుగా జరిగితే, ఆ లావాదేవీల్లో డాలర్ పాత్ర పెరుగుతుంది. ఇది అమెరికా ఆర్థిక ఆధిపత్యాన్ని బలోపేతం చేసే అంశం. అంతేకాదు, చమురు అమ్మకాల ద్వారా వచ్చే ఆదాయం ఎక్కడికి వెళ్తుంది, దానిని ఏ విధంగా ఖర్చు చేస్తున్నారు అనే విషయంపై అమెరికా పర్యవేక్షణ ఉండేలా వ్యవస్థలు రూపొందే అవకాశం ఉంది. ఇది రాజకీయంగా కూడా వెనిజులాపై అమెరికాకు ప్రభావం చూపే సాధనంగా మారవచ్చు.

భౌగోళిక రాజకీయ కోణం. రష్యా, చైనా వంటి దేశాలు గత దశాబ్దంలో వెనిజులాలో తమ ప్రభావాన్ని పెంచుకున్నాయి. కొత్త చట్టం ద్వారా అమెరికా కంపెనీలు, పెట్టుబడులు పెద్ద ఎత్తున ప్రవేశిస్తే, ఆ ప్రభావాన్ని సమతుల్యం చేయడం లేదా తగ్గించడం అమెరికాకు సాధ్యమవుతుంది. అంటే ఇది కేవలం ఆర్థిక సంస్కరణ కాదు... భౌగోళిక రాజకీయ వ్యూహంలో భాగం. ఈ చట్టంతో వెనిజులా ప్రజలకు వచ్చే ప్రయోజనాలపై అనేక సందేహాలు ఉన్నాయి. పారదర్శకత, జవాబుదారీతనం లేకపోతే, ఈ ప్రైవేటీకరణ మరోసారి అవినీతికి దారి తీయవచ్చు. చమురు సంపద దేశ ప్రజల సంక్షేమానికి కాకుండా, విదేశీ కంపెనీలు, కొద్ది రాజకీయ వర్గాల చేతుల్లోకి వెళ్లే ప్రమాదం ఉంది. ప్రతిపక్ష నేతలు కోరుతున్నట్లుగా బలమైన పర్యవేక్షణ వ్యవస్థలు లేకపోతే, ఈ చట్టం సామాన్య ప్రజల జీవితాల్లో పెద్ద మార్పు తేననే గ్యారంటీ లేదు. ఏదిఏమైనా, వెనిజులా చమురు పరిశ్రమను ప్రైవేటీకరించే ఈ చట్టం దేశ ఆర్థిక పునరుద్ధరణ పేరుతో తీసుకున్న చర్యగా కనిపించినప్పటికీ, అమెరికాకు దీర్ఘకాలికంగా శక్తి భద్రత, ఆర్థిక లాభాలు, రాజకీయ ప్రభావం తీసుకొచ్చే విధంగా రూపొందినదిగా చెప్పవచ్చు. ఇది వెనిజులాకు ఒక అవకాశం కావచ్చు, కానీ అదే సమయంలో అది కొత్త ఆధారపడే సంబంధానికి ఆరంభమా కాదా అన్న ప్రశ్నకు సమాధానం మాత్రం భవిష్యత్తే చెప్పాలి.

# రైతు సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత

**రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు**



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రైతు సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, తెలంగాణ విజన్ 2047 కార్యాచరణ ప్రణాళికను దృష్టిలో పెట్టుకుని నిర్ధేశిత లక్ష్యాలను చేరుకోవాలని, భవిష్యత్‌లో యూరియా, ఎరువుల పంపిణీని ఐటి ఆధారిత సేవల ద్వారా పటిష్టంగా పంపిణీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు సంబంధిత అధికారులను ఆదేశించారు. తెలంగాణ రైజింగ్ 2047 లక్ష్యాల మేరకు అన్ని ప్రభుత్వ విభాగాలకు దిశానిర్ధేశం చేసేందుకు గత మూడు రోజులుగా విభాగాల వారీగా సిఎస్ కె.రామకృష్ణారావు సమీక్ష నిర్వహించారు. అందులో భాగంగా శుక్రవారం వ్యవసాయం, సహకార, పశుసంవర్ధక, డెయిరీ అభివృద్ధి, మత్స్య, అటవీ, పర్యావరణం, శాస్త్ర సాంకేతిక, ఆహార, పౌర సరఫరాల, కార్మిక, ఉపాధి, శిక్షణ, ఫ్యాక్టరీలు, జిఎడి సర్వీసెస్ శాఖలపై డాక్టర్ బిఆర్.అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ఉన్నతాధికారులతో సమీక్షించారు. వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, హార్టికల్చర్ శాఖలలో అమలవుతున్న పథకాలపై సమీక్షించారు. ఆయిల్ పామ్ ప్లాంటేషన్, ప్రజల అవసరాల మేరకు పండ్లు, కూరగాయల పెంపకం విస్తృతంగా ప్రోత్సహించాలని సిఎస్ అధికారులకు సూచించారు. ప్రభుత్వం హైబ్రిడ్ మోడ్‌లో భాగంగా చేపట్టిన రంగారెడ్డి జిల్లా కోహెడ మార్కెట్ నిర్మాణ పనులపై సమీక్ష చేశారు. రాష్ట్రంలో రైతుల సంక్షేమం, పంటల దిగుబడి, రైతు సమస్యల పట్ల వ్యవసాయ శాఖ నిరంతర మానిటరింగ్ చేయాలని డిజిటల్ క్రాప్ సర్వే కూడా నిర్వహించాలని సిఎస్ సూచించారు. రాష్ట్రంలో వ్యవసాయ రంగం ప్రస్తుత స్థితిగతులు, రైతులకు అందుతున్న సేవలు, సాగునీటి లభ్యత, విత్తనాలు ఎరువుల సరఫరా, పంటల దిగుబడి, అలాగే సహకార శాఖ ద్వారా అమలవుతున్న వివిధ పథకాల పురోగతిపై సమగ్రంగా చర్చించారు. రానున్న సాగు కాలానికి అవసరమైన విత్తనాలు, ఎరువులు తగినంతగా అందుబాటులో ఉండేలా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను సిఎస్ ఆదేశించారు. సహకార సంఘాల పనితీరు, రైతు సహకార సంఘాల ఆర్థిక స్థితి, రుణాల పంపిణీపై సమీక్ష చేశారు. సహకార సంఘాలను మరింత పటిష్ఠం చేసి రైతులకు మెరుగైన సేవలు అందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలవుతున్నాయా లేదా అన్నదానిపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని, సమస్యలు ఎదురైన చోట వెంటనే పరిష్కరించాలని సిఎస్ స్పష్టం చేశారు. రాష్ట్రంలో పశు సంవర్ధక రంగం అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలు, డెయిరీ రంగంలో ఉత్పత్తి పెంపు, రైతులకు మెరుగైన ఆదాయం కల్పించడంపై చేపట్టిన కార్యక్రమాలు, మత్స్యశాఖ ద్వారా మత్స్యకారుల సంక్షేమానికి అమలు చేస్తున్న పథకాల పురోగతిని, పశువైద్య సేవలను గ్రామస్థాయిలో మరింత బలోపేతం చేయాలని, పశు ఆరోగ్య శిబిరాల నిర్వహణను వేగవంతం చేయాలని సిఎస్ అధికారులకు సూచించారు. సహకార డెయిరీ సంస్థల పనితీరును మెరుగుపరచడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.

## జలాశయాల్లో చేపల పెంపకంపై కార్యాచరణ

చేపల ఉత్పత్తి పెంపు, చెరువులు, కుంటలు, మల్లన్న సాగర్, కొండపోచమ్మ, మిడ్ మానేరు, పాలేరు తదితర జలాశయాల్లో చేపల పెంపకంపై కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. మత్స్యకారులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన, మత్స్యకారుల సంక్షేమ పథకాలు సమయానికి లబ్ధిదారులకు చేరేలా చూడాలని అధికారులను ఆదేశించారు. అన్ని శాఖల మధ్య సమన్వయం ఉండేలా పనిచేయాలని, ప్రభుత్వ లక్ష్యాలను క్షేత్రస్థాయిలో అమలు చేయడంలో అలసత్వం వహించకూడదని సిఎస్ స్పష్టం చేశారు. నిర్దేశిత లక్ష్యాల సాధనకు క్రమం తప్పకుండా సమీక్షలు నిర్వహించాలని సూచించారు. పౌర సరఫరాల పరిధిలో అమలవుతున్న వివిధ పథకాలు, ప్రజలకు అందుతున్న సేవలు, సరఫరా వ్యవస్థ పనితీరు, ప్రధానంగా ప్రజా పంపిణీ వ్యవస్థ, లబ్ధిదారులకు సన్న బియ్యం, గోదాముల్లో నిల్వలు, రేషన్ దుకాణాల పనితీరు, ఈపాస్ యంత్రాల వినియోగం, ఆహార భద్రత చట్టం అమలు, రేషన్ కార్డుల జారీ అంశాలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. కార్మిక, ఉపాధి, శిక్షణ, ఫ్యాక్టరీల శాఖపై ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు దాన కిషోర్, బిఎండి ఎక్కా, అటవీ శాఖ ముఖ్య కార్యదర్శి అహ్మద్ నదీమ్, పిసిసిఎఫ్ సువర్ణ, వ్యవసాయశాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, పశుసంవర్ధక శాఖ కార్యదర్శి ఇలంబర్తీ, వ్యవసాయశాఖ డైరెక్టర్ గోపి, మత్స్యశాఖ కమిషనర్ నిఖిల, హార్టికల్చర్ డైరెక్టర్ యాస్మిన్ బాషా, పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, సాధారణ పరిపాలన శాఖ కార్యదర్శి, ఇ.శ్రీధర్, డైరెక్టర్ సెన్సెస్ భారతీ హోళికెరి, ఐటి శాఖ ప్రత్యేక కార్యదర్శి భవేష్ మిశ్రా తదితరులు పాల్గొన్నారు.



# ఆర్థిక వ్యవస్థను శాసించేది మూలధనం కాదు.. నైపుణ్యమే

**'ఫీస్టా 2026' సదస్సులో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు**

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ యువతను ప్రస్తుత అంతర్జాతీయ స్థాయి అవసరాలకు అనుగుణంగా 'గ్లోబల్ వర్క్ ఫోర్స్'గా తీర్చి దిద్దాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. ఆ దిశగా యువతలో నైపుణ్యాలను పెంపొందించేందుకు స్కిల్లింగ్, రీస్కిల్లింగ్, అప్‌స్కిల్లింగ్ పై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. శుక్రవారం హైటెక్ సిటీలోని ట్రైడెంట్ హోటల్‌లో నిర్వహించిన 'ఫ్యూచర్ ఆఫ్ ఇంటెలిజెంట్ అండ్ ఎవాల్వ్ స్ట్రాటజీస్ ఇన్ టాలెంట్ ఆక్విజిషన్(ఫీస్టా) 2026' సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాబోయే రోజుల్లో ఆర్థిక వ్యవస్థ గమనాన్ని శాసించేది మూలధనం కాదని, నైపుణ్యం మాత్రమేనన్నారు. నిరంతరం నేర్చుకునే తత్వం ఉన్న చోటే ప్రతిభ నిలుస్తుందని, అదే వృద్ధికి అసలైన ప్రాతిపదిక అన్నారు. భారత వృద్ధి రేటు సుమారు 7 శాతం వరకు ఉండొచ్చని తాజాగా విడుదలైన కేంద్ర ఆర్థిక సర్వే అంచనా వేసిందన్నారు. ఇది శుభపరిణామని, అయితే... ఈ వృద్ధిని నిలబెట్టుకోవాలంటే కేవలం బడ్జెట్ కేటాయింపులు సరిపోవని, సంస్థాగత సామర్థ్యాన్ని పెంచుకోవాల్సిన అవసరముందన్నారు. కృత్రిమ మేధపై ఆధారపడటం కంటే, దానిని సమర్థవంతంగా వాడుకునేలా సంస్థలు రూపాంతరం చెందాలని, లేకపోతే... దీర్ఘకాలంలో సవాళ్లు ఎదురయ్యే ప్రమాదముందన్నారు. అత్యుత్తమ మానవ వనరులకు కేరాఫ్ అడ్రస్‌గా తెలంగాణను నిలపడంలో ఏఐ యూనివర్సిటీ, స్కిల్ యూనివర్సిటీ, ఐకాం, లైఫ్ సైన్సెస్ స్కూల్, యంగ్ ఇండియా ఇంటర్నేషన్ స్కూల్స్ కీలకపాత్ర పోషిస్తాయన్నారు. కార్యక్రమంలో అంతర్జాతీయ, జాతీయ టెక్ కంపెనీలకు చెందిన హెచ్‌ఆర్ హెడ్స్, సోషల్ టాలెంట్ ఫౌండర్ జానీ క్యాంప్ బెల్, క్యారలాన్ గ్లోబల్ సొల్యూషన్స్ ఎండి పవన్ సచ్ దేవా, క్రౌడ్ స్ట్రైక్ వైస్ ప్రెసిడెంట్ రాజేష్ మీనన్, ప్రముఖ నటి, రచయిత్రి మందిరా బేడీ, ఫీస్టా 2026 ఆర్గనైజింగ్ కమిటీ ప్రతినిధులు హరికృష్ణ, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ పారిశ్రామిక–ఐటి మౌలిక సదుపాయాలపై రీకో బృందం అధ్యయనం

**టిజిఐఐసిని సందర్శించిన రాజస్థాన్ ఉన్నత స్థాయి ప్రతినిధులు**



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రంలో అమలవుతున్న ఆధునిక పారిశ్రామిక, ఐటి మౌలిక సదుపాయాల విధానాలను అధ్యయనం చేయడానికి రాజస్థాన్ ప్రభుత్వానికి చెందిన రీకో (ఆర్ఐఐసిఐ) ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం శుక్రవారం హైదరాబాద్‌లో పర్యటించింది. రాజస్థాన్ స్టేట్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (రీకో) మేనేజింగ్ డైరెక్టర్ శివంగి స్వర్ణ కార్ నేతృత్వంలో ఈ బృందం తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ (టిజిఐఐసి) ఆధ్వర్యంలోని కీలక పారిశ్రామిక, ఐటి కేంద్రాలను సందర్శించింది. పెట్టుబడులకు అంతర్జాతీయ గమ్యస్థానంగా తెలంగాణను నిలిపిన టిజిఐఐసి అనుసరిస్తున్న ఉత్తమ విధానాలను (బెస్ట్ ప్రాక్టీసెస్) అవగాహన చేసుకోవడం ఈ పర్యటన ప్రధాన లక్ష్యంగా ఉంది. ఈ క్రమంలో రీకో బృందం హైటెక్ సిటీ, మైండ్‌స్పేస్ ఐటి పార్క్, జీనోమ్ వ్యాలీతో పాటు రవిర్యాల, మహేశ్వరం (ఈ–సిటీ)లోని ఎలక్ట్రానిక్ మాన్యుఫ్యాక్చరింగ్ క్లస్టర్లను సందర్శించి అక్కడి మౌలిక వసతులను పరిశీలించింది. క్షేత్రస్థాయి పర్యటనల అనంతరం రీకో ప్రతినిధి బృందం టిజిఐఐసి ప్రధాన కార్యాలయంలో వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కె.శశాంకతో పాటు ఇతర విభాగాధిపతులతో ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా శశాంక తెలంగాణ రైజింగ్ విజన్ 2047 కార్యాచరణను వివరించారు. రాష్ట్రాన్ని 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే దిశగా తెలంగాణ వేగంగా ముందుకెళ్తోందని తెలిపారు. ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి నాయకత్వం, పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్ బాబు మార్గదర్శకత్వంలో తెలంగాణ పారిశ్రామిక రంగం దేశంలోనే అగ్రస్థానంలో నిలుస్తోందని పేర్కొన్నారు.

**టిజిఐఐసి విధానాలపై ప్రశంసలు**

భూ కేటాయింపులు, పారిశ్రామిక పార్కుల నిర్వహణ, మౌలిక సదుపాయాల కల్పనలో టిజిఐఐసి అనుసరిస్తున్న సరళీకృత విధానాలను రీకో ఎం.డి శివంగి స్వర్ణ కార్ అభినందించారు. తెలంగాణలోని ఐటి, లైఫ్ సైన్సెస్ రంగాలు దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయని ఆమె ప్రశంసించారు.

# పేరు మాత్రమే మారింది.. జల దోపిడీ ఆగలేదు

**మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు**



**ప్రజాపక్షం/హైదరాబాద్:** నల్లమల సాగర్ డిపిఆర్‌ను, ప్రాజెక్ట్ అనుమతుల ప్రక్రియను, ప్రీ ఫీజుబులిటీ రిపోర్టును ఆపినట్టుగా ఎపి ప్రభుత్వం లేదా?, కేంద్రం హామీ నిచ్చిందా? అని బిఆర్‌ఎస్‌ఎల్‌పి ఉప నాయకుడు తన్నీరు హరీశ్‌రావు ప్రశ్నించారు. బనకచర్ల లేదా నల్లమల సాగర్ ఏదైనా కేవలం పేరు మాత్రమే మారిందని, ఎపి జల దోపిడి మాత్రం ఆగలేదని ఆరోపించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ పేరుకు జలవివాదాల మీటింగ్ అని, మన 200 టిఎంసిలను గంపగుత్తగా తరలించేందుకు నల్లమలసాగర్ అనే ప్రాజెక్టు సంబంధించిన కుట్ర అని అన్నారు. గతంలో 9వ గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు మీటింగ్‌లో కాళేశ్వరం, గోదావరి, సీతారామ లిఫ్ట్ ప్రాజెక్టు, తుపాకులగూడెం, మిషన్ భగీరథ, చనాక కొరటా, రామప్ప డైవర్షన్‌లు అన్నీ అక్రమ ప్రాజెక్టులని, వీటిని నిలిపి వేయాలని యుపి సిఎం ఆదిత్యానాథ్ దాస్ సూచించినట్టు హరీశ్ రావు తెలిపారు. తెలంగాణ నీటి హక్కులను గంపగుత్తగా ఎపికి అప్పగించడమే 'ఢిల్లీ చర్చల లక్ష్యమా' అని ఆయన ప్రశ్నించారు. జల ద్రోహం విషయంలో కత్తి చంద్రబాబుదని, పొడిచేది రేవంత్ రెడ్డినేనని ఆరోపించారు. గోదావరిలో 400 టిఎంసిలకు గతంలో కెసిఆర్ కేంద్రం నుంచి అనుమతులు తీసుకొచ్చారని, దీనిపైన పది డిపిఆర్‌లను పంపించి, ఏడు ప్రాజెక్టులకు అనుమతులు సాధించామని వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్ల కాలంలో ఒక్క డిపిఆర్‌ను పంపిందని, ఒక్క అనుమతిని కూడా తీసుకొచ్చింది లేదని తెలిపారు. వార్ధా, కాళేశ్వరం మూడో టిఎంసిలకు సగం అనుమతులు వస్తే, పూర్తి చేయకుండా డిపిఆర్‌లు వాపస్ వచ్చాయని, రేవంత్ రెడ్డి పాలనలో డిపిఆర్‌లు వాపస్ వచ్చిన పరిస్థితి నెలకొన్నదని ఎద్దేవా చేశారు. కెసిఆర్ పాలనలో తెలంగాణ అద్భుతమైన ప్రగతిని సాధించిందని, 2 కోట్ల 20లక్షల ఎకరాల మాగాణిగా మారిందని, కాళేశ్వరం, మిషన్ కాకతీయ ద్వారా అద్భుతమైన ఆయకట్టు వచ్చిందని, కాళేశ్వరం ద్వారా 17 లక్షల 823 ఎకరాల స్థిరీకరణ, మిషన్ కాకతీయ ద్వారా పదిహేను లక్షల ఎకరాల ఆయకట్టు సాధ్యమైందని, 32 లక్షల ఎకరాల ఆయకట్టు బిఆర్‌ఎస్ సాధించిందని, కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ ఇప్పటికైనా నోరు పారేసుకోక పోవడం మంచిదని సూచించారు. సిఎం రేవంత్ రెడ్డికి ఢిల్లీకి, దావోస్ కు తిరగడమే తప్ప పాలనపైన దృష్టి లేదన్నారు. పోలవరం, నల్లమల సాగర్ విషయంలో రేవంత్ ప్రభుత్వం ఒక పద్ధతి ప్రకారమే ఎపికి సహకరిస్తున్నదని ఆరోపించారు.




# ఇది కులగణన కాదు.. జనగణన మాత్రమే

**కాంగ్రెస్ టిపిసిసి ప్రధాన కార్యదర్శి రుద్ర సంతోష్ కుమార్**

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం మరోసారి వెనుకబడిన వర్గాలను మోసం చేసిందని, ఎస్‌సి, ఎస్‌టి, ఇతరులు అని మాత్రమే పేర్కొని ఒబిసిలను, అలాగే అన్ని కులాలను విస్మరించి, అవమానించిందని కాంగ్రెస్ టిపిసిసి ప్రధాన కార్యదర్శి రుద్ర సంతోష్ కుమార్ అన్నారు. ఈ విషయంపై మరో జాతీయ ఉద్యమాన్ని కాంగ్రెస్ పార్టీ ప్రారంభిస్తుందని చెప్పారు. గాంధీభవన్‌లో శుక్రవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం జనవరి 22న విడుదల చేసిన 33 ప్రశ్నలతో కూడిన గెజిట్‌లో క్వశ్చన్ 12లో ఎస్‌సి, ఎస్‌టి, ఇతరులు అని మాత్రమే పేర్కొని, ఒబిసి, జనరల్ అనే విభాగాన్ని ఉద్దేశపూర్వకంగా తొలగించిందని విమర్శించారు. అలాగే, ఆ ఫారంలో ఎక్కడా క్యాస్ట్ అనే పదాన్ని ఉపయోగించకపోవడం ద్వారా ఇది కులగణన ఎలా అవుతుందని ప్రశ్నించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం రాహుల్ గాంధీ నినాదం 'జిస్కీ జిత్నీ ఆబాది, ఉస్కీ ఉత్నీ హిస్సేదారి' అనుసరించి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శనంలో అసెంబ్లీలో గెజిట్ విడుదల చేసి, మూడు నెలల పాటు ఇంటింటి సర్వే నిర్వహించి, ప్లానింగ్ డిపార్ట్‌మెంట్ ద్వారా నివేదిక సిద్ధం చేసిందని తెలిపారు. తెలంగాణలో అన్ని వర్గాల లెక్కలను అసెంబ్లీ వేదికగా ప్రజల ముందుకు తీసుకువచ్చారని, అలాగే 80కి పైగా ప్రశ్నలతో సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే నిర్వహించారని రుద్ర సంతోష్ కుమార్ వివరించారు. కార్యక్రమంలో పిసిసి ప్రధాన కార్యదర్శి కత్తి వెంకటస్వామి, ఓబిసి కన్వీనర్ కేతూరి వెంకటేష్, అధికార ప్రతినిధి కౌశిక్ యాదవ్, హైదరాబాద్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కొత్త శ్రీనివాస్, ఓబిసి వర్కింగ్ చైర్మన్ తూము వినయ్, విజయ్ భాస్కర్ ఇతర నాయకులు పాల్గొన్నారు.

# గాంధీ బోధనలు నేటి తరానికి అవసరం

**రాష్ట్ర బిసి కమిషన్ చైర్మన్ జి.నిరంజన్**

**ప్రజాపక్షం/హైదరాబాద్:** మహాత్మాగాంధీ బోధనలు నేటి తరానికి ఎంతో అవసరమని రాష్ట్ర బిసి కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ అన్నారు. ఖైరతాబాద్‌లోని తెలంగాణ బిసి కమిషన్ కార్యాలయంలో శుక్రవారం మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి, ఆ తదుపరి రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా జి.నిరంజన్ మాట్లాడుతూ ప్రపంచమంతా నేడు ఉద్రిక్తత వాతావరణం చూస్తున్నా మనము, దేశాల మధ్య సుద్భావన, సోదర భావం నెలకొనేందుకు గాంధీ శాంతి మార్గమే ఏకైక మార్గమని అన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, అసిస్టెంట్ సెక్రటరీ మనోహర్, డెప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్, స్పెషల్ ఆఫీసర్ సునీత, సెక్షన్ ఆఫీసర్ సతీష్ కుమార్‌తో పాటు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.


# మహాత్ముని అడుగుజాడలే మనకు మార్గదర్శకం

**ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి**

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆ మహనీయునికి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా గాంధీజీ దేశానికి చేసిన సేవలను, ఆయన పోరాట పటిమను సిఎం గుర్తుచేసుకున్నారు. 'అహింసను ఆయుధంగా, సత్యాన్ని మార్గంగా మార్చుకుని, అలుపెరగని పోరాటంతో భారతదేశానికి స్వాతంత్ర్యాన్ని అందించిన మహోన్నతవ్యక్తి మహాత్మా గాంధీ' అని ముఖ్యమంత్రి కొనియాడారు. బాపు జీవితం ప్రతి ఒక్కరికీ ధైర్యం, సహనం, మానవత్వాన్ని నేర్పే ఒక అమూల్యమైన పాఠమని ఆయన అన్నారు. గాంధీజీ ఆశయాలను కేవలం స్మరించుకోవడమే కాకుండా, వాటిని మన నిత్య జీవితంలో ఆచరించడమే ఆ మహనీయునికి మనం ఇచ్చే నిజమైన నివాళి అని అన్నారు. గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని నిర్వహించే 'అమరవీరుల సంస్మరణ దినం' సందర్భంగా, దేశ రక్షణ కోసం, స్వాతంత్ర్యం కోసం తమ ప్రాణాలను త్యాగం చేసిన వీరులందరిని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా స్మరించుకున్నారు. వారి త్యాగాలు దేశానికి ఎప్పటికీ స్ఫూర్తిదాయకమని అన్నారు.

**నేటి సమాజానికి గాంధీ మార్గమే శరణ్యం**

నాంపల్లిలోని గాంధీ భవన్‌లో టిపిసిసి ఆధ్వర్యంలో గాంధీజీ వర్ధంతి వేడుకలు జరిగాయి. టిపిసిసి అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్ గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ, గాంధీజీ బోధించిన సత్యం, అహింస, సమానత్వం వంటి విలువలు ప్రస్తుత సమాజానికి ఎంతో అవసరమని తెలిపారు. గాంధీజీ ఆశయాలను క్షేత్రస్థాయిలోకి తీసుకువెళ్లడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు హార్కర్ వేణుగోపాల్, వి.హనుమంతరావు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి వ్యాఖ్యలు అత్యంత ఆక్షేపణీయం

**ఐపిఎస్ అధికారుల సంఘం**

**ప్రజాపక్షం/హైదరాబాద్:** వీణవంక మినీ సమ్మక్క సారలమ్మ జాతర సందర్భంగా ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి గురువారం పోలీసుల మీద చేసిన వ్యాఖ్యలను, వారి ప్రవర్తనను తీవ్రంగా ఐపిఎస్ అధికారుల సంఘం తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు సంఘం కార్యదర్శి విక్రమ్‌సింగ్ మాన్ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండగా గుంపులుగా వెళ్లడమే కాకుండా, బాధ్యత గల ప్రజాప్రతినిధి అయి ఉండి కోర్టు ఉత్తర్వులను ఉల్లంఘిస్తూ వెళ్ళడానికి ప్రయత్నించి శాంతి భద్రతలకు విఘాతం కలిగించడం దురదృష్టకరమని ఆయన పేర్కొన్నారు. అక్కడ ఉత్పన్నమయ్యే శాంతి భద్రతల పరిస్థితి గురించి, కోర్టు ఉత్తర్వుల గురించి పోలీసు అధికారులు ఎమ్మెల్యే పూర్తిగా వివరించినప్పటికీ వారు అనుచితంగా ప్రవర్తించడమే కాక మహిళా పోలీసు అధికారులపట్ల కూడా దురుసుగా ప్రవర్తించి శాంతి భద్రతలకు విఘాతం కలిగించడం గర్హనీయమన్నారు. ఒక బాధ్యత గల ఎమ్మెల్యే పోలీసు అధికారుల మత ప్రస్తావన తేవడం అత్యంత గర్హనీయమని పేర్కొన్నారు. పైగా అక్కడ ప్రత్యక్షంగా లేని కరీంనగర్ పోలీస్ కమిషనర్‌ని ఉద్దేశించి, మత ప్రస్తావన చేస్తూ చేసిన వ్యాఖ్యలు అత్యంత హేయమైనవన్నారు. ప్రజల పట్ల, శాంతి భద్రతల పట్ల నిబద్ధతతో విధులు నిర్వర్తిస్తున్న తెలంగాణ పోలీసుల ఖ్యాతిని ఎవరూ విస్మరించలేరని గుర్తు చేశారు. అలాంటి వ్యవస్థ మీద మత పరమైన వ్యాఖ్యలు చేయడం అత్యంత గర్హనీయం. ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి వెంటనే తన అసంబద్ధ వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని, పోలీసు అధికారులకు క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. కౌశిక్‌రెడ్డి వ్యాఖ్యలను పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు గోపిరెడ్డి కూడా ఖండించారు. వెంటనే ఆయన క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.


**GHMC గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయం, శేరిలింగంపల్లి సర్కిల్-49, ఎస్ఎల్‌పి జోన్ : జిహెచ్ఎంసి.

'ఇ' ప్రొక్యూర్‌మెంట్ నోటీసు

NIT No.48/EE/CIR-49/SLPZ/GHMC/1/2025-26 తేదీ: 29-01-2026

**పని కేటగిరి:** ఇతర పనులు, **అంచనా విలువ:** రూ.32.00 లక్షలు, **బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేదీ & సమయం:** 31.01.2026న మ.03.00గం.ల నుండి 07.02.2026న మ.03.00గం.ల వరకు, **అధికారి పేరు & చిరునామా:** ఇఇ, సర్కిల్-49, ఎస్ఎల్‌పిజెడ్, జిహెచ్ఎంసి. సెల్: 9000115410.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్-49, జిహెచ్ఎంసి.

DIPR R.O. No. : 14712-PP/CL/ADVT/1/2025-26, Date: 30-01-2026

**GHMC గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ :: మాదాపూర్ సర్కిల్-50**

Lr No.04/GHMC/MPR-50/EE/2025-26 తేదీ: 30-01-2026

**NIT No.**04/GHMC/MPR-50/EE/2025-26, తేదీ: 30-01-2026, **పని పేరు:** ఏర్పాట్లను అందించడం, **అంచనా విలువ:** రూ.1.50 లక్షలు, **బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేదీ & సమయం:** 30.01.2026న మ.03.00గం.ల నుండి 02.02.2026న మ.03.00గం.ల వరకు, **అధికారి పేరు & చిరునామా:** శ్రీ డి.గోవర్ధన్ గౌడ్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, జిహెచ్ఎంసి, మాదాపూర్ సర్కిల్-50, సెల్: 9154299633. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా https://tender.telangana.gov.in/లో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, మాదాపూర్ సర్కిల్-50, జిహెచ్ఎంసి.

DIPR R.O. No. : 14764-PP/CL/ADVT/1/2025-26, Date: 30-01-2026

**GHMC గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
సూపరింటెండింగ్ ఇంజనీర్ కార్యాలయం, శంషాబాద్ జోన్, జిహెచ్ఎంసి, హైదరాబాద్.

టెండర్ నోటీస్ నెం. 01/SE/SHBD/GHMC/2025-26, తేదీ: 24.01.2026, (7 రోజులు)కు సవరణ

| ఐటమ్ నెం. | పని పేరు | అమౌంట్ (రూ. లక్షలలో) |
|---|---|---|
| 1 | 2026-27 సంవత్సరానికి జిహెచ్ఎంసి, ఆదిభట్ల సర్కిల్-15, తొర్రూర్, 53వ వార్డులోని వర్షపు నీటి కాలువలు, డ్రెయిన్లు మరియు కుంట కాలువల్లో పూడికతీత పనులు. | 79.00 |
| 2 | 2026 సంవత్సరానికి జిహెచ్ఎంసి, శంషాబాద్ జోన్, బడంగ్‌పేట్ సర్కిల్ 16, నాదర్‌గుల్, 57వ డివిజన్‌లోని వివిధ నాలాల్లో వర్షపు నీటి కాలువల వార్షిక పూడికతీత మరియు నిర్వహణ పనులు. | 63.00 |
| 3 | 2026 సంవత్సరానికి జిహెచ్ఎంసి, శంషాబాద్ జోన్, బడంగ్‌పేట్ సర్కిల్ 16, బడంగ్‌పేట్, 61వ డివిజన్‌లోని వివిధ నాలాల్లో వర్షపు నీటి కాలువల వార్షిక పూడికతీత మరియు నిర్వహణ పనులు. | 55.00 |
| | మొత్తం | 197.00 |

| | ఈవెంట్స్ | ప్రస్తుత తేది & సమయం | సవరించిన తేది & సమయం |
|---|---|---|---|
| I | బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ప్రారంభ తేది | 28.01.2026@03.00PM | 30.01.2026@10.00AM |
| II | డౌన్‌లోడ్ ఆఖరి తేది | 03.02.2026@03.00PM | 06.02.2026@3.00PM |
| III | బిడ్స్ స్వీకరణకు ఆఖరి తేదీ & సమయం | 03.02.2026@03.00PM | 06.02.2026@3.00PM |
| IV | ప్రైస్ బిడ్స్ ప్రారంభం | 03.02.2026@03.00PM | 06.02.2026@3.00PM |

**అధికారి చిరునామా:** శ్రీ డి. కిష్టప్ప, సూపరింటెండింగ్ ఇంజనీర్, శంషాబాద్ జోన్, జిహెచ్ఎంసి, హైదరాబాద్. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @ www.tender.eprocurement.gov.in లో చూడవచ్చు.

సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్, శంషాబాద్ జోన్, జిహెచ్ఎంసి.

DIPR R.O. No. : 14770-PP/CL/ADVT/1/2025-26, Date: 30-01-2026





యువకుల వేధింపులు

## మహిళా కానిస్టేబుల్ ఆత్మహత్య



ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్: ఇద్దరు యువకుల వేధింపులతో ఓ మహిళా కానిస్టేబుల్ ఆత్మహత్య చేసుకున్న సంఘటన వరంగల్ జిల్లాలోని పర్వత గిరి మండలంలో చోటుచేసుకున్నది. హనుమకొండ పోలీసుల కథనం ప్రకారం.. వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం సీత్యాతండాకు చెందిన అనిత వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఎఆర్ విభాగంలో కానిస్టేబుల్‌గా పనిచేస్తుంది. ఆమెను పెళ్లి చేసుకుంటానని దూరపు బంధువైన మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ మండలం కొమ్మనపల్లి తండాకు చెందిన రాజేందర్ నాలుగేళ్లుగా చెబుతూ వస్తున్నాడు. కానీ డ్యూటీలో ఉండగా వీడియో కాల్ చేయాలని.. వేరే ఎవరితోనూ చనువుతో మాట్లాడవద్దని కొంతకాలంగా వేధింపులకు పాల్పడ్డాడు. రాజేందర్ వైఖరి నచ్చకపోవడంతో ఈ విషయాన్ని అనిత తన తల్లిదండ్రులకు చెప్పింది. దీంతో అనితను ఇచ్చి పెళ్లి చేయడం కుదరదని రాజేందర్‌కు తెగేసి చెప్పా రు. అయినా అనితను ఇచ్చిపెళ్లి చేయాలని బతిమిలాడుతూనే ఉన్నాడు. ఈ క్రమంలో అనితకు తన క్లాస్‌మేట్ జబ్బార్ లాల్‌తో చనువు ఏర్పడింది. అతడిని పెళ్లి చేసుకోవాలని అనుకుంటున్నట్లు రాజేందర్‌కు తెలిసింది. కోపం తో జబ్బార్‌కు రాజేందర్ ఫోన్ చేసి అనిత గురించి తప్పుగా చెప్పాడు. అప్పటి నుంచి జబ్బార్ కూడా అనితను వేధించడం మొదలుపెట్టాడు. పెళ్లి చేసుకోవాలంటే డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాడు. ఇద్దరి వేధింపులతో మానసికంగా కుంగిపోయిన అనిత ఈ నెల 27న రాజేందర్‌కు ఫోన్ చేసి కన్నీళ్లు పెట్టుకుంది. నువ్వు, జబ్బార్ కలిసి నా జీవితాన్ని నాశనం చేశారు.. మీ వల్లే ఆత్మహత్య చేసుకుంటున్నానని చెప్పింది. కానీ రాజేందర్ ఆ మాటలను ఏ మాత్రం పట్టించుకోలేదు. చస్తే చావు అంటూ రాజేందర్ నిర్లక్ష్యంగా సమాధానం చెప్పాడు. దీంతో వెంటనే గడ్డిమందు తాగి అనిత ఆత్మహత్యకు పాల్పడింది. ఇది గమనించిన కుటుంబసభ్యులు అనితను హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ అనిత మరణించింది. అనిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# 'సుప్రీం' వ్యాఖ్యలు రాజ్యాంగ విలువలకు విఘాతం



తక్షణం వెనక్కు తీసుకోవాలి

కార్మిక సంఘాలు ఆర్థికాభివృద్ధికి అడ్డంకి కాదు

హక్కుల రక్షణకు రాజ్యాంగం గుర్తించిన ప్రజాస్వామ్య సంస్థలు : ఎఐటియుసి జాతీయ ప్రధాన కార్యదర్శి అమర్‌జీత్ కౌర్

న్యూఢిల్లీ: పారిశ్రామిక స్తబ్దతకు 'ప్రతిఘటనతో కూడిన ట్రేడ్ యూనియన్ వాదం' కారణమంటూ సుప్రీంకోర్టు చేసిన విమర్శను అఖిల భారత ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఏఐటీయూసీ) తీవ్రంగా ఖండించింది. రాజ్యాంగంలో పొందుపర్చిన సోషలిస్ట్ ప్రజాస్వామ్య ఆదర్శాలకు హాని కలిగించే విధంగా ఈ వ్యాఖ్యలున్నాయని... రాజ్యాంగ విలువల్ని దెబ్బతీస్తాయని పేర్కొంది. గౌరవనీయ సుప్రీంకోర్టు ఈ వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేసింది. ఈమేరకు ఏఐటీయూసీ జాతీయ ప్రధాన కార్యదర్శి అమర్‌జీత్‌కౌర్ శుక్రవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పెన్ తోజిలార్గల్ సంఘం, ఇతర కార్మిక సంఘాలు దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యం విచారణ సందర్భంగా గురువారం భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చిలతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం... పని ప్రతిఘటన సంస్కృతి, జెండా మోసే కార్మిక సంఘాల బలమైన నాయకత్వం దేశవ్యాప్తంగా అనేక పారిశ్రామిక సంస్థల మూసివేతకు దారితీశాయని పేర్కొంది. గృహ కార్మికులకు కనీస వేతనాలు కోరుతూ దాఖలైన పిటిషన్‌ను స్వీకరించడానికి నిరాకరించడంతో పాటు సుప్రీం కోర్టు చేసిన ఈ వ్యాఖ్యలు తీవ్రంగా ఆందోళన కలిగించేవిగా ఉన్నాయని కౌర్ పేర్కొన్నారు.

సామాజిక న్యాయం, సమానత్వం, శ్రమ గౌరవం అనే రాజ్యాంగ ఆదేశానికి విరుద్ధంగా ఉన్నాయని తెలిపారు. ఇటువంటి ప్రకటనలు కార్మికుల పోరాటాలను చట్టవిరుద్ధం చేసే ప్రమాదం ఉందని... కార్మిక హక్కులను పరిరక్షించడంలో కార్మిక సంఘాల ప్రజాస్వామ్య పాత్రను బలహీనపరిచే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. సుప్రీం కోర్టు ప్రకటనలు కార్మిక హక్కులను నీరుగార్చడమే గాక సమిష్టి చర్యను అణచివేసే చర్యల్ని సమర్థించటట్లున్నాయని ఆందోళన వెలిబుచ్చారు. కార్మిక సంఘాలు ఆర్థికాభివద్ధికి అడ్డంకులు కావని ఆమె స్పష్టం చేశారు. కార్మికుల గౌరవం, జీవనోపాధి, హక్కులను కాపాడటానికి రాజ్యాంగం గుర్తించిన ప్రజాస్వామ్య సంస్థలని గుర్తెరగాలన్నారు. అసోసియేషన్లు, సంఘాలను ఏర్పాటు చేసుకునే హక్కు ఆర్టికల్ 19(1)(సి) ప్రకారం ప్రాథమిక హక్కు అని, సామూహిక బేరసారాలు అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన కార్మిక హక్కు అని తెలిపారు. పారిశ్రామిక స్తబ్దతకు కారణంగా ట్రేడ్ యూనియన్ కార్యకలాపాలను చిత్రీకరించడం అంటే ఆర్థిక వాస్తవాలను తప్పుగా అర్థం చేసుకోవడం, అదుపులేని కార్పొరేట్ కేంద్రీకరణకు దారితీసే కార్పొరేట్ అనుకూల విధానాల విధ్వంసక పరిణామాలను విస్మరించడమేనని కౌర్ అభిప్రాయపడ్డారు. ప్రత్యేకించి గృహ కార్మికుల కనీస వేతనాలను గుర్తించకపోవడం పట్ల ఏఐటీయూసీ ఆందోళన వ్యక్తం చేస్తోందన్నారు. ఈ శ్రామిక వర్గంలో అత్యధికంగా అనధికారికంగా, సామాజికంగా అణగదొక్కబడినవారు, ప్రధానంగా మహిళలు ఉన్నారని... రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 15, 16, 21 ల స్ఫూర్తిని సుప్రీంకోర్టు విస్మరించడం, సామాజిక మరియు ఆర్థిక అసమానతలను పరిష్కరించడానికి రాజ్యాంగ మార్గాలను తిరస్కరించడం పట్ల కౌర్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. గౌరవనీయ సుప్రీంకోర్టు చేసిన ఈ వ్యాఖ్యలను తక్షణం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

## మూడో వ్యక్తి ద్వారా దత్తతకు చట్టబద్ధత లేదు: హైకోర్టు

ప్రజాపక్షం/హైదరాబాద్ : కన్న తల్లిదండ్రులు కాకుండా మూడో వ్యక్తి ద్వారా తీసుకున్న దత్తతకు చట్టబద్ధత ఉండదని హైకోర్టు తీర్పు చెప్పింది. శిశువుల అక్రమ రవాణా కేసు ఎదుర్కొంటున్న వ్యక్తి ద్వారా పసికందును దత్తత పొందిన వారికి ఆ చిన్నారిని అప్పగించాలని ఆదేశాలు ఇవ్వబోమని స్పష్టం చేసింది. దత్తత ప్రక్రియ సెంట్రల్ అడాప్షన్ రిసోర్స్ అథారిటీ (సీపీఆర్‌ఏ) మార్గదర్శకాల ప్రకారం లేకపోతే చెల్లదని తీర్పు చెప్పింది. నల్లగొండ జిల్లాకు చెందిన వెంకన్న, స్రవంతి దంపతులకు సంతానం లేకపోవడంతో యాదగిరి అనే వ్యక్తి ద్వారా ఒక చిన్నారిని దత్తత తీసుకున్నారు. చిన్నారి పుట్టినరోజును కూడా ఘనంగా నిర్వహించారు. అయితే, పిల్లలను విక్రయిస్తున్నాడని యాదగిరిపై కేసు ఉండటంతో పోలీసులు చిన్నారిని తీసుకుని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని బాలల సంక్షేమ కమిటీకి అప్పగించారు. ఈ చర్యను సవాల్ చేస్తూ వెంకన్న హైకోర్టులో వేసిన పిటిషన్‌ను జస్టిస్ మాధవీదేవి విచారించారు. చిన్నారిని పిటిషనర్లు చాలా ఆప్యాయంగా, ప్రేమగా కన్నబిడ్డగా చూసుకుంటున్నారని, వారికే చిన్నారిని అప్పగించేలా ఆదేశాలు ఇవ్వాలని పిటిషనర్ తరఫు న్యాయవాది రాపోలు భాస్కర్ వాదించారు. పిల్లలు లేకపోవడంతో అనాథ పిల్లల్లో ఒకరిని దత్తత ఇవ్వాలంటూ పిటిషనర్లు చేసుకున్న దరఖాస్తు కలెక్టర్ వద్ద పెండింగ్‌లో ఉందని, ఈలోగా ఈ చిన్నారిని దత్తత తీసుకున్నారని వివరించారు. దీనిపై నల్లగొండ జిల్లా సంక్షేమ, బాలల పరిరక్షణ అధికారి తరఫున ప్రభుత్వ న్యాయవాది వాదనలు వినిపిస్తూ, యాదగిరి పిల్లల అక్రమ రవాణా ముఠాలో సభ్యుడని, అనేక మంది నుంచి డబ్బులు తీసుకుని చిన్నారులను విక్రయించినట్లు దర్యాప్తులో వెల్లడైందని తెలిపారు. ఈ మేరకు పోలీసుల కేసులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఇరు పక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి, చిన్నారిని కన్న తల్లిదండ్రుల నుంచి కాకుండా, ప్రతిఫలం ఇచ్చి యాదగిరి ద్వారా దత్తత పొందినందున దత్తత చెల్లదని తీర్పు చెప్పారు. కాబట్టి పోలీసులు చిన్నారిని జిల్లా బాలల సంక్షేమ కమిటీకి అప్పగించడం సబబేనని తేల్చారు. పిటిషన్‌ను కొట్టేశారు.

## బాపుఘాట్‌లో మహాత్ముడికి ఘన నివాళి



పాల్గొన్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, డిప్యూటీ సిఎం భట్టి

ప్రజాపక్షం/హైదరాబాద్ : మహాత్మాగాంధీ వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం లంగర్‌హౌస్‌లోని బాపు ఘాట్ వద్ద నివాళులర్పించే కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ బాపు ఘాట్ వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి అంజలి ఘటించారు. అనంతరం బాపు ఘాట్‌లోని ప్రార్థన మందిరంలో ఏర్పాటు చేసిన సర్వమత ప్రార్థనల్లో వారు పాల్గొన్నారు. గాంధీజీ విగ్రహం వద్ద పూలమాలలు వేసి, ఆయన త్యాగాలను స్మరిస్తూ రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారులు హర్కర వేణుగోపాల్, టిపిసిసి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, బిసి కమిషన్ చైర్మన్ నిరంజన్, మాజీ రాజ్యసభ సభ్యులు వి. హనుమంతరావు, ప్రభుత్వ యంత్రాంగం తరపున స్పెషల్ చీఫ్ సెక్రటరీ దాన కిషోర్, జిల్లా కలెక్టర్ హరి చందన దాసరి, అదనపు డిజి మహేశ్ భగవత్, అదనపు పోలీస్ కమిషనర్ తాఫ్సీర్ ఇక్బాల్, జిహెచ్‌ఎంసి కమిషనర్ కర్ణన్ తదితర ఉన్నతాధికారులు బాపుకు నివాళులు అర్పించిన వారిలో ఉన్నారు.


## చిన్న నీటిపారుదల పునర్వ్యవస్థీకరణ కమిటీ నివేదిక అందజేత



ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలోని చిన్న నీటిపారుదల పునర్వ్యస్థీకరణ కోసం 15 మంది నిపుణుల కమిటీ 45 పేజీలతో కూడిన నివేదికను తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ ఛైర్మన్ ఎం.కోదండరెడ్డికి అందజేసింది. ఈ మేరకు కమిటీ రైతు కమిషన్ 15 మంది నిపుణులతో కమిటీని వేసిన విషయం తెలిసిందే. అందులో రిటైర్డ్ ఐఎఎస్ డబ్ల్యు ఆర్ రెడ్డి ,జి.వి. రమణ రెడ్డి నీటిపారుదల, వ్యవసాయ శాఖ అధికారులు వ్యవసాయ రంగ నిపుణులతో కూడిన 15 మందితో కూడిన కమిటీ హైదరాబాద్‌లోని వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ కార్యాలయంలో కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, కమిషన్ సభ్యులు భూమి సునీల్, మెంబర్ సెక్రెటరీ గోపాల్‌కు నివేదికను అందజేశారు. ఈనివేదికను కమిషన్ పూర్తి స్థాయిలో అధ్యయనం చేసి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదికను సమర్పించనుంది. కాగా రాష్ట్రంలో మేజర్, మైనర్ ఇరిగేషన్‌లను విడిదీసి మైనర్ ఇరిగేషన్‌పైన ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ గతంలో ప్రభుత్వానికి సూచించింది. చెరువుల నిర్వహణ, పునరుద్ధరికరణ కోసం నీటి సంఘాలను కూడా ఏర్పాటు చేయాలని కోరిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగానే కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ బృందం గత మూడు నెలలుగా క్షేత్ర స్థాయిలో పర్యటించి 45 పేజీలతో నివేదికను రూపొందించింది.

## మాస్టర్ ప్లాన్‌తో పనులు

ఫైనాన్సియల్ డిస్ట్రిక్ట్ కోసం ప్రత్యేకం



ప్రజాపక్షం/హైదరాబాద్: మాస్టర్ ప్లాన్ 2047 ఆధారంగా మురుగు, సీవరేజ్ లైన్ల సమస్యను పరిష్కరిస్తామని జల మండలి ఎండీ అశోక్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన అభివృద్ధి చెందుతున్న నానక్‌రాంగూడ, ఫైనాన్సియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతాలను జలమండలి అధికారులతో కలిసి పరిశీలించారు. స్థానికంగా నెలకొన్న మురుగు, సీవరేజ్ లైన్ల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని మాస్టర్‌ప్లాన్ 2047 ఆధారంగా సీవరేజ్ లైన్లు, ట్రంక్ మెయిన్ల అభివృద్ధికి మినీ సీవరేజ్ ప్లాన్‌లను రూపొందించాలని ఆదేశించడం జరిగింది. గచ్చిబౌలి నుంచి కోకాపేట్ పరిసరాల్లో ఉత్పన్నం అవుతున్న మురుగును కోకాపేట్ ఎస్‌టీపీకి తరలించి శుద్ధి చేసేందుకు సీవర్ ట్రంక్ మెయిన్ నిర్మాణం కోసం ప్రతిపాదనలు సమర్పించాలని కోరారు.

## ఎడ్ సెట్‌లో ర్యాంకులు సాధించేందుకు టి-సాట్ డిజిటల్ కంటెంట్

ప్రసారాల షెడ్యూల్ పోస్టర్‌ను ఆవిష్కరించిన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



ప్రజాపక్షం/హైదరాబాద్: ఎడ్ సెట్‌లో ఉన్నతమైన ర్యాంకులు సాధించేందుకు టిసాట్ అందించే డిజిటల్ కంటెంట్‌ను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సూచించారు. టిసాట్ నెట్‌వర్క్ ఛానళ్లు ప్రసారం చేసే ఎడ్ సెట్ ప్రసారాల షెడ్యూల్ పోస్టర్‌ను శుక్రవారం సచివాలయంలోని ఆయన ఛాంబర్‌లో టిసాట్ సిఇఓ బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీధర్ బాబు మాట్లాడుతూ టిసాట్ కంటెంట్ సోషల్ మీడియా ప్లాట్ ఫాం ద్వారా అందుబాటులో ఉంటుందని, తద్వారా గ్రామీణ ప్రాంత యువతకు ఎంతో ప్రయోజనం చేకూర్చుతుందన్నారు. తెలంగాణా ప్రభుత్వం నిర్వహించే ప్రతి పోటీ పరీక్షకు టిసాట్ అందించే డిజిటల్ కంటెంట్‌ను సద్వినియోగం చేసుకోవాలని, మే నెలలో జరిగే ఎడ్ సెట్ పరీక్ష కోసం అభ్యర్థులను సిద్ధం చేసేందుకు ఫిబ్రవరి రెండవ తేది నుండి మే 11వ తేది వరకూ రోజుకు నాలుగు గంటల పాటు 392 ఎపిసోడ్స్ ప్రసారం చేస్తున్నామన్నారు. బయాలజీ, ఫిజికల్ సైన్స్, మాథమేటిక్స్, సోషల్ స్టడీస్, ఇంగ్లీష్, తెలుగు సబ్జెక్టులతో 98 రోజుల పాటు టిసాట్ విద్య, నిపుణ ఛానళ్లతో పాటు టిసాట్ యాప్, యుట్యూబ్‌లో ప్రసారాలు కొనసాగుతాయని వెల్లడించారు. పోటీ పరీక్షలకు డిజిటల్ కంటెంట్ అందించేందుకు కృషి చేస్తున్న సిఇఓ వేణుగోపాల్ రెడ్డిని మంత్రి శ్రీధర్ బాబు అభినందించారు. ఈ కార్యక్రమంలో టిసాట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎం.డి సాధిక్ పాల్గొన్నారు.

## జెఎన్‌టియుహెచ్ – ఇఎస్‌సిఐ మధ్య చరిత్రాత్మక ఒప్పందం

కొత్తగా రెండు బి.టెక్ కోర్సులు ప్రారంభం



ప్రజాపక్షం/హైదరాబాద్ : సాంకేతిక విద్యా రంగంలో కీలక మార్పులకు శ్రీకారం చుడుతూ హైదరాబాద్‌లోని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఈఎస్‌సిఐ), జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలజికల్ యూనివర్సిటీ హైదరాబాద్ (జెఎన్‌టియుహెచ్) మధ్య శుక్రవారం అవగాహన ఒప్పందం కుదిరింది. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఈ భాగస్వామ్యం ఏర్పడింది.

**అకాడమియా –ఇండస్ట్రీ మధ్య కీలక మైలురాయి**

ఎస్కీ డైరెక్టర్ డాక్టర్ జి. రామేశ్వర్ రావు, జెఎన్‌టియుహెచ్ ఉపకులపతి ప్రొఫెసర్ టి.కిషన్ కుమార్ రెడ్డిలు ఈ ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అకాడమియాఇండస్ట్రీ మధ్య వారధిని నిర్మించడంలో ఇది కీలక ముఖ్యమైన మైలురాయి అని అన్నారు. స్కీలో ఇటీవల ప్రారంభించిన ఈవీ బ్యాటరీ సస్టెనబులిటీ లెవల్–6 సర్టిఫికేషన్ ప్రోగ్రామ్ గురించి రామేశ్వర్ రావు వివరించారు. ఈ భాగస్వామ్యం ద్వారా ఏఐ, రోబోటిక్స్, ఈవీ టెక్నాలజీస్ వంటి రంగాలలో నాణ్యమైన విద్య అందుబాటులోకి రానుంది. 'స్కిల్ ఇండియా', 'గ్రీన్ మొబిలిటీ' వంటి జాతీయ ప్రాధాన్యతలకు అనుగుణంగా విద్యార్థులను ఉపాధికి సిద్ధం చేయడమే ఈ ఒప్పందం యొక్క ప్రధాన ఉద్దేశ్యమని చెప్పారు. గ్రీన్ మొబిలిటీపై విద్యార్థులకు పట్టు సాధించేలా దీనిని రూపొందించినట్లు తెలిపారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేలా ఎస్కీ చేపట్టిన ఈ నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను ఉపకులపతి కిషన్ కుమార్ రెడ్డి అభినందించారు. వీటికి జెఎన్‌టియుహెచ్ నుంచి పూర్తిస్థాయి సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జెఎన్‌టియుహెచ్ రిజిస్ట్రార్ డాక్టర్ వెంకటేశ్వర్ రావు, డైరెక్టర్లు డాక్టర్ కె. విజయ కుమార్ రెడ్డి, ప్రొఫెసర్ వి. కామాక్షి ప్రసాద్, డాక్టర్ కె. అనిత షీలా, ప్రిన్సిపల్ డాక్టర్ జి. వెంకట నరసింహ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఎస్కీ తరపున లక్ష్మి కాంత్ రావు, రాజా రావు, డాక్టర్ అశోక్, డాక్టర్ వెంకట్ రెడ్డి, ఇర్. సాయి కిషోర్ హాజరయ్యారు.

**నూతన బి.టెక్ ప్రోగ్రాములు**

ఈ ఒప్పందం ద్వారా 2026 విద్యా సంవత్సరం నుండి నాలుగు ఏళ్ల వ్యవధి గల రెండు సరికొత్త బి.టెక్ కోర్సులను ప్రారంభించనున్నారు.

* బి.టెక్ కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్)
* బి.టెక్ రోబోటిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్


## నేటి సాక్షులే రేపటి నిందితులు..

ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితుల జాబితాలోకి బిఆర్‌ఎస్ నేతల పేర్లు..?

ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసులో ఇప్పటి వరకు పోలీసులు, ఒక మీడియా ఛానల్ యజమాని మాత్రమే నిందితుల జాబితాలో ఉన్నారు. రాబోయే రోజుల్లో నిందితుల జాబితాల్లోకి బిఆర్‌ఎస్ నేతల పేర్లు జోడించేందుకు అవకాశాలు బలంగా కనిపిస్తున్నాయి. ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణ నిమిత్తం రెండోసారి విసి సజ్జనార్ నేతృత్వంలో ఏర్పడిన సిట్ దూకుడు పెంచిన విషయం తెలిసిందే. యడతెరిపి లేకుండా కేసును దర్యాప్తును వేగవంతం చేసి చార్జిషీట్ తయారు చేయాలని సిట్ నిర్ధారణకు వచ్చింది. ఈ క్రమంలోనే ఇటీవల బిఆర్‌ఎస్ నేతలు, మాజీ మ ంత్రులు హరీష్‌రావు, కెటిఆర్‌లతో పాటు ఎంపి సంతోష్‌రావులను విచారించిన సిట్ రేపు బిఆర్‌ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావును విచారించబోతున్నారు. అయితే ఈ నలుగురు బిఆర్‌ఎస్ నేతలను సిఆర్‌పిసి 160 సెక్షన్ కింద అంటే కేసులో సాక్షులుగా పిలిచి విచారిస్తున్నామని సిట్ తన నోటీసులో పేర్కొంది. దీంతో పాటే ఫోన్ ట్యాపింగ్ కేసుకు సంబంధించి కీలక సమాచారం మీకు తెలుసని తమ దర్యాప్తులో తేలినందున, తదుపరి దర్యాప్తు నిమిత్తం తమరిని విచారించాలనుకుంటున్నామని ప్రతి నోటీసులో సిట్ పేర్కొంది. ఈ లెక్కన బిఆర్‌ఎస్ ప్రభుత్వం రాజకీయ లబ్ది పొందేందుకు ప్రతిపక్ష నేతల ఫోన్‌లు సిట్ కార్యాలయంలో మాజీ సిట్ చీఫ్ ప్రభాకర్‌రావు, డిఎస్‌పి ప్రణీత్‌రావులు ట్యాంపరింగ్ చేస్తున్న కీలక విషయం ఇటీవల సాక్షులుగా నోటీసులు అందుకున్న బిఆర్‌ఎస్ నేతలకు తెలుసునని సిట్ అంటుంది. అయితే ఈ నలుగురు కూడా ఆ సమయంలో వివిధ రాజ్యాంగ పదవుల్లో ఉన్నారు. ట్యాపరింగ్ విషయం తెలిసికూడా వీరు ఆ విషయాన్ని రహస్యంగా ఉంచడం చట్టప్రకారం నేరం. ఒక నేరం జరిగుతుందని తెలిసినా దాని ఎవరికి చెప్పకుండా ఉండడం నేరం కిందికే వస్తుందని చట్టం చెబుతుంది. దీని ప్రకారం హరీష్‌రావు, కెటిఆర్, సంతోష్‌రావు, కెసిఆర్‌లకు ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం ముందే తెలుసని సిట్ నిర్ధారణకు వచ్చింది. ఈ కేసులో నిందితులుగా ఉన్న ఐదుగురు పోలీసు అధికారులను గతంలో విచారించడంతో సిట్ ఈ నిర్ధారణకు వచ్చిందని తెలుస్తుంది. నిందితులు ఈ నలుగురు బిఆర్‌ఎస్ నేతల పేర్లు వెల్లడించి ఉంటారని తెలుస్తుంది. ఈ నేతలక పంపిన ప్రతి నోటీసులలో నేరం గురించిన కీలక సమాచారం తెలిసినందున విచారణకు రావాలని ఉంది. నేరం చేశారా లేదా అనేది తదుపరి దర్యాప్తులో తేలాల్సి ఉంది. అయితే ఇప్పటి వరకు మాత్రం నేరం జరిగిన తీరు గురించి మాత్రం బిఆర్‌ఎస్ నేతలకు తెలుసునని నోటీసులో సిట్ పేర్కొంది. వాళ్లు నేరం చేసినా చేయకపోయినా నేరం గురించి సమాచారాన్ని దాచిపెట్టడం అతిపెద్ద నేరం. ఇలా చేయడం నేరగాళ్లకు సహకరించినట్లు అవుతుందని చట్టం చెబుతుంది.ఈ లెక్కన చూసుకుంటే సాక్షులుగా సిట్ ముందు హాజరైన ఈ నేతలు రేపు నిందితులుగా మారే అవకాశాలు బలంగా కనిపిస్తున్నాయి.

## సాధికారత సాధించిన మహిళలే ప్రగతికి పునాది

ఎమ్మెల్యే వల్లాల నవీన్ యాదవ్




ప్రజాపక్షం/హైదరాబాద్: మహిళా సాధికారత దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం దృఢంగా కృషి చేస్తోందని జూబ్లీ హిల్స్ కాంగ్రెస్ ఎమ్మెల్యే వల్లాల నవీన్ యాదవ్ అన్నారు. పారిశ్రామిక, వ్యాపార రంగాల్లో పోటీపడి సాధికారత సాధించిన మహిళలే తెలంగాణ ప్రగతికి పునాది అన్నారు. హైదరాబాద్ బంజారాహిల్స్‌లో ప్రముఖ సౌందర్య నిపుణురాలు రమణి పెనుబాల ఏర్పాటు చేసిన మియోరి సెలూన్ అకాడమిని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఏ నవీన్ యాదవ్ మాట్లాడుతూ మహిళలకు ఉజ్వలమైన, సమానమైన భవిష్యత్తు అందించడంతో పాటు వారిని ఉన్నత స్థాయికి తీసుకెళ్లే పలు ప్రభావవంతమైన విధానాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. మియోరి అకాడమి ద్వారా యువతకు నాణ్యమైన శిక్షణ అందించి, వారికి ఉత్తమ ఉపాధి అవకాశాలు కల్పించాలని అకాడమీ నిర్వాహకురాలు రమణి పెనుబాలను ఆకాంక్షించారు. రమణి పెనుబాల మాట్లాడుతూ చర్మ సంరక్షణ, మేకప్ అప్లికేషన్, హెయిర్ స్టైలింగ్, నెయిల్ కేర్, వాక్సింగ్, హెయిర్ అండ్ ఫేస్ ట్రీట్‌మెంట్స్ వంటి కోర్సుల్లో అనుభవజ్ఞులైన బోధకుల పర్యవేక్షణలో యువతకు ఆచరణాత్మక శిక్షణ అందించి, విజయవంతమైన కెరీర్‌ను ప్రారంభించేందుకు మార్గదర్శనం చేస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో ప్రముఖ వ్యాపార వృద్ధి విశ్లేషకులు వేణు కళ్యాణ్, ప్రముఖ సంఘసేవకులు భాను కిరణ్ పసుల, కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంధ్య రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మైక్రోసాఫ్ట్‌కు ఏఐ షాక్

గంటల్లోనే రూ.36 లక్షల కోట్ల ఆవిరి




న్యూఢిల్లీ: ప్రముఖ టెక్‌దిగ్గజం మైక్రోసాఫ్ట్ స్టాక్ మార్కెట్‌లో కొన్ని గంటల్లోనే భారీగా నష్టాన్ని చవిచూసింది. కంపెనీ షేరు విలువ ఒక దశలో 12 శాతం కుంగింది. దాంతో ఆ సంస్థ విలువలో 400 బిలియన్ డాలర్ల మదుపర్ల సంపద ఆవిరైంది. భారతీయ కరెన్సీలో ఈ మొత్తం రూ.36 లక్షల కోట్లు. స్టాక్ మార్కెట్ చరిత్రలో ఒక్క రోజులో ఈ స్థాయిలో పతనం కావడం ఇది రెండోసారి. గతేడాది జనవరిలో చైనాకు చెందిన డీప్‌ఫేక్ ఏఐ మోడల్ ప్రవేశంతో చిప్ తయారీ సంస్థ ఎన్విడియా 593 బిలియన్ డాలర్లు కోల్పోయింది. 2020 మార్చి తర్వాత మైక్రోసాఫ్ట్ ఈ స్థాయిలో నష్టాలు చవిచూడడం ఇదే తొలిసారి. 1986లో ఈ టెక్ సంస్థ ఐపీఓకు వచ్చిన తర్వాత ఈ స్థాయి నష్టాలు చూడటం చాలా తక్కువ. కృత్రిమ మేధ (ఏఐ)పై కంపెనీ చేస్తున్న వ్యయాలతో ఇన్వెస్టర్లు ఆందోళన చెందుతున్నారు. కత్రిమ మేధ, కొత్త సాంకేతికతపై చేస్తున్న ఖర్చులపై ఇప్పటికే భారీగా చర్చ నడుస్తోంది. గతేడాది పెట్టిన భారీ పెట్టుబడులకు ఏ మేరకు ప్రతిఫలాలు అందాయో తెలుసుకోవాలని వాటాదార్లు భావిస్తున్నారు. మైక్రోసాఫ్ట్ తన క్లౌడ్, ఏఐ విభాగాలపై పెట్టుబడుల్లో 66 శాతం పెరుగుదల కనిపించింది. ఇటీవల త్రైమాసిక ఫలితాల్లో ఈ విషయం వెల్లడైంది. కానీ మైక్రోసాఫ్ట్ క్లౌడ్ ప్లాట్‌ఫామ్ అజ్యూర్ వద్ధి గత త్రైమాసికంతో పోలిస్తే మందగించింది. ఇది మదుపర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. రాబోయే ఏడాది కాలంలో డేటా సెంటర్ల మీద గూగుల్, మెటా, మైక్రోసాఫ్ట్, అమెజాన్ వంటి కంపెనీలు భారీ పెట్టుబడులు పెట్టనున్నాయి. దానికోసం గూగుల్ తప్ప మిగతా కంపెనీలన్నీ రుణాల బాట పట్టనున్నాయి. ఏఐతో తమకు స్వర్ణయుగం వస్తుందనే ఆశతోనే అప్పులు చేస్తున్నాయి. ఓపెన్ ఏఐ సంస్థ రానున్న సంవత్సరాల్లో 1.4 లక్షల కోట్ల డాలర్ల పెట్టుబడులు అవసరమవుతాయని చెబుతోంది. అయితే 2030కి గానీ లాభాలు రావని ఇప్పటికే వెల్లడించింది.

## 'గాంధీ' అంటే మోదీకి ఇష్టం లేదు

మహాత్మాగాంధీతో ముడిపడి ఉన్న ఉపాధిహామీ చట్టం ఎక్కువ కాలం కొనసాగాలనుకోవడం లేదు

'ఎంజి నరేగా' రద్దుని నిరసిస్తూ ఢిల్లీలో కాంగ్రెస్ నిరసన ప్రదర్శన




న్యూఢిల్లీ : 'ఎంజి నరేగా' రద్దుకు సంబంధించి బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ తీవ్రస్థాయిలో విరుచుకుపడింది. మహాత్మాగాంధీతో ముడిపడి ఉన్న చట్టం ఎక్కువ కాలం కొనసాగాలని ప్రధాని మోదీ అసలు ఇష్టం లేదని విమర్శించింది. ప్రజలకు చట్టబద్ధంగా పని చేసే హక్కు ఉండాలని ఆయన కోరుకోవడంలేదని ఆరోపించింది. 'ఎంజి నరేగా' రద్దుని నిరసిస్తూ శుక్రవారం ఢిల్లీలోని ఎఐసిసి ప్రధాన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. మోదీ ప్రభుత్వం పనిచేసేందుకు కల్పించిన రాజ్యాంగ హక్కును లాక్కోవడానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ సీనియర్ నేతలు, కార్యకర్తలు 24, అక్బర్ రోడ్‌లోని కాంగ్రెస్ కార్యాలయం నుండి గాంధీ స్మృతి వరకు మార్చ్ నిర్వహించారు. అయితే, వారిని మధ్యలోనే పోలీసులు అడ్డుకుని గాంధీ స్మృతికి చేరుకోనీయలేదు. నిరసన కార్యక్రమంలో నిరసనకారులు 'ఎంజి నరేగా చోర్–గద్దీ చోడ్' అని నినాదాలు చేశారు. అనంతరం 'ఎంజినరేగా బచావో సంగ్రామ్ యాత్ర' కార్యక్రమంలో రమేష్ ప్రసంగిస్తూ మోదీ ప్రభుత్వం దానిపై బుల్డోజర్ నడపడం ద్వారా నరేగా చట్టాన్ని రద్దు చేసిందని మండిపడ్డారు. ఎంజి నరేగా 2005 సెప్టెంబర్‌లో ఏకగ్రీవంగా ఆమోదించబడిన చారిత్రాత్మక, విప్లవాత్మక చట్టమని, మాజీ ప్రధాన మంత్రి మన్మోహన్ సింగ్ జీ, సోనియా గాంధీ జీ, రాహుల్ గాంధీ జీ ఈ చట్టం రూపకల్పనలో గణనీయమైన కృషి చేశారన్నారు. మొదటిసారిగా డిబిటి ద్వారా ప్రతి కుటుంబానికి డబ్బు పంపిణీ చేయబడిందన్నారు. కానీ మహాత్మా గాంధీ జీతో ముడిపడి ఉన్న ఈ చట్టం ఎక్కువ కాలం కొనసాగకూడదని నరేంద్ర మోదీ కోరుకోవడం వల్ల ఈ చట్టాన్ని రద్దు చేశారని ధ్వజమెత్తారు. మోదీ ప్రభుత్వం తీసుకున్న ఈ చర్యకు వ్యతిరేకంగా కాంగ్రెస్ గట్టిగా నిలబడుతుందని కాంగ్రెస్ మీడియా, ప్రచార విభాగ అధిపతి పవన్ ఖేరా అన్నారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంజినరేగా) లక్షలాది కుటుంబాలకు ప్రయోజనం చేకూర్చే ఉపాధికి చట్టబద్ధమైన హక్కును ఇచ్చిందని, అయితే కేంద్రం ఈ నిబంధనలను క్షీణింపజేస్తోందని రమేష్ మండిపడ్డారు. 'విబి– జి రామ్ జి' పథకం యుపిఎ కాలం నాటి ఎంజి నరేగా అసలు స్ఫూర్తిని నీరుగార్చిందన్నారు. నిరసనను ఉద్దేశించి ఢిల్లీ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (డిపిసిసి) అధ్యక్షుడు ధర్మేంద్ర యాదవ్ మాట్లాడుతూ ప్రభుత్వ చర్యలు పేదలపై నిరంతర దాడిని సూచిస్తున్నాయన్నారు. 'విబి– జి రామ్ జి' చట్టాన్ని రద్దు చేయాలని, నరేగాను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ 45 రోజుల దేశవ్యాప్తంగా ఎజినరేగా బచావో సంగ్రామ్ యాత్రను ప్రచారం ప్రారంభించినట్లు ఆయన చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రోజ్‌గార్ అండ్ అజీవిక మిషన్ (గ్రామీణ్) చట్టం, 2025 (విబి–జి రామ్ జి), ప్రతిపక్షాల గర్జన మధ్య ఉభయ సభలు ఆమోదించాయి.

# కాంగ్రెస్‌లోనే ఉంటా:శశి థరూర్



**తిరువనంతపురం:** తాను పార్టీ మారుతున్నానని వస్తున్న ఊహాగానాలకు కాంగ్రెస్ సినియర్ నేత శశి థరూర్ తెరదించారు. తాను కాంగ్రెస్‌లోనే ఉన్నానని, ఎక్కడికీ వెళ్లబోనని స్పష్టం చేశారు. పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని కలిసిన మరుసటి రోజే థరూర్ ఈ ప్రకటన చేయడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. శశి థరూర్ కొన్ని నెలలుగా ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి, ప్రధాని మోదీపై సానుకూల ప్రకటనలు చేస్తున్నారు. అకస్మాత్తుగా ఆయన ప్రవర్తన మారడంతో కాంగ్రెస్ పార్టీని వీడుతారనే ఊహాగానాలు వెలువడ్డాయి. ఎన్నో నెలలుగా ఈ ఊహాగానాలు వ్యక్తమవుతున్నప్పటికీ వీటిపై స్పందించలేదు. తాజాగా ఖర్గే, రాహుల్ గాంధీతో భేటీ అనంతరం స్పందించారు. రాబోయే కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ నేతత్వంలోని యూడిఎఫ్ గెలుపుకోసం తాను ముందుండి పనిచేస్తానని థరూర్ చెప్పారు. కేరళ ప్రచారంలో చురుకుగా పాల్గొంటానని, కాంగ్రెస్‌కు బలంగా నిలుస్తానని తెలిపారు. తనపై వస్తున్న పార్టీ మార్పు వార్తలకు ఎలాంటి ఆధారం లేదని తేల్చిచెప్పారు. అదేసమయంలో రాహుల్ గాంధీపై థరూర్ ప్రశంసల వర్షం కురిపించారు. రాహుల్‌కు స్పష్టమైన రాజకీయ ఆలోచన ఉందని, సంప్రదాయ విభజనకు వ్యతిరేకంగా నిలబడే నాయకుడని అన్నారు. తన దష్టి అంతర్గత రాజకీయాలపై కాదని, దేశానికి సంబంధించిన అంశాలపైనేనని స్పష్టం చేశారు. 2009 నుంచి తాను ఇదే తరహా వైఖరి కనబరుస్తున్నానని, పార్టీ అధికారిక నిర్ణయాలకు వ్యతిరేకంగా మాట్లాడే హక్కు ఎవరికీ లేదని వ్యాఖ్యానించారు. తన విధేయతపై పదేపదే ప్రశ్నలు రావడంపై థరూర్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. తాను కాంగ్రెస్‌లోనే ఉంటానని మళ్లీ మళ్లీ చెప్పాల్సిన అవసరం ఎందుకు వస్తోందని ప్రశ్నించారు. ఇలాంటి సందేహాలు తనకే ఎందుకు వస్తున్నాయో అర్థం కావడం లేదని, అయినా తాను కాంగ్రెస్‌తోనే గట్టిగా నిలబడతానని చెప్పారు. ఖర్గే, రాహుల్ గాంధీతో జరిగిన భేటీ గురించి థరూర్ వివరించారు. పార్లమెంట్ భవనంలో జరిగిన ఈ సమావేశం గంట నలభై ఐదు నిమిషాల పాటు సాగిందని తెలిపారు. సమావేశంలో తన ఆవేదనలను నాయకుల దష్టికి తీసుకెళ్లానని, చర్చ చాలా సానుకూలంగా, నిర్మాణాత్మకంగా జరిగిందని అన్నారు. ఇప్పుడు అందరం ఒకే దారిలో కలిసి ముందుకు సాగుతున్నామని, ఇక చెప్పడానికి ఏమీ మిగలలేదని వ్యాఖ్యానించారు.

# 'సంచార్ సాథీ'తో 1.52 కోట్ల మొబైల్ నెంబర్లు బ్లాక్




**న్యూఢిల్లీ :** సైబర్ నేరాలు, చోరీలను అరికట్టడానికి తీసుకొచ్చిన సంచార్ సాథీ యాప్‌నకు వినియోగదారుల నుంచి విశేష ఆదరణ లభిస్తోందని కేంద్రం వెల్లడించింది. ఇప్పటివరకు 2 కోట్లకు పైగా మంది సంచార్ సాథీని డౌన్‌లోడ్ చేసుకున్నట్లు కమ్యూనికేషన్ల శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా తెలిపారు. ఈ యాప్ సాయంతో చట్టవ్యతిరేక, అనుమానాస్పద కార్యకలాపాలతో సంబంధం ఉన్న 1.52 కోట్ల మొబైల్ నంబర్లను బ్లాక్ చేశామన్నారు. మోసపూరిత సిమ్‌లతో ముడిపడి ఉన్న 27 లక్షల వాట్సప్ ఖాతాలతో పాటు ఇతర డిజిటల్ కమ్యూనికేషన్ ప్లాట్ ఫామ్‌లను కూడా బ్లాక్ చేసినట్లు పేర్కొన్నారు. సైబర్ మోసాలను ఎదుర్కొనే బలమైన ఆయుధంగా సంచార్ సాథీ పనిచేస్తోందన్నారు. గతంలో విదేశీ కాలర్ల నుంచి సుమారు 1.35 కోట్ల నకిలీ కాల్స్ రికార్డు అయ్యేవని.. ప్రస్తుతం అటువంటి కాల్స్ దాదాపు 95 శాతం మేర తగ్గాయని మంత్రి వివరించారు. ఈ యాప్ ద్వారా ప్రభుత్వం ప్రజల వ్యక్తిగత జీవితాలపై నిఘా పెడుతుందనే ఆరోపణల్లో నిజం లేదని మంత్రి పేర్కొన్నారు. అసలు స్నూపింగ్‌కు తావే లేదని, అది సాధ్యం కాదని పేర్కొన్నారు.

# జాతిపితకు ఘన నివాళి

## రాష్ట్రపతి, ప్రధాని శ్రద్ధాంజలి



**న్యూఢిల్లీ:** జాతిపిత మహాత్మా గాంధీకి జాతి ఘన నివాళి అర్పించింది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్రపతి సిపి రాధాకృష్ణన్, ప్రధాని నరేంద్ర మోదీ, రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఆయనకు ఘన నివాళి అర్పించారు. గాంధీ స్మృతివనం వద్ద గాంధీ సమాధికి పూలమాలలు వేసి... శ్రద్ధాంజలి ఘటించారు. 1948 జనవరి 30న ఢిల్లీలోని బిర్లా భవన్(ప్రస్తుతం గాంధీ స్మృతి)లోని ప్రార్థనా సమావేశంలో నాథూరాం గాడ్సే కాల్పులు జరపడంతో గాంధీ ప్రాణాలు కోల్పోయారు. ఈ రోజును దేశవ్యాప్తంగా అమరవీరుల సంస్మరణ దినంగా పాటిస్తున్నారు. గాంధీ వర్ధంతి సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ ఆయనకు ఘన నివాళులు అర్పించారు. 'జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా ఆయనకు నా హృదయపూర్వక నివాళులు అర్పిస్తున్నాను. పూజ్య బాపు ఎల్లప్పుడూ స్వదేశీని నొక్కిచెప్పారు. ఇది అభివృద్ధి చెందిన, స్వావలంబన భారతదేశం కోసం మన సంకల్పానికి మూలస్తంభం. ఆయన వ్యక్తిత్వం, విజయాలు భారతీయులు విధి మార్గం అనుసరించడానికి ప్రేరేపిస్తాయి' అని సోషల్ మీడియా 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. మహాత్ముని 78వ వర్ధంతి సందర్భంగా దేశవ్యాప్తంగా వివిధ కార్యక్రమాలు జరుగుతున్నాయి. రాజ్‌ఘాట్ వద్ద అధికారిక నివాళులు, ప్రార్థనా కార్యక్రమాలు జరిగాయి. ఆయా రాష్ట్రాల్లో ముఖ్యమంత్రులు, గవర్నర్లు, ప్రజాప్రతినిధులు బాపు సమాధుల వద్ద ఘన నివాళులర్పించారు. మహాత్మా గాంధీ జీవితం అహింస, సత్యాగ్రహం, స్వదేశీ, సర్వోదయం వంటి సూత్రాలతో నిండినది. 'హే రామ్' అంటూ ప్రాణాలు విడిచిన ఆ మహానుభావుడి ఆదర్శాలు ఇప్పటికీ ప్రపంచానికి శాంతి, సమానత్వం మార్గాన్ని చూపుతున్నాయి. ఆయన మార్గమే దేశ భవిష్యత్తుకు శిరోధార్యంగా నిలుస్తోంది.

**గాంధీ ఒక ఆలోచనా విధానం**

రాహుల్ గాంధీ మహాత్మా గాంధీ కేవలం ఒక వ్యక్తి మాత్రమే కాదని ఒక ఆలోచనా విధానమని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ శుక్రవారం అన్నారు. మహాత్మా గాంధీని 'భారతదేశ అమర ఆత్మ' అని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు జాతిపితకు నివాళులు అర్పించారు. 'స్వాతంత్ర్యంతో పాటు జాతిపిత మనకు సత్యంకు చెందిన శక్తి అధికార శక్తి కంటే గొప్పదని, హింస, భయం కంటే అహింస, ధైర్యం గొప్పవని ప్రాథమిక సూత్రాన్ని ఇచ్చారు. ఈ ఆలోచనా విధానాన్ని తుడిచిపెట్టలేము. ఎందుకంటే గాంధీ భారతదేశ ఆత్మలో అమరుడు' 'ఎక్స్' పోస్ట్‌లో హిందీలో పేర్కొన్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మహాత్మా గాంధీ పాడిన భజనలోని పంక్తులను పంచుకుంటూ, 'బాపు నుంచి మనల్ని వేరు చేసిన ద్వేషం... దాని పరిష్కారం కూడా బాపు మార్గంలో ఉంది. సత్యంకు చెందిన వెలుగు, అహింసకు చెందిన శక్తి, కరుణ. అమరవీరుల దినోత్సవం సందర్భంగా జాతిపితకు నివాళులు అర్పించారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా కూడా మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా ఆయనకు నివాళులు అర్పించారు. ఇదిలాఉండగా, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ 1948లో జవహర్‌లాల్ నెహ్రూ, సర్దార్ వల్లభాయ్ పటేల్ శ్యామ ప్రసాద్ ముఖర్జీకి రాసిన రెండు వేర్వేరు లేఖలను గుర్తుచేసుకున్నారు, వాటిలో వారు హిందూ మహాసభ, ఆర్‌ఎస్‌ఎస్ కార్యకలాపాలను తీవ్రంగా విమర్శించడంతో పాటు ప్రశ్నలు లేవనెత్తారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి (సంస్థాగత వ్యవహారాల ఇంఛార్జ్) కె.సి.వేణుగోపాల్ మహాత్మా గాంధీకి నివాళులర్పిస్తూ... '1948లో ఈ రోజున భారతదేశానికి, ప్రపంచానికి మార్గనిర్దేశం చేసిన గొప్ప ఆత్మ 'మా నుంచి లాక్కోబడింది' అని అన్నారు.

# వాషింగ్ మెషిన్‌లో శుభ్రం చేశారా?

## అన్నా డిఎంకే అవినీతిపై బిజెపికి స్టాలిన్ ప్రశ్న



**చెన్నై:** అవినీతి కేసుల్లో ప్రమేయం ఉన్నట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న తమ కూటమి భాగస్వామి అన్నాడిఎంకేను వారి 'వాషింగ్ మెషిన్' లో శుభ్రం చేశారా అని తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ శుక్రవారం బిజెపిపై తీవ్ర దాడి చేశారు. డిఎంకేపై 'నిరాధార ఆరోపణలు' చేస్తున్నందుకు కాషాయ పార్టీని లక్ష్యంగా చేసుకుని ఎన్‌డిటీవీ తమిళనాడు సమ్మిట్‌ను ప్రారంభించిన తర్వాత స్టాలిన్ మాట్లాడుతూ తమిళనాడు వద్ధిని జీర్ణించుకోలేని వారు 'వాట్సాప్ విశ్వవిద్యాలయం' ద్వారా అబద్ధాలు వ్యాప్తి చేస్తున్నారని అన్నారు. 'మాపై చేసిన ఆరోపణలన్నీ పాత స్క్రిప్ట్‌ను అనుసరిస్తాయి. వీటిలో మొదటిది రాజకీయ రాజవంశ ఆరోపణ. నేను ఇప్పటికే దీనికి సమాధానం ఇచ్చాను. రాజకీయాల్లోకి ప్రవేశించడానికి ఎవరయినా స్వేచ్ఛగా ఉండవచ్చు. కానీ వారు ప్రజల ముందు నిలబడాలి. వారి నమ్మకాన్ని సంపాదించాలి. విజయం సాధించడానికి ఓట్లు గెలుచుకోవాలి. ఇది క్షేత్రస్థాయిలో మమ్మల్ని ఎదుర్కోలేని వారు చేసిన నిరాధారమైన ఆరోపణ' అని డిఎంకే అధినేత అన్నారు. 'వారు మాపై చేసిన రెండవ ఆరోపణ 'అవినీతి'. ఇప్పటివరకు ఎవరైనా మాపై చేసిన ఒక్క ఆరోపణను నిరూపించారా' అని ఆయన ప్రశ్నించారు. 'ప్రస్తుతం మీతో ఉన్న వారు అవినీతిలో నిజంగా పాల్గొన్నవారు. ముఖ్యంగా అన్నాడిఎంకే, వారు అవినీతి కేసుల్లో సుప్రీం కోర్టు ద్వారా దోషులుగా నిర్ధారించబడ్డారు. మీరు వారితో పొత్తు పెట్టుకోనప్పుడు, మీరు వారిపై ఎన్ని ఆరోపణలు చేశారు?. ఇప్పుడు మీరు వాటిని మీ వాషింగ్ మెషిన్‌లో కడిగారా? అని సిఎం స్టాలిన్ అన్నారు.

# సీట్ల పంపిణీపై డిఎంకెతో త్వరలో చర్చలు

## టిఎన్‌సిసి అధ్యక్షుడు సెల్వ పెరుంతగై



**చెన్నై:**కాంగ్రెస్‌డిఎంకె సంబంధాలలో ఎలాంటి చీలికలు లేవని, రెండు పార్టీలు సిట్ల పంపకాల చర్చలను వారంలో ప్రారంభిస్తాయని టీఎన్‌సిసి అధ్యక్షుడు కె.సెల్వపెరుంతగై శుక్రవారం తెలిపారు. డిఎంకేతో చర్చల సందర్భంగా తమ పార్టీకి ఆశించిన సంఖ్యలో సిట్లు వస్తాయని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. 'మేము మా మిత్ర పక్షంపై ఒత్తిడి తీసుకురావడం లేదు. మేము అడిగి మాకు కావలసినవి పొందుతాం. డిఎంకే (మాకు) ఇస్తుంది' అని సెల్వపెరుంతగై తిరువళ్లూరులో విలేకరులతో అన్నారు. ఇటీవల దేశ రాజధానిలో కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీతో డిఎంకే ఉప ప్రధాన కార్యదర్శి కనిమొళి సమావేశం గురించి టీఎన్‌సిసి మాట్లాడుతూ 'మేము చర్చలు జరుపుతున్నాం. మళ్లీ ఒక వారంలో చర్చలు ప్రారంభిస్తాం' అని అన్నారు. అన్నాడిఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి కె పళనిస్వామి ముఖానికి 'ముసుగు' వేసుకుని కేంద్ర హోం మంత్రి అమిత్ షాను కలవడాన్ని ఆయన తీవ్రంగా విమర్శించారు. 'ఆ సమావేశంలా కాకుండా, మా నాయకురాలితో కనిమొళి సమావేశం సూటిగా, గౌరవప్రదంగా ఉందని అన్నారు. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు డిఎంకే 25 సిట్లు కేటాయించింది. కానీ 18 సెగ్మెంట్లలో విజయం సాధించింది. ఇదిలాఉండగా, ట్యూటికోరిన్ పర్యటనలో ఉన్న కనిమొళి విలేకరులతో మాట్లాడుతూ డిఎంకేకాంగ్రెస్ మధ్య చర్చలు 'సజావుగా సాగుతున్నాయి' అని తెలిపారు. 'చర్చలు ముగిసిన తర్వాత మా పార్టీ అధ్యక్షుడు ఒక ప్రకటన చేస్తారు' అని రాహుల్ గాంధీతో తన సమావేశం గురించి వివరాల్లోకి వెళ్లకుండానే లోక్‌సభ సభ్యురాలు అన్నారు.

# సోషల్ మీడియా వాడొద్దు

## నితీశ్ సర్కార్ హెచ్చరిక



**పాట్నా:** బీహార్‌లో నితీశ్ కుమార్ ప్రభుత్వం కఠిన నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ ఉద్యోగులు సోషల్ మీడియా వాడకంపై కఠిన ఆంక్షలు విధించింది. డిజిటల్ వేదికల్లో అనుచిత వ్యాఖ్యలు లేదా దురుసుగా ప్రవర్తించే ప్రభుత్వ ఉద్యోగులపై కఠినమైన క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. అనుమతి లేకుండా ఖాతాలు సష్టించడం, రీల్స్ చేయడం, ప్రత్యక్ష ప్రసారం చేయడం, ఏదైనా పాలసిపై వ్యక్తిగత అభిప్రాయాలు వ్యక్తపరచడంపై పూర్తిగా నిషేధం విధించింది. ఒకవేళ ఏ ప్రభుత్వ ఉద్యోగి అయినా సోషల్ మీడియా ఖాతా సష్టించే ముందు సంబంధిత అధికారి నుంచి అనుమతి పొందడం తప్పనిసరి చేసింది. అనామక లేదా నకిలీ ఖాతాలు ఉపయోగించడంపైనా పూర్తిగా నిషేధం విధించింది. ఒకవేళ ఉల్లంఘనలకు పాల్పడితే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. సోషల్ మీడియా దుర్వినియోగాన్ని అరికట్టడానికి బీహార్ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలో ఫేస్‌బుక్, ఎక్స్, టెలిగ్రామ్, ఇతర డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ల్లో అనుచిత వ్యాఖ్యలు చేసే లేదా దురుసుగా ప్రవర్తించే ప్రభుత్వ ఉద్యోగులపై కఠినమైన క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని కేబినెట్ నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ ప్రతిష్టను కాపాడటానికి ఈ నియమం అవసరమని ప్రభుత్వం స్పష్టం చేసింది. కేబినెట్ మార్గదర్శకాల ప్రకారం ఏ ప్రభుత్వ ఉద్యోగి అయినా విధుల్లో ఉన్నప్పుడు కంటెంట్‌ను సష్టించడం నిషేధం. 'ఏ రకమైన రీల్, వీడియో, ఫొటో లేదా ప్రత్యక్ష సంభాషణను ప్రసారం చేయడం నిబంధనలను నేరుగా ఉల్లంఘించినట్లుగా పరిగణించబడుతుంది. ఇటువంటి వీడియోలు తరచుగా ప్రతికూల సందేశాన్ని పంపుతాయని, కార్యాలయ గోప్యతను ఉల్లంఘిస్తాయని ప్రభుత్వం చెబుతోంది. ప్రభుత్వ విధానాలు, పథకాలు లేదా సుప్రీంకోర్టు లేదా హైకోర్టు నిర్ణయాలపై ఏ ఉద్యోగి కూడా తమ వ్యక్తిగత అభిప్రాయాలను బహిరంగంగా వ్యక్తం చేయకూడదని ప్రభుత్వం స్పష్టం చేసింది.

## మహారాష్ట్ర అధికార చక్రాన్ని మలుపుతిప్పిన...

# రాజకీయ 'పెద్దన్న' అజిత్‌పవార్

### రెండు ఎన్‌సిపి విలీన చర్చల్లో ' పురోగతి'

### తన బాబాయి శరద్ పవార్ అనుమతితో 'ఎన్‌సిపి విలీనం సాకారం అవుతుందని' చివరి వ్యాఖ్యలు

**ముంబయి:** మహారాష్ట్రలో సుదీర్ఘకాలం ఉపముఖ్యమంత్రిగా కొనసాగిన అజిత్‌పవార్ మరణం మహారాష్ట్రలోని రాజకీయ సమీకరణాలను వేడెక్కిస్తోంది. రెండు రోజుల క్రితం విమాన ప్రమాదంలో మరణించిన అజిత్ పవార్ నేతృత్వంలోని నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సిపి), అతని మామ శరద్‌పవార్ నేతృత్వంలోని ఎన్‌సిపి పార్టీ రెండింటి విలీనం 'చాలా పురోగతి'లో ఉంది. అయితే ఉపముఖ్యమంత్రి అజిత్ పవార్ మరణానికి ముందే ఈ విలీన చర్చలు ముందస్తు దశకు చేరుకున్నాయని విశ్వసనీయ వర్గాలు వెల్లడించడం ఒక ఆసక్తికర పరిణామం. అయితే ఈ విలీనం అనేది అధికార గతిశీలతలో కూడా పెనుమార్పును తీసుకువస్తుందనడంలో ఎంతమాత్రం అతిశయోక్తి కాదు. ఎందుకంటే సీనియర్ నాయకుడు శరద్‌పవార్ ఇప్పుడు సహజంగానే ఏకీకృత కేడర్‌ను నడిపించడంలో 'కీలక భూమిక'ను తిరిగి పోషిస్తారని నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (శరద్‌పవార్‌ఎస్‌పి) శిబిరం విశ్వసిస్తోంది.ఇదిలా ఉంటే దివంగతనేత అజిత్ పవార్ సతీమణి రాజ్యసభ ఎంపి సునేత్ర పవార్‌ను ఉపముఖ్యమంత్రిగా ప్రతిపాదించి అజిత్‌పవార్ రాజకీయ వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్లాలని అధికార నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ నిశిత పరిశీలన చేస్తోంది. కాగా అజిత్‌పవార్ బతికున్న సమయంలోనే ఎన్‌సిపి పునరేకీకరణ కోసం చర్చలు ప్రారంభమయ్యాయని, ఆ నేపథ్యంలోనే రెండు ఎన్‌సిపి పార్టీలు కూడా పురపాలక ఎన్నికలలో పుణే, పింప్రీ, చించ్‌వాడ్‌లో కలిసికట్టుగా పోటీ చేయడం జరిగింది. ఎన్‌సిపిని శరద్‌పవార్ 1999లో స్థాపించారు. అజిత్‌పవార్ 2023 జులైలో ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని మహాయుతి ప్రభుత్వంలో చేరడంతో ఎన్‌సిపిలో చీలిక ఏర్పడింది. అజిత్ పవార్ డిప్యూటీ సిఎంగా నియమితులయ్యారు. 2024 నవంబరులో అసెంబ్లీ ఎన్నికల తర్వాత దేవేంద్ర ఫడ్నవీస్ అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా పవార్ ఉపముఖ్యమంత్రి పదవిలోనే కొనసాగారు. ఎన్‌సిపి పార్టీ పేరు, ఎన్నికల చిహ్నంపై వాదన ఇరువర్గాలలో తీవ్రపోటీని కలిగించింది. అజిత్‌పవార్ శిబిరం ఒరిజినల్ 'ఎన్‌సిపి' పేరు ద్వారా అలారం గడియారం ఎన్నికల చిహ్నాన్ని పొందడం జరిగింది. ప్రస్తుతం ఎన్‌సిపి మహాయుతి ప్రభుత్వంలో భాగస్వామిగా ఉండగా, ఎన్‌సిపి(ఎస్‌పి) మాత్రం ప్రతిపక్ష మహా వికాస్ అఘాడీ (ఎంవిఏ)లో ఉన్నారు. 66ఏళ్ల అజిత్‌పవార్ 'దాదా'గా (పెద్దన్న)గా పేరొందారు. బుధవారం ఉదయం పుణేలో బారామతి వైమానికతలం సమీపంలో ఛార్టర్డ్ విమానంలో ప్రయాణిస్తుండగా జరిగిన ఘోర ప్రమాదంలో అజిత్‌కుమార్ సహా నలుగురు మృతిచెందారు. ఈ హఠాత్ పరిణామానికి రాజకీయ వర్గాలు, ఆయన అనుచరులు సహా సామాన్యులు కూడా దిగ్భ్రాంతికి గురయ్యారు. అజిత్‌పవార్ మరణం మహారాష్ట్ర రాజకీయాలను ఒక్కసారిగా కుదిపేసింది. పురపాలక ఎన్నికల తర్వాతే రెండు ఎన్‌సిపి వర్గాలు కూడా విలీనందిశగా చర్చించి రాజకీయ ప్రయోజనం పొందాలని ఆకాంక్షించాయి. ఎన్‌సిపి (శరద్ పవార్). అజిత్‌పవార్ పార్టీ మధ్య చర్చలు పురోగతి దశలో ఉన్న సమయంలో బుధవారం నాటి విమాన ప్రమాదం చర్చలకు విఘాతం కలిగించింది. వాస్తవానికి రెండు ఎన్‌సిపిల విలీనం విషయాన్ని త్వరలోనే జరగబోయే జిల్లా పరిషత్, పంచాయతి సమితి ఎన్నికలలో ఫిబ్రవరి 8న ప్రకటించాలని భావించారు. 'కుటుంబాన్ని, పార్టీని కలిపి నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సిపి)కి పూర్వ వైభవం సాధించే ప్రక్రియ దిశగా ఆ పార్టీల ముఖ్యనేతలు ముందడుగు వేశారు. సీనియర్ లీడర్లతో వచ్చిన ఈ విరామాన్ని పూడ్చేందుకు 'అజిత్ దాదా' స్వయంగారంగంలోకి దిగి పలుదఫాలుగా చర్చలు జరిపారు' అని వర్గాలు పిటిఐకి తెలిపాయి.అయితే ఇరు పార్టీలు ఏకమై సంయుక్తంగా గడియారం ఎన్నికల గుర్తుపై పుణే, పింప్రీచించ్‌వాడ్ పురపాలక ఎన్నికలలో పోటీచేయడం ఆ పార్టీల దిశగా అందరి దృష్టిని మరల్చింది. విలీనం జరిగితే ఎన్‌సిపి(శరద్‌పవార్) నాయకులు రాష్ట్రపరిపాలన, పార్టీ ఆర్గనైజేషన్‌లో కీలక పాత్ర పోషిస్తారని విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. 9మంది లోక్‌సభ సభ్యులు, 51మంది ఎమ్మెల్యేలతో కూడిన బలీయమైన ఐక్యకలయిక మహారాష్ట్రలోని అధికార మహాయుతి లేదా ప్రతిపక్ష మహావికాస్ అఘాడీలో సమతుల్య మార్పులకు సోపానం కానున్నది. అయితే ప్రస్తుతానికి ఎన్‌సిపి(ఎస్‌పి) నాయకులు మాత్రం వారు పోటీచేయబోయే ఫిబ్రవరి 7న జరుగనున్న స్థానిక ఎన్నికల్లో విజయమే తమ ప్రాధాన్యత అని చెబుతున్నారు. అజిత్‌పవార్ నేతృత్వంలోని వర్గంతో సమన్వయమే దివంగత నాయకుడికి చివరి రాజకీయ ప్రయత్నాలకు ఇచ్చే నివాళిగా పేర్కొంటున్నారు. ముఖ్యంగా 2029 ఎన్నికలను, పార్టీ ఔచిత్యానియ్య దృష్టిలో ఉంచుకని, దీర్ఘకాలిక రాజకీయ దృక్పథంతో రెండు ఎన్‌సిపి వర్గాల పున:కలయికను అజిత్ పవార్ పరితపించారు. 'విలీనం చివరికి కార్యరూపం దాలుస్తుంది' అని, ముఖ్యంగా తన బాబాయి శరద్‌పవార్ అనుమతితో ఎన్‌సిపి ఇరు పార్టీల విలీనం సాకారం అవుతుందని ఆయన నమ్మకంగా ఉండేవారని అజిత్‌పవార్ పార్టీ వర్గాలు తెలిపాయి. ఎన్‌సిపి ఇరుపార్టీల విలీనం, భవిష్యత్తు వ్యూహానికి సంబంధించిన ఉన్నత స్థాయి చర్చలలో శరద్ పవార్, సుప్రియా సూలే, అజిత్‌పవార్ , జయంత్ పాటిల్ భాగస్వాములయ్యారు. ఈ చర్యలు విస్తృత రాజకీయ దిశ, నాయకత్వ అమరిక, దీర్ఘకాలిక ఎన్నికల వ్యూహంపై దృష్టి సారించాయి. ద్వితీయ స్థాయి చర్చయలను నాయకులు శశికాంత్ షిండే, రాజేష్ టోపే, అమోల్ కొల్హే తదితరులు నిర్వహించారు. వారు వ్యూహాత్మక, సంస్థాగత సమస్యలను విలీన చర్చల్లో ప్రస్తావించారు.

# సిఎం దేవేంద్ర ఫడ్నవీస్‌ను కలిసిన ఎన్‌సిపి నేతలు



**ముంబయి:** మహారాష్ట్ర సిఎం దేవేంద్ర ఫడ్నవీస్‌ను నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సిపి) నాయకులు కలిశారు. విమాన ప్రమాదంలో మరణించిన డిప్యూటీ సిఎం అజిత్ పవార్ పోర్ట్‌ఫోలియోలపై చర్చించారు. ఆయన నిర్వహించిన మంత్రి పదవులపై తమ పార్టీకే హక్కు ఉన్నదని తెలిపారు. శుక్రవారం ఎన్‌సిపి సినియర్ నేతలు ప్రఫుల్ పటేల్, సునీల్ తట్కరే, ఛగన్ భుజ్‌బల్ కలిసి సిఎం ఫడ్నవీస్ అధికార నివాసానికి వెళ్లారు. అజిత్ పవార్ నిర్వహించిన కీలకమైన ఆర్థిక, రాష్ట్ర ఎక్సైజ్, క్రీడా శాఖలతో సహా అన్ని మంత్రిత్వ శాఖలు ఎన్‌సిపి కోటాలోనే కొనసాగాలని కోరారు. ఈ మేరకు ఒక లేఖను సమర్పించారు. కాగా, సిఎం దేవేంద్ర ఫడ్నవీస్‌తో సమావేశం తర్వాత ఎన్‌సిపి కీలక నేత ప్రఫుల్ పటేల్ మీడియాతో మాట్లాడారు. మహాయుతి కూటమి ప్రభుత్వంలో తాము భాగస్వాములని తెలిపారు. అజిత్ పవార్ నిర్వహించిన పదవులను వీలైనంత త్వరగా భర్తీ చేయడానికి సరైన నిర్ణయం తీసుకోవాలని ఫడ్నవీస్‌ను కోరినట్లు చెప్పారు. మరోవైపు ఏదైనా నిర్ణయం తీసుకునే ముందు పార్టీతోపాటు ప్రజల మనోభావాలను పరిగణనలోకి తీసుకోవాల్సి ఉన్నదని ప్రఫుల్ పటేల్ తెలిపారు. 'దుఃఖం నుంచి కోలుకోవడానికి అజిత్ పవార్ కుటుంబానికి కొంత సమయం ఇవ్వాలి. మేం త్వరలోనే సునేత్ర పవార్, ఇతర కుటుంబ సభ్యులతో పార్టీ భవిష్యత్ కార్యాచరణపై చర్చిస్తాం' అని అన్నారు.

## అజిత్ పవార్ విమాన ప్రమాదంపై

# రంగంలోకి దిగిన సిఐడి



**ముంబయి :** మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ దుర్మరణానికి కారణమైన బారామతి విమాన ప్రమాదంపై రాష్ట్ర నేర దర్యాప్తు విభాగం (సిఐడి) అధికారికంగా విచారణను ప్రారంభించింది. ఈ ఘోర ప్రమాదం ఎలా జరిగింది అనే విషయాన్ని నిగ్గుతేల్చనుంది. పుణె రూరల్ పోలీసుల పరిధిలో నమోదైన ఈ కేసును తక్షణమే సిఐడికి బదిలీ చేశారని ఒక సినియర్ అధికారి స్పష్టత ఇచ్చారు. ఈ కేసులో సిఐడి ఎంట్రీ ఇవ్వడం ప్రాధాన్యం సంతరించుకుంది. సిఐడి ప్రధానంగా 'సాబోటేజ్' కోణంలో దర్యాప్తు చేయనుంది. అంటే విమానం ముంబయి నుంచి బయలుదేరడానికి ముందే, ఎవరైనా ఉద్దేశపూర్వకంగా విమానంలో సాంకేతిక లోపాలు సృష్టించారా? అనే కోణంలో లోతైన విచారణ జరుపుతున్నారు. బారామతిలో జరిగిన ఈ ఘటనపై తొలుత పుణె రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. భారతీయ నాగరిక్ సురక్షా సంహిత సెక్షన్ 194 కింద దీనిని 'ప్రమాదవశాత్తు జరిగిన మరణం'గా నమోదు చేశారు. ఇప్పుడు ఆ ఎఫ్ఐఆర్ సంబంధిత పత్రాలన్నింటినీ సిఐడికి అప్పగిస్తున్నారు. సిఐడి బృందం పుణె రూరల్ పోలీసుల నుంచి డాక్యుమెంట్లను సేకరిస్తోంది. విచారణలో భాగంగా సిఐడి అధికారులు బారామతిలోని ప్రమాద స్థలాన్ని సందర్శించనున్నారు. ఈనెల 28న జరిగిన ఈ ఘోర ప్రమాదం దేశాన్ని ఉలిక్కిపడేలా చేసింది. అజిత్ పవార్ (66) ప్రయాణిస్తున్న 'లియర్ జెట్ 45' విమానం ముంబయి నుంచి బయలుదేరింది. ఆయన సొంత ఊరైన బారామతికి చేరుకుంది. ల్యాండింగ్ కోసం ప్రయత్నిస్తుండగా, రన్ వే అంచుకు కేవలం 200 మీటర్ల దూరంలోనే విమానం కుప్పకూలింది. క్షణాల్లో మంటలు చెలరేగి విమానం కాలి బూడిదైంది. ఈ ప్రమాదంలో అజిత్ పవార్‌తో పాటు మరో నలుగురు ప్రాణాలు కోల్పోయారు. వారిలో అత్యంత అనుభవజ్ఞులైన పైలట్లు ఉండటం గమనార్హం. కెప్టెన్ సుమిత్ కపూర్‌కు ఏకంగా 16,000 గంటలకుపైగా ఫ్లయింగ్ అనుభవం ఉంది. కోపైలట్‌గా ఉన్న కెప్టెన్ శాంభవి పాఠక్ కూడా 1,500 గంటలకు పైగా అనుభవం ఉంది. అజిత్ పవార్ వ్యక్తిగత భద్రతా అధికారి విదిప్ జాదవ్, ఫ్లైట్ అటెండెంట్ పింకీ మాలి వీరందరూ ఈ ప్రమాదంలో దుర్మరణం పాలయ్యారు. మరోవైపు కేంద్ర పౌర విమానయాన మంత్రిత్వ శాఖ పరిధిలోని 'ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో' కూడా తన విచారణను ప్రారంభించింది.

# 'వెళ్లి చావు' అనడం ఆత్మహత్యకు పురికొల్పడం కాదు: కేరళ హైకోర్టు



**తిరువనంతపురం:**భార్యాభర్తల మధ్య గొడవ సందర్భంగా 'వెళ్లు, చావు' అని అనడంపై కేరళ హైకోర్టు కీలక తీర్పు వెల్లడించింది. ఒక కుటుంబ వివాదంలో హైకోర్టు తీర్పు వెలువరిస్తూ భార్యాభర్తలు కోపంగా 'వెళ్లిపో', 'చనిపో' వంటి పదాలను ఉపయోగించడం ఆత్మహత్యకు ప్రేరేపించబడదని పేర్కొంది. భారత శిక్షాస్మతి సెక్షన్ 306 ప్రకారం నేరాన్ని నిర్ధారించాలంటే... నిందితుడు ఆత్మహత్యకు ప్రేరేపించాలనే ఉద్దేశాన్ని కలిగి ఉన్నాడని నిరూపించాల్సిన అవసరం ఉందని కోర్టు స్పష్టం చేసింది. ఈ కేసు ఒక మహిళ, ఆమె చిన్న కుమార్తెకు సంబంధించినది. భర్త తిట్టడంతో ఆమె ఆత్మహత్య చేసుకుందని ఆరోపణలు వెల్లువెత్తాయి. ప్రాసిక్యూషన్ ప్రకారం ఆ మహిళ భర్త మరో వివాహితతో అక్రమ సంబంధం పెట్టుకున్నాడు. ఈ విషయం భార్యకు తెలిసి.. భర్తను ప్రశ్నించింది, దీంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. అక్రమ సంబంధంపై దంపతుల మధ్య గొడవ జరిగిన తరువాత... భర్త ఆ మహిళతో 'నువ్వు వెళ్లి చావు' అని చెప్పాడని, ఆ తర్వాత ఆ మహిళ తన ఐదున్నర ఏళ్ల కుమార్తెతో సెప్టెంబర్ 15, 2023న బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. దీని తరువాత, కాసర్గోడ్‌లోని మెల్పరంబా పోలీస్ స్టేషన్ ఆ మహిళ భర్తపై కేసు నమోదు చేసింది. కాసర్గోడ్ అదనపు జిల్లా, సెషన్స్ కోర్టు నిందితుడిపై అభియోగాలు మోపాలని నిర్ణయించింది. ఆ తర్వాత ఆ మహిళ భర్త హైకోర్టును ఆశ్రయించి... ఆ మాటలు కోపంతో పలికానని, తన భార్యను ఆత్మహత్యకు రెచ్చగొట్టడానికి ఉద్దేశించినవి కాదని తెలిపాడు. దీనిపై తీర్పు ఇస్తూ హైకోర్టు సుప్రీం కోర్టు నిర్ణయాన్ని ఉదహరించింది. గొడవ సమయంలో కోపంతో మాట్లాడే సాధారణ లేదా అజాగ్రత్త పదాలు ఆత్మహత్యను ప్రేరేపించే ఉద్దేశంగా పరిగణించబడవని పేర్కొంది. ఈ కేసులో 'వెళ్లి చావు' అనే పదం వాగ్వాదం సమయంలో పలికారని, మతురాలి ఆత్మహత్యకు ప్రేరేపించే ఉద్దేశం లేకుండానే ఈ వ్యాఖ్యలు చేశారని కేరళ హైకోర్టు పేర్కొంది.

# 'ఎస్ఐఆర్' పై మమత పోరాటం

## 2న రాజధానికి పయనం



**కోల్‌కతా:** ఎస్ఐఆర్‌పై పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ దేశ రాజధాని ఢిల్లీ కేంద్రంగా పోరాటానికి సిద్ధమవుతున్నారు. ఎస్ఐఆర్‌పై కేంద్ర ఎన్నికల సంఘం, ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం చేయాలని మమత నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. మమతా బెనర్జీ నేతత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ వచ్చే వారం ఢిల్లీలో భారీ కవాతు నిర్వహించేందుకు ప్రణాళిక రచించినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. త్వరలోనే బెంగాల్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఎన్నికల సంఘం ప్రత్యేక సర్వే నిర్వహించింది. దీంతో పెద్ద ఎత్తున ఓట్లు తొలగించింది. అప్పటి నుంచి ఎన్నికల సంఘానికి, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా తృణమూల్ విమర్శలు చేస్తోంది. ఓటర్ల జాబితా నుంచి అక్రమంగా తొలగించారని ఆరోపించింది. ఈ కేసును వచ్చేవారం సుప్రీంకోర్టు విచారించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఎన్నికల కమిషన్ లేదా సుప్రీం కోర్టు, జంతర్ మంతర్ వరకు మమతా బెనర్జీ ర్యాలీలు నిర్వహించే అవకాశం ఉందని వర్గాలు పేర్కొంటున్నాయి. కాగా, ఫిబ్రవరి 2 సాయంత్రం 4 గంటలకు ఇద్దరు సహచరులతో మమతా బెనర్జీ సమావేశమయ్యేందుకు ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ అపాయింట్‌మెంట్ ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఫిబ్రవరి 1 సాయంత్రం లేదా ఫిబ్రవరి 2 తెల్లవారుజామున మమత ఢిల్లీకి చేరుకుంటారని భావిస్తున్నారు. దీని కోసం పెద్ద ఎత్తున జనసమూహాన్ని మమత ఢిల్లీకి తీసుకెళ్లే అవకాశం ఉందని తెలుస్తోంది.

# ఇండిగో విమానానికి బాంబు బెదిరింపు

**న్యూఢిల్లీ:** కువైట్ నుంచి ఢిల్లీ బయల్దేరిన ఇండిగో విమానానికి బాంబు బెదిరింపు రావడం కలకలం సష్టించింది. దీంతో విమానాన్ని అహ్మదాబాద్‌లో అత్యవసర ల్యాండింగ్ చేశారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం కువైట్ నుంచి ఢిల్లీ బయల్దేరిన ఇండిగో విమానం గాల్లో ఉన్న సమయంలో టాయిలెట్‌లోని ఓ టిష్యూ పేపర్‌పై విమానంలో బాంబు పెట్టినట్లు రాసి ఉన్న బెదిరింపు నోట్‌ని ఓ ప్రయాణికుడు గుర్తించి... సిబ్బందిని అప్రమత్తం చేశాడు. వెంటనే స్పందించిన పైలట్లు అహ్మదాబాద్ ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్‌కి సమాచారం అందించి అత్యవసర ల్యాండింగ్ కోసం అభ్యర్థించారు. దీంతో విమానాశ్రయ అధికారులు ఫైర్ టెండర్లు, అంబులెన్స్‌లు సిద్ధంగా ఉంచారు. శుక్రవారం ఉదయం 6.40 గంటలకు అహ్మదాబాద్‌లోని సర్దార్ వల్లభాయ్ పటేల్ అంతర్జాతీయ విమానాశ్రయంలో విమానాన్ని సురక్షితంగా ల్యాండ్ చేశారు. అనంతరం ప్రయాణికులను కిందకు దించేసి, విమానంలో తనిఖీలు చేశారు. ఘటన సమయంలో విమానంలో 180 మంది ప్రయాణికులు ఉన్నారు.

ప్రజాపక్షం
Telugu National Daily
మహబూబ్‌నగర్
శనివారం
31-01-2026
www.prajapaksham.in


# ఐదేళ్లలో ఉన్నతాదాయ దేశంగా వియత్నాం!

వియత్నాం దేశాన్ని పరిపాలిస్తున్న వియత్నాం కమ్యూనిస్టు పార్టీ (సిపివి) 2030 ఫిబ్రవరి 3వ తేదీ నాటికి వందేళ్ళు పూర్తి చేసుకోనుంది. ఈ నేపధ్యంలో జనవరి 19– 23 తేదీలలో రాజధాని హనోయ్ నగరంలో జరిగిన సిపివి 14వ జాతీయ మహాసభ ప్రాధాన్యత సంతరించుకుంది. మార్క్సిజం–లెనినిజం బాటలో, ఆధునిక వియత్నాం జాతిపిత హోచిమిన్ ఆలోచనల వెలుతురులో అర్ధశతాబ్దంగా అభివృద్ధి వైపు వడివడిగా అడుగులు పడుతున్నాయి. ప్రజలే కేంద్రంగా సమసమాజ వ్యవస్థ దిశగా అనేక ఒడిదొడుకులను ఎదుర్కొని నిలబడింది ఈ ఆగ్నేయాసియా దేశం. ప్రపంచం అబ్బురపడేలా నేటి నవ్య వియత్నాం అద్భుత విజయాలను సొంతం చేసుకుంటున్నది. వాటిని మరింత ముందుకు తీసుకువెళ్ళేందుకు ఐదేళ్ళకు ఒకసారి జరిగే సిపివి మహాసభ మార్గదర్శనం చేసింది. దేశవ్యాప్తంగా అరకోటికి పైగా ఉన్న పార్టీ సభ్యులకు ప్రాతినిధ్యం వహించే 1,586 మంది వచ్చే ఐదేళ్ళ కాలానికి (2026–2030) వరకు సాధించాల్సిన లక్ష్యాలపై చర్చించి పలు నిర్ణయాలు తీసుకున్నారు.

వచ్చే మహాసభ జరిగే నాటికి సిపిసి వందేళ్ళసంబురాన్ని సంకేతాత్మకంగా నిర్వహించుకునేందుకే పరిమితమవకుండా, ప్రజల జీవితాల్లో మరింత గుణాత్మక మార్పు తీసుకువచ్చేందుకు మహాసభ కంకణబద్ధమైంది. ఆధునిక వియత్నాం జాతిపిత హోచిమిన్ ఆదర్శాలు, జాతీయ విముక్తి ఉద్యమ చారిత్రక లక్ష్యాలను సాధించేందుకు 2030 – 2045 కోసం దీర్ఘకాలిక ప్రణాళికలను రూపొందించుకుంది. అందులో భాగంగా 2030 నాటికి వియత్నాం మధ్య తరగతి నుంచి ఎగువ తరగతి ఆదాయ స్థాయిని సాధించి, సిర్థమైన, శక్తివంతమైన సోషలిస్టుదేశంగా ఎదగాలని నిర్దేశించుకుంది. కేవలం అంకెలతో కాకుండా ప్రజల జీవన ప్రమాణాలలో వాస్తవిక మెరుగుదలలో ఆదాయాభివృద్ధిని అంచనావేయాలని నొక్కి చెప్పింది. అలా కొనసాగిస్తూ 2045 నాటికి అభివృద్ధి చెందిన, స్వాతంత్ర్య, సోషలిస్టు దేశంగా ఎదగాలని గురిపెట్టుకుంది. అలాగే సిపివి మహాసభలో గడిచిన ఐదేళ్ళ ప్రస్థానంపై కూడా ఆత్మశోధన కూడా చేసుకున్నారు. సంస్థాగత బలహీనతలను గుర్తిస్తూనే ఆర్థికాభివృద్ధి, సామాజిక స్థిరత్వం, అంతర్జాతీయ స్థిరత్వం విషయంలో గణనీయమైన పురోగతి సాధించడం పట్ల ప్రతినిధులు సంతృప్తి వ్యక్తం చేశారు. వేగవంతమైన సుస్థిర అభివృద్ధి కేంద్రంగా సామాజిక–ఆర్థిక అభివృద్ధి వ్యూహాన్ని మహాసభ నిర్దేశించుకుంది. ప్రభుత్వ మార్గదర్శక పాత్రను నిలబెట్టుకుంటూనే సోషలిస్టు ఆధారిత మార్కెట్ ఆర్థిక వ్యవస్థ పరిధిలోనే పురోగమించాలని పునరుద్ఘాటించింది. సామాజిక న్యాయం, సమానత్వాన్ని అనుసంధానిస్తూనే డిజిటల్ ట్రాన్స్‌ఫార్మేషన్, పారిశ్రామికీకరణ, హరిత అభివృద్ధి, వైవిధ్యంతో కూడిన ఆర్థికాభివృద్ధికి ప్రాధాన్యతను ఇచ్చింది.

వియత్నాం గత విజయాలను పరికిస్తే మహాసభ లక్ష్యాలు సాధించడం కష్టమేమీ కాదు. రెండు దశాబ్దాల వియత్నాం యుద్ధం ముగిసి 1975లో కమ్యూనిస్టు పార్టీ అధికారం చేపట్టే నాటికి, అది ప్రపంచంలోనే అత్యంత పేద దేశాలలో ఒకటి. పంచవర్ష ప్రణాళికలు పెద్దగా ప్రభావం చూపలేదు. 1980 దశాబ్దం నాటికి తలసరి ఆదాయం 200–300 డాలర్ల మధ్యే ఊగిసలాడేది. దీనిని సవాలుగా తీసుకున్న వియత్నాం కమ్యూనిస్టు పార్టీ 1986లో 'డోయి మొయి' పేరుతో ఆర్థిక, రాజకీ సంస్కరణలకు రూపకల్పన చేసింది. ప్రభుత్వ మార్గదర్శకత్వాన్ని కొనసాగిస్తూనే ప్రభుత్వ, సహకర, ప్రైవేటు రంగాలను ప్రోత్సహించింది. దేశాన్ని 'సోషలిస్టు ఆధారిత మార్కెట్ ఆర్థిక వ్యవస్థ'గా తీర్చిదిద్దింది. కఠినమైన, పిడివాద వైఖరితో కాకుండా, దేశ కాలమాన పరిస్థితులకు అనుగుణంగా సిద్ధాంతాలను అన్వయించుకుంటూ వియత్నం తన స్వంత పంథాలో సోషలిజాన్ని సృష్టించుకుంది.

నేడు వియత్నాం ప్రపంచంలోనే ఎదుగుతున్న మార్కెట్‌లలో ఒకటిగా ముందంజలో ఉంది. పదేళ్ళలో (2010–2023) కటిక పేదరికాన్ని 14 శాతం నుంచి 4 శాతాని తగ్గించింది. 2025 నాటికి తలసరి ఆదాయం 5000 డాలర్లకు ఎగబాకింది. ప్రపంచం అనిశ్చితిని ఎదుర్కొంటున్న తరుణంలో కూడా జిడిపి 8.02 శాతం వృద్ధిని రికార్డు చేసింది. 930 బిలియన్ డాలర్లకు పైగా వాణిజ్యం చేసి, తొలి 20 వాణిజ్య ఆర్థిక వ్యవస్థలలో ఒకటిగా నిలిచింది. వ్యవసాయ ఎగుమతులలో అగ్రగామి. తయారీరంగం, ఎలాక్ట్రానిక్స్ రంగ సహా, ఐటి రంగంలో కూడా అబ్బురపరిచే ఘనతలు వియత్నాం సొంతం.

మార్కెట్ ఆర్థిక వ్యవస్థ ఎదుర్కొనే అతి పెద్ద క్యాన్సర్ అవినీతి. సోషలిజాన్ని పరిరక్షించుకునేందుకు అవినీతి వ్యతిరేక పోరును తీవ్రతరం చేయాలని సిపివి మహాసభ కర్తవ్యరూఢురాలైంది. ఇటు పార్టీకి, అటు ప్రభుత్వానికి అవినీతి అంతర్గత ముప్పుగా గుర్తించింది. దీనిని అధిగమించేందుకు కఠిన క్రమశిక్షణ, పారదర్శకత, జవాబుదారీతనం ఆవశ్యకతను బలంగా ప్రకటించింది. నేటికీ సోషలిజానికే ప్రసాంగికత ఉందని తమ అనుభవాన్ని ప్రపంచం ఎదుట సాక్షాత్కరింపజేసింది వియత్నాం. చివరలో మహాసభ నూతన నాయకత్వాన్ని ఎన్నుకుంది. ప్రస్తుత ప్రధాన కార్యదర్శి టు లామ్‌ను తిరిగి ఎన్నుకోవడం సహా, 200 మంది సభ్యులతో నూతన కేంద్ర కమిటీ, అందులో నుంచి పొలిట్ బ్యూరో, క్రమశిక్షణ కమిటీ ఎన్నికైంది. పార్టీ నిర్మాణంపై దృష్టి పెడుతూ సైద్ధాంతిక దృఢత్వం, నైతిక స్వచ్ఛత, సంస్థాగతంగా బలం మరింత పెరుగుపరుచుకునేందుకు పార్టీ శ్రేణుల శిక్షణ, క్రమశిక్షణకు పెద్ద పీట వేయాలని నిర్ణయం తీసుకుంది.


స్వతంత్ర, స్వీయప్రకాశిత, శాంతియుత విదేశాంగ విధానానికి కట్టుబడుతూనే, అన్ని దేశాలతో సమానత్వం, పరస్పర గౌరవం, జోక్యరహిత సంబంధాలను కొనసాగించేందుకు నిర్ణయించింది. అంతర్జాతీయ కమ్యూనిస్టు, వామపక్ష ఉద్యమానికి సంఘీభావాన్ని బలోపేతం చేసుకోవాలని నూతన నాయకత్వం నిబద్ధతతో ప్రకటించింది. ప్రపంచవ్యాప్తంగా ఆదాయ అసమానతలను తీవ్రతరం చేసిన పెట్టుబడిదారి విధానానికి ప్రత్యామ్నాయంగా సమాభివృద్ధిని విజయవంతంగా అమలు చేస్తున్న వియత్నాం నమూనా ఆదర్శనీయం. దేశాభివృద్ధిలో భాగమయ్యేందుకు విదేశాలలో స్థిరపడిన వియత్నాం వాసులు స్వదేశానికి తిరిగి వస్తున్నారు. గతానుభవాల రీత్యా భావి లక్ష్యాలను సాధిస్తామనే విశ్వాసం వియత్నామీయులలో మెండుగా కనపడుతోంది.



## ఆర్థిక పతనం ప్రమాదంలో యుఎన్‌ఒ

**చెల్లించని బకాయిలు, బడ్జెట్ నిబంధన కింద ఖర్చు చేయని డబ్బు తిరిగి చెల్లింపు కారణంగా ఐక్యరాజ్య సమితి (యుఎన్‌ఒ) 'ముంచుకొస్తున్న ఆర్థిక పతన' ప్రమాదంలో ఉంది. ఈ సంక్షోభం తీవ్రమవుతోంది. ఇది కార్యక్రమాల అమలుకు ముప్పు కలిగిస్తూ, ఆర్థిక పతనానికి దారితీస్తోంది. సమీప భవిష్యత్తులో పరిస్థితి మరింత దిగజారుతుంది.**

సభ్య దేశాలకు యుఎన్ సెక్రటరీ-జనరల్ ఆంటోనియో గుటెర్రెస్ లేఖ




## ఎఐ.. ప్రపంచ దేశాలకు లాభమా నష్టమా?

ప్రస్తుతం ఎఐ(కృత్రిమ మేధస్సు) ప్రపంచానికి లాభమా? నష్టమా? ఇది లాభాలు అందిస్తోంది, కానీ ఉపాధి పరంగానష్టాలు కొన్ని ఉన్నాయి అనేది నిపుణుల అభిప్రాయం. ఎఐ యొక్క నికర ప్రభావం దేశాలు, సంస్థల నిర్వహణపై ఆధారపడి ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. కానీ దేశ ఆర్థిక వ్యవస్థకు 2030 నాటికి 15.7 ట్రిలియన్ డాలర్ల సంపద జోడిస్తుందని అంచనా. ఆరోగ్యం, వ్యవసాయం లాంటి రంగాల్లో పరిష్కారాలు చూపుతూ సహాయపడుతుంది అనేది అంచనా. ఎఐ ఇది నిర్ణయాలు మెరుగుపరుస్తూ, సైబర్ సెక్యూరిటీని బలోపేతం చేస్తుంది. వివిధ దేశాల్లో ఎఐ ని ప్రయోజకరంగా చూస్తున్నారు, ముఖ్యంగా ఆసియా దేశాల్లో ఎఐ నష్టాలు, ఉపాధి నష్టాలు, డీప్‌ఫేక్‌లు, సమాచార గోప్యత ఉల్లంఘనలు, సామాజిక అసమానతలు పెరుగుతున్నాయి.

ఎఐ వాడకం ద్వారా పర్యావరణానికి పెను భారంగా మారి మానసిక ఆరోగ్య సమస్యలు కలిగిస్తుంది అనేది అంచనా మాత్రమే. అభివృద్ధి చెందిన దేశాల్లో అమెరికా, రష్యా, చైనా, లాంటి దేశాల్లో అసమానతలు మరింత పెరిగే అవకాశం ఉంది. ఎఐ ప్రపంచ ఆర్థిక వ్యవస్థను మార్చడం ద్వారా లాభాలు అందిస్తుంది అనేది విశ్లేషకుల అభిప్రాయం మాత్రమే అని చెప్పుకోవచ్చు. కానీ రిస్కులు నిర్వహణ దీనికి చాలా అవసరం. 2025లో ఆశావాదం పెరిగినప్పటికీ, అవకాశవాదం, సమానత్వం ద్వారా భవిష్యత్తు ప్రభావంపైన ఆధారపడి ఉంటుంది.

ప్రపంచ దేశాలు ఎఐని ప్రోత్సహిస్తూనే నియంత్రణలు విధిస్తున్నారు. అమెరికా, చైనా ఎఐ అభివృద్ధిలో ముందుండగా, ఇయు మాత్రం కఠిన నియమాలు తీసుకుంది. 75 దేశాల్లో ఎఐ చట్టాలు గణనీయంగా 21% నిబంధనలు పెరిగాయి అమెరికా, చైనా, ఎఐ కి ఇన్నోవేషన్‌కు స్వేచ్ఛ ఇచ్చి ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ 14179 ద్వారా నియంత్రణలు తగ్గించింది. చైనా ఎఐ ని జాతీయ ప్రాధాన్యతగా చేసి 2030 నాటికి అగ్రస్థానమే లక్ష్యంగా పెట్టుకుంది. ఆరోగ్యానికి సంబంధించిన టాబ్లెట్లు ఇంజక్షన్ల తయారీల్లో ఈ రెండు దేశాలు ఎఐ వినియోగంతో టాప్‌లో ముందు వరుసలో ఉన్నాయి. యూరప్, ఇతర దేశాలు ఇయు ఎఐ యాక్ట్ ఫ్రాన్స్ ఏ109 బిలియన్లు, కెనడా $2.4 బిలియన్లు, భారత్ $1.25 బిలియన్లు ఇన్వెస్ట్ చేస్తోంది. సింగపూర్, సౌత్ కొరియా, ఎస్టోనియా వంటి దేశాలతో పోలిస్తే ఎఐ అడాప్షన్‌లో ముందు భారత్ కనిపిస్తోంది. భవిష్యత్ భారత్ ఎఐ వినియోగంలో చైనాతో సమానంగా ఉండి బ్యాంకింగ్, ఇ–కామర్స్‌లో సమఉజ్జీగా నిలుస్తోంది. 45 దేశాలు ఎఐ నీ తయారు చేస్తున్నాయి, ఎఐపై ప్రపంచ దేశాలు సెమినార్ నిర్వహించగా (దేశ ప్రధాని మోదీతో) సహా ఎఐతో రాబోయే 50 సంవత్సరాల వరకు ఉద్యోగ నష్టాలు కానీ గణనీయమైన లాభాలు ఉండవని తేల్చి చెప్పారు. కానీ వివిధ రాష్ట్రాల్లో ఎఐని తమ స్వార్థాలకు ఉపయోగించుకుంటున్నారు సామాజిక మాధ్యమాల్లో ఎఐ పాత్ర బాగా ఉపయోగపడుతుంది.

కొన్ని యూట్యూబ్ ఛానల్స్ లో ఎఐ ని ఉపయోగించి ఒక మహిళ యాంకర్‌గా మార్చి ద్వందార్థ డైలాగులతో ప్రజలను తికమక పెడుతున్నారు. అసభ్య పదజాలంతో జనాలను తప్పుదోవ పట్టిస్తున్నారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం గానీ కేంద్ర ప్రభుత్వం కానీ నియమనిబంధనలు కట్టుదిట్టంగా విధించి ఉంటే బాగుండేది ఇకనైనా ఇలాంటివి జరగకుండా చూడాలని రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేస్తున్నారు.

వెంకట్ పులిపాటి

# టేబుల్ దగ్గర లేకుంటే.. మెనూలో ఉంటాం!

*ఇటీవల దావోస్‌లో జరిగిన వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ వార్షిక సమావేశంలో కెనడా ప్రధాన మంత్రి మార్క్ కార్నీ చేసిన ప్రసంగం ప్రపంచవ్యాప్తంగా అందరినీ ఆలోచింపజేసింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇష్టారీతిన టారిఫ్‌ల విధింపు, ఇతర దేశాలపై దుందుడుకు వ్యవహారం నేపథ్యంలో కొత్త వ్యవస్థ అవసరాన్ని ఆయన నొక్కి చెప్పారు. కెనడా ప్రధాని కార్నీ ప్రసంగంలో ముఖ్య భాగాలు...*



దావోస్‌లో ప్రసంగిస్తున్న కెనడా ప్రధాన మంత్రి మార్క్ కార్నీ

మిత్రులారా...

కెనడా, ప్రపంచం ఎదుర్కొంటున్న ఈ కీలకమైన సమయంలో మీతో ఉండటం ఆనందంగా ఉంది. ఈ రోజు నేను ప్రపంచ వ్యవస్థ విచ్ఛిన్నమవటం గురించి, ఒక ఆహ్లాదకరమైన కల్పన ముగింపు, కఠినమైన వాస్తవం ఆరంభం గురించి మాట్లాడుతాను. అగ్ర శక్తి (అమెరికా) భౌగోళిక రాజకీయాలు ఎలాంటి పరిమితులు, అడ్డంకులకు లోబడి ఉండవు.

మరోవైపు, ఇతర దేశాలు, ప్రత్యేకించి కెనడా వంటి మధ్యంతర శక్తులు, శక్తిహీనులు కాదని నేను మీకు చెప్పాలనుకుంటున్నాను. మానవ హక్కుల పట్ల గౌరవం, స్థిరమైన అభివృద్ధి, సంఘీభావం, సార్వభౌమాధికారం, వివిధ దేశాల ప్రాదేశిక సమగ్రత వంటి మన విలువల ను కలిగి ఉన్న కొత్త వ్యవస్థ నిర్మించగల సామర్థ్యం వారికి ఉంది. తక్కువ శక్తి కలిగిన వారి బలం నిజాయితీతో ప్రారంభమవుతుంది.

దశాబ్దాలుగా, కెనడా వంటి దేశాలు నియమాల ఆధారిత అంతర్జాతీయ వ్యవస్థ అని మనం పిలిచే దాని కింద అభివృద్ధి చెందాయి. మేము దాని సంస్థలలో చేరాం. దాని సూత్రాలను ప్రశంసించాం. దాని అంచనా నుండి మేము ప్రయోజనం పొందాం. దాని కారణంగా, దాని రక్షణలో విలువల ఆధారిత విదేశాంగ విధానాలను మనం అనుసరించగలిగాం. అంతర్జాతీయ నియమాల ఆధారిత వ్యవస్థ గురించిన కథనం పాక్షికంగా తప్పు అని మాకు తెలుసు.

బలవంతులు తమకు అనుకూలమైనప్పుడు తమ ను తాము మినహాయించుకుంటారని, వాణిజ్య నియమాలు అసమానంగా అమలు చేయబడతాయని, నిందితుడు లేదా బాధితుడి గుర్తింపును బట్టి అంతర్జాతీయ చట్టం కఠినత్వం వివిధ స్థాయిలలో వర్తిస్తుందని మాకు తెలుసు.

ఈ కల్పన ప్రయోజనకరంగా ఉంది. ముఖ్యంగా అమెరికన్ ఆధిపత్యం ప్రజా సౌకర్యాలు, అందుబాటులో సముద్ర మార్గాలు, స్థిరమైన ఆర్థిక వ్యవస్థ, సామూహిక భద్రత, వివాదాల పరిష్కారానికి చట్రాలకు మద్దతును అందించడంలో సహాయపడింది. కాబట్టి, వాగాడంబారానికి, వాస్తవికతకు మధ్య ఉన్న అంతరాలను ఎక్కువగా ప్రస్తావించలేదు.

ఈ బేరసారాలు ఇక పనిచేయవు. నేను నేరుగా చెప్పాలంటే మనం పరివర్తన(దశ)లో కాదు, బద్ధలయ్యే దశలో ఉన్నాం. గత రెండు దశాబ్దాలుగా, ఆర్థికం, ఆరోగ్యం, ఇంధనం, భౌగోళిక రాజకీయాలలో వరుస సంక్షోభాలు ప్రపంచ ఏకీకరణలోని తీవ్ర ప్రమాదాలను బయటపెట్టాయి. కానీ ఇటీవల, అగ్ర శక్తులు ఆర్థిక ఏకీకరణను ఆయుధాలుగా, సుంకాలను పరపతిగా, ఆర్థిక మౌలిక సదుపాయాలను బలవంతంగా, సరఫరా గొలుసులను దుర్బలత్వాలుగా దోపిడీకి ఉపయోగించడం ప్రారంభించాయి. మీ చేతికింద ఉండేందుకు కలిసుండడం అనేది మూలంగా మారినప్పుడు, కలిసి ఉండడం ద్వారా పరస్పర ప్రయోజనం అనే అబద్ధంలో మీరు జీవించలేరు. మధ్య తరహా శక్తులు(మిడిల్ పవర్స్) ఆధారపడిన డబ్ల్యుటిఒ, యుఎన్, కాప్ వంటి బహుళపాక్షిక సంస్థల సమిష్టి సమస్య పరిష్కార నిర్మాణమే ముప్పులో ఉన్నాయి. ఫలితంగా, అనేక దేశాలు ఇంధనం, ఆహారం, కీలకమైన ఖనిజాలు, ఆర్థిక, సరఫరా గొలుసులలో ఎక్కువ వ్యూహాత్మక స్వయంప్రతిపత్తిని అభివృద్ధి చేసుకోవాలనే ఒకే రకమైన నిర్ణయానికి వచ్చాయి. ఈ ప్రేరణ అర్థం చేసుకోదగినదే. తనను తానుగా పోషించుకోలేని, ఇంధనం ఏర్పాటు చేసుకోలేని లేదా తనను తాను రక్షించుకోలేని దేశానికి కొద్ది ప్రత్యామ్నాయాలు మాత్రమే ఉంటాయి. నియమాలు ఇకపై మిమ్మల్ని రక్షించనప్పుడు, మిమ్మల్ని మీరే రక్షించుకోవాలి. కానీ ఇది ఎక్కడికి దారితీస్తుందో స్పష్టంగా తెలుసుకుందాం.

దుర్గం వంటి వారి ప్రపంచం బలహీనంగా, పెళుసుగా, తక్కువ స్థిరమైనదిగా ఉంటుంది. మరొక నిజం కూడా ఉంది. అగ్రరాజ్యాలు తమ అధికారం, ప్రయోజనాలను అడ్డంకులు లేకుండా సాధించడం కోసం నియమాలు, విలువలు అనే నటనను కూడా వదిలివేస్తే, లావాదేవీల నుండి వచ్చే లాభాలను పునరావృతం చేయడం కష్టం అవుతుంది. ఆధిపత్యవాదులు తమ సంబంధాలను నిరంతరం డబ్బుగా మార్చుకోలేరు. అనిశ్చితి నుండి రక్షణ కోసం మిత్రదేశాలు వైవిధ్యభరితంగా ఉంటాయి. వారు సార్వభౌమత్వాన్ని పునర్నిర్మించడానికి ప్రత్యామ్నాయాలను వేగవంతం చేస్తారు. ఒకప్పుడు నియమాలపై ఆధారపడిన సార్వభౌమాధికారం నుంచి ఒత్తిడిని తట్టుకునే సామర్థ్యంతో నిలబడాతారు.

అయితే, ప్రతి ఒక్కరూ తమ సొంత దుర్గాలను నిర్మించుకోవడం కంటే తిరిగి నిలబడేందుకు సమిష్టి పెట్టుబడులు చౌకగా ఉంటాయి. ఉమ్మడి ప్రమాణాలు విచ్ఛిన్నాలను తగ్గిస్తాయి. అందుకు సానుకూలమైన విషయం పరిపూరకంగా లభిస్తుంది.

### మేము ముందుగా మేల్కొన్నాం

ఇప్పుడు కెనడా మొదటగా మేల్కొలుపు పిలుపు విన్న దేశాలలో ఒకటి. ఇది మా వ్యూహాత్మక వైఖరిని ప్రాథమికంగా మార్చడానికి దారితీసింది. మన భౌగోళిక శాస్త్రం, కూటమి సభ్యత్వాలు వాటంతట అవే శ్రేయస్సు, భద్రతను ఇస్తాయనే మన పాత సౌకర్యవంతమైన అంచనాలు. ఆ ఊహ ఇకపై చెల్లదని కెనడియన్లకు తెలుసు. మా కొత్త విధానం ఫిన్లాండ్ అధ్యక్షుడు అలెగ్జాండర్ స్టబ్ 'విలువ ఆధారిత వాస్తవికత' అని పిలిచిన దానిపై ఆధారపడి ఉంటుంది.

లేదా, ఇంకో విధంగా చెప్పాలంటే, మేము సూత్రప్రాయంగా, ఆచరణాత్మకంగా ఉండాలని లక్ష్యంగా పెట్టుకున్నాము. ప్రాథమిక విలువలు, సార్వభౌమాధికారం, ప్రాదేశిక సమగ్రత,(యుఎన్ చార్టర్‌కు అనుగుణంగా ఉంటే) బలప్రయోగం నిషేధం సహా మానవ హక్కులను గౌరవించడంలో సూత్రబద్ధంగా కట్టుబడి ఉంటాం.

పురోగతి తరచుగా పెరుగుతుందని గుర్తించడం, ఆసక్తులు భిన్నంగా ఉంటాయని, ప్రతి భాగస్వామి మా విలువలన్నిటినీ పంచుకోలేరని ఆచరణాత్మకంగా ఉండాల ని మేము లక్ష్యంగా పెట్టుకున్నాము. కాబట్టి, మేము కళ్ళు తెరిచి విస్తృతంగా, వ్యూహాత్మకంగా నిమగ్నమై ఉన్నాము. మనం ఉండాలనుకునే ప్రపంచంకోసం వేచి ఉండకుండా, మనం ఉంటున్న ప్రపంచాన్ని యథాతథంగా స్వీకరిస్తాం.

మేము మా సంబంధాలను క్రమబద్ధం చేస్తున్నాము. కాబట్టి వాటి లోతు మన విలువలను ప్రతిబింబిస్తుంది. ప్రస్తుతానికి ప్రపంచ అస్థిరత, దీని కారణంగా కలిగే నష్టాలు, తదుపరి దానికోసం ఉన్న అవకాశాల ను బట్టి, మా ప్రభావాన్ని పెంచుకోవడానికి విస్తృత సంభాషణలకు మేము ప్రాధాన్యత ఇస్తున్నాము. మనం ఇకపై మన విలువల బలం మీద మాత్రమే ఆధారపడటం లేదు. మన బలం విలువపై కూడా ఆధారపడుతున్నాము. మేము ముందు మా ఇంట్లో ఆ బలాన్ని పెంచుకుంటున్నాము. మా ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుండి, మేము ఆదాయాలు, క్యాపిటల్ గెయిన్స్, వ్యాపార పెట్టుబడులపై పన్నులను తగ్గించాము.

అంతర్‌ప్రాంతీయ వాణిజ్యానికి ఉన్న అన్ని సమాఖ్య అడ్డంకులను తొలగించాము. మేము విదేశాలలో కూడా వేగంగా వైవిధ్యభరితంగా మారుతున్నాము. యూరోపియన్ రక్షణ సేకరణ ఏర్పాట్లలో సేఫ్(ఎస్ఎఎఫ్ఇ)లో చేరడం సహా ఇయుతో సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మేము అంగీకరించాము.ఆరు నెలల్లో నాలుగు ఖండాలలో 12 ఇతర వాణిజ్య, భద్రతా ఒప్పందాలపై మేము సంతకం చేసాము. గత కొన్ని రోజులుగా, మేము చైనా, ఖతార్‌లతో కొత్త వ్యూహాత్మక భాగస్వామ్యాల ను చేసుకున్నాము. భారతదేశం, ఏషియాన్, థాయిలాండ్, ఫిలిప్పీన్స్, మెర్కోసూర్‌లతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలపై మేము చర్చలు జరుపుతున్నాము.

మేము ఇంకో పని కూడా చేస్తున్నాం. ప్రపంచ సమస్యలను పరిష్కరించడంలో సహాయపడటానికి, మేము వేర్వేరు లెక్కలను అనుసరిస్తు న్నాం, మరో మాటలో చెప్పాలంటే, ఉమ్మడి విలువలు, ఆసక్తుల ఆధారంగా విభిన్న సమస్యల కోసం విభిన్న సంకీర్ణాలు. కాబట్టి, ఉక్రెయిన్ విషయంలో మేము కోవాలేషన్ ఆఫ్ విల్లింగ్‌లో ప్రధాన సభ్యులం. దాని రక్షణ, భద్రతకు అతిపెద్ద తలసరి సహకారులలో ఒకరిగా ఉన్నాము.

అలాగే ఆర్కిటిక్ సార్వభౌమాధికారం విషయంలో, మేము గ్రీన్‌ల్యాండ్, డెన్మార్క్‌లకు గట్టిగా మద్దతు ఇస్తున్నాము. గ్రీన్‌ల్యాండ్ భవిష్యత్తును నిర్ణయించే వారి ప్రత్యేక హక్కుకు పూర్తిగా మద్దతు ఇస్తున్నాము. గ్రీన్‌ల్యాండ్ సుంకాలను కెనడా తీవ్రంగా వ్యతిరేకిస్తుంది.

### టేబుల్ దగ్గర లేకపోతే... మెనూలో ఉంటాం..

ఇది అమాయకమైన బహుళపాక్షికత కాదు, లేదా వారి సంస్థలపై ఆధారపడటం కూడా కాదు. ఇది సమస్యల వారీగా కలిసి పనిచేయడానికి తగినంత ఉమ్మడి క్షేత్రాన్ని పంచుకునే భాగస్వాములతో పనిచేసే సంకీర్ణాలను నిర్మిస్తోంది. మధ్యస్థాయి దేశాలు కలిసి పనిచేయాలి. ఎందుకంటే మనం దగ్గర లేకపోతే, మనం మెనూలో ఉన్నట్లే.

కానీ అగ్ర శక్తులు ప్రస్తుతానికి ఒంటరిగా ముందుకు సాగగలవని నేను కూడా చెబుతాను. వాటికి మార్కెట్ పరిమాణం, సైనిక సామర్థ్యం, నిబంధనలను నిర్దేశించే పరపతి ఉన్నాయి.

మధ్య స్థాయి శక్తులు అలా చేయవు. కానీ మనం ఆధిపత్యం ఉన్న వ్యక్తితో ద్వైపాక్షికంగా మాత్రమే చర్చలు జరిపినప్పుడు, మనం బలహీనత ఆధారంగా చర్చలు జరుపుతాము. వారు ఏదిస్తే దానిని మనం అంగీకరిస్తాము. అత్యంత అనుకూలత కలిగి ఉండటానికి మనం ఒకరితో ఒకరు పోటీ పడతాము.

### మధ్య శక్తులు నిజంలో జీవించడం అంటే అర్థమేమిటి?

మొదట, దీని అర్థం వాస్తవాన్ని చెప్పడం. ఇప్పటికీ ప్రచారం చేస్తున్నట్లుగానే నియమాల ఆధారిత అంతర్జాతీయ వ్యవ్యస్థను వేడుకోవడం ఆపండి. దానిని ఏమని పిలవాలంటే, అగ్రరాజ్యం కోసం పోటీని తీవ్రతరం చేసే వ్యవస్థ అని. ఇక్కడ అత్యంత శక్తివంతమైనవారు తమ ప్రయోజనాలను కొనసాగిస్తారు, ఆర్థిక ఏకీకరణను బలవంతంగా ఉపయోగిస్తారు.

దీని అర్థం స్థిరంగా వ్యవహరించడం, మిత్రదేశాలు, ప్రత్యర్థులకు ఒకే ప్రమాణాలను వర్తింపజేయడం. మధ్యస్థాయి శక్తులు ఒక దిశ నుండి ఆర్థిక బెదిరింపులను విమర్శించినప్పుడు, మరొక దిశ నుండి వచ్చే ఆర్థిక బెదిరింపుల పట్ల మౌనంగా ఉంటున్నాయి. పాత వ్యవస్థ పునరుద్ధరించబడే వరకు వేచి ఉండటం కంటే, మనం విశ్వసిస్తున్నామని చెప్పుకునే వాటిని నిర్మించడమే దీని అర్థం.

ఇప్పటి వరకు చెప్పినట్లుగా పనిచేసే సంస్థలు, ఒప్పందాలను సృష్టించడమే దీని అర్థం. దీని అర్థం బలవంతం చేయడానికి వీలు కల్పించే పరపతిని తగ్గించడం. అంటే బలమైన దేశీయ ఆర్థిక వ్యవస్థను నిర్మించడం. ఇది ప్రతి ప్రభుత్వం తక్షణ ప్రాధాన్యతగా ఉండాలి.

అంతర్జాతీయంగా వైవిధ్యీకరణ అనేది కేవలం ఆర్థిక వివేకం మాత్రమే కాదు, నిజాయితీగల విదేశాంగ విధానానికి ఇది ఒక భౌతిక పునాది. ఎందుకంటే దేశాలు ప్రతీకార దాడులకు గురయ్యే అవకాశాన్ని తగ్గించడం ద్వారా సూత్రప్రాయమైన స్థానాలకు హక్కును సంపాదిస్తాయి.

పాత వ్యవస్థ తిరిగి రాదని మాకు తెలుసు. పాత వ్యామోహం ఒక వ్యూహం కాదు. దాని గురించి మనం ఏడ్చుకుంటూ కూర్చోవద్దు. కానీ ఛిద్రమవడం నుండి, మనం పెద్ద, మెరుగైన, బలమైన, మరింత న్యాయమైనదాన్ని నిర్మించగలమని మేము విశ్వసిస్తున్నాము. ఇది మధ్య స్థాయి శక్తుల పని. ఎందుకుంటే అవే దుర్గాల ప్రపంచం నుండి ఎక్కువగా కోల్పోయే దేశాలు, నిజమైన సహకారం నుండి ఎక్కువగా లబ్ది పొందే దేశాలు.

బలవంతులకు వారి శక్తి ఉంటుంది. కానీ మనకు కూడా ఏదో ఉంది. అది నటించడం మానేయడం, వాస్తవికతను పేర్కొనడం, ఇంట్లో మన బలాన్ని పెంచుకోవడం, కలిసి పనిచేయడం. అదే కెనడా మార్గం. మేము దానిని బహిరంగంగా, ఆత్మవిశ్వాసంతో ఎంచుకుంటాం. దానిని మాతో తీసుకెళ్లడానికి సిద్ధంగా ఉన్న ఏ దేశానికైనా మార్గం తెరిచి ఉంటుంది.

*ధన్యవాదాలు...*

లేఖ

## ఇంటింటి సమస్య 'ఇఎంఐ'

మనిషి జీవితం పూర్వమే బాగుండేదేమో టెక్నాలజీ పెరుగుతుందని సంతోషపడాలో లేక, మనుషుల పతనం మొదలైందని బాధపడాలో అర్థం కావడం లేదు. పూర్వం ఒక వస్తువుని కొనాలంటే డబ్బు ఉంటే కొనేవాళ్ళు లేదంటే వస్తువు మార్పిడి చేసుకునే వారు, ఆ రోజుల్లో మనుషులు ఒక ప్రశాంతమైన జీవితాన్ని గడిపేవారు. కానీ ప్రస్తుతం ఏదైనా ఒక వస్తువుని కొని ఆ వస్తువుకి ప్రతి నెల 'ఇఎంఐ' అంటూ తల పట్టుకుంటున్నారు. దానికి తోడు సోషల్ మీడియాలో కనిపించే ప్రతిదీ చేయాలనుకుంటారు అందులో ఎంత నిజం ఎంత అబద్ధం ఉందో గమనించలేని పరిస్థితిలో ఉన్నాం. మనం బ్రతకాలి అంటే కొన్ని వస్తువుల మీద ఆధారపడి ఉంటాం. ఆ వస్తువులు మనకు అవసరం ఉండొచ్చు అవసరం ఉండకపోవచ్చు, కొన్ని మనం బ్రతకడానికి కొనుక్కుంటాం మరికొన్ని మన స్థాయిని చూపించుకోడానికి కొంటుంటాం. దాన్నీ చూపించే క్రమంలో మనిషి సగం జీవితం ఇఎంఐ లోనే బ్రతుకుతున్నారు. మారుతున్న కాలంతో పాటు ఈ సమాజంలో సోషల్ మీడియా కూడా పెరుగుతూ వచ్చింది. ఫోన్ చేతిలో ఉన్న ప్రతి ఒక్కరూ తన సెల్ ఫోన్‌లో ఏదో ఒక వీడియో చూసి ప్రభావితం అవుతూ ఉంటారు. అందులో జీవితాన్ని మార్చుకునే వారు కొందరు ఉంటే, మరి కొంతమంది లగ్జరీ జీవితాన్ని గడపాలని ఉంటారు. ఒకప్పుడు మన చేతిలో డబ్బు ఉంటేనే ఒక వస్తువుని కొనడానికి ఆశక్తి చూపించే వారు. ఇప్పుడు కాలం మారిపోయింది...చేతిలో డబ్బు ఉన్న లేకపోయినా ఇఎంఐల ద్వారా మనిషికి ఇష్టమైన వస్తువుని కొనుగోలు చేసే అవకాశం కల్పించారు. ఈ ఇఎంఐ ల వల్ల మనిషి తన జీవితంలో సగం ప్రశాంతత కోల్పోతుంటాడు.

**పక్కవారితో పోలిక :** యుక్త వయసు గల వారు ఇలాంటి వాటికి చాలా త్వరగా ఆకర్షించబడతారు. మన చుట్టు ఉన్న వారు ఒక వస్తువు కొంటే ఆ వస్తువు మనకు కొనాలి అనిపిస్తుంది. యువకులు తన స్నేహితులు ఏది కొనుకున్నా ఒక్క క్షణం కూడా ఆలోచించకుండా ఆ వస్తువుని కొనుకోవాలి అనుకుంటారు ఆ వస్తువు విలువ గురించి, ఇంట్లో స్థితి గతు గురించి, ఆలోచించరు. ఎలాగో మనకి ఇఎంఐ ద్వారా తీసుకునే అవకాశం ఉంది కాబట్టి ఎంతో కొంత డబ్బు కట్టి ఆ వస్తువుని కొంటారు. ఈ ఇఎంఐ లోనైనా 50 శాతం లేదా 60 శాతం కూడా నగదు చేతికి ఇవ్వకుండా 10 శాతం 20 శాతం నగదు కట్టి మిగతా మొత్తం ఇఎంఐ లోనే. నగదు చెల్లించడం వల్ల వడ్డీ రేట్లు ఎక్కువ అవుతుంది. ఒక 60, 70 శాతం నగదు చెల్లించడం ద్వారా వడ్డీ రేట్ల నుంచి కొంత తప్పించుకోవచ్చు. ఈ సమాజంలో చాలా మంది వ్యక్తులు ఎదుటి వారికి ఉంది నాకు లేదు అనే భావనతోనే ఎంత విలువ



చేసే వస్తువునైనా ఇఎంఐల ద్వారా సులభంగా కొంటున్నారు.

**నియంత్రించే విషయాలు :** మనిషికి చూసిన వస్తువుని కొనాలనిపించడం సర్వసాధారణం. ఒక వస్తువుని కొనేముందు వారం రోజులు దాని గురించి ఆలోచించండి. ఈ వారం రోజులు ఆ వస్తువుని కొనాలి అనిపిస్తే అప్పుడు కొనండి? ఈ వారం రోజులు ఆలోచించడం వల్ల మీకు ఆ వస్తువుని కొనాలని ఆశ సచిపోవచ్చు. యుక్త వయసులో ఉన్న వారికి వీటిపై అవగాహన లేక లోన్‌లు తీసుకోవడం, ఐఎంఐ ద్వారా తనకి నచ్చిన వస్తువుని తీసుకొని ఇఎంఐ ని కట్టలేక తరువాత ఇబ్బంది పడుతుంటారు. మన స్థాయికి మించి, మన సంపాదనను మించి, వస్తువులు కొనేముందు ఒక్కసారి ఆలోచించండి.

మనం ఒక వస్తువుని కొన్నప్పుడు మనం కట్టే ఇఎంఐ మన సంపాదన కంటే తక్కువ ఉండేలా చూసుకోవాలి ఒక వస్తువుని ఇఎంఐ ల ద్వారా కొనేముందు, ఇఎంఐ ల పట్ల ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉంటే, అప్పుల బాధ నుంచి తప్పించుకున్నవారు అవుతారు.

**గణేష్,** భద్రాద్రి కొత్తగూడెం

# చర్లపల్లి టెర్మినల్ తనిఖీ చేసిన ఎస్‌సి రైల్వే జిఎం

### కొత్త రన్నింగ్ రూమ్, క్రూ బుకింగ్ లాబీ ప్రారంభం




**ప్రజాపక్షం/హైదరాబాద్:** దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ శుక్రవారం సికింద్రాబాద్ డివిజన్ పరిధిలోని చర్లపల్లి రైల్వే స్టేషన్‌ను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కొత్తగా నిర్మించిన రన్నింగ్ రూమ్‌తో పాటు క్రూ బుకింగ్ లాబీని ఆయన ప్రారంభించారు. తనిఖీలో సికింద్రాబాద్ డివిజనల్ రైల్వే మేనేజర్ డాక్టర్ ఆర్. గోపాలకృష్ణన్‌తో పాటు పలువురు సీనియర్ అధికారులు పాల్గొన్నారు. హైదరాబాద్ జంట నగరాల్లో రైలు రద్దీని తగ్గించడంతో పాటు ప్రయాణీకులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలనే లక్ష్యంతో, చర్లపల్లి స్టేషన్‌ను రూ.413 కోట్ల వ్యయంతో అత్యాధునిక టెర్మినల్ స్టేషన్‌గా అభివృద్ధి చేశారు. సికింద్రాబాద్, హైదరాబాద్, కాచిగూడ స్టేషన్లపై ఒత్తిడి తగ్గించేందుకు పలు రైళ్లను చర్లపల్లి టెర్మినల్ నుంచి నడిపేలా ఏర్పాట్లు చేశారు.

**రైలు సిబ్బందికి ఆధునిక వసతులు..**

లోకో పైలట్లు, అసిస్టెంట్ లోకో పైలట్లు, ట్రైన్ మేనేజర్లు తదితర రైలు నడిపే సిబ్బందికి అవసరమైన వసతుల కల్పనలో భాగంగా చర్లపల్లి టెర్మినల్‌లో కొత్త రన్నింగ్ రూమ్, క్రూ లాబీని ఏర్పాటు చేశారు. రన్నింగ్ రూమ్‌లో కంప్యూటరైజ్డ్ బెడ్ ఆక్యుపేషన్ సిస్టమ్, మహిళా సిబ్బందికి ప్రత్యేక వసతి, ఎయిర్ కండిషనింగ్, యోగా–ధ్యానం గదులు, మాడ్యులర్ కిచెన్, ఆర్‌ఓ ప్లాంట్లు, సిసిటివి నిఘా వంటి సౌకర్యాలను జనరల్ మేనేజర్ పరిశీలించారు. క్రూ లాబీలోని క్రూ మేనేజ్‌మెంట్ సిస్టమ్, వంటగది, సీటింగ్ ఏర్పాట్లను కూడా సమీక్షించారు.

**ఐఒహెచ్ షెడ్ పరిశీలన**

అనంతరం చర్లపల్లి స్టేషన్‌లోని ఐఒహెచ్ (ఇంటర్మీడియట్ ఓవరహాలింగ్) షెడ్‌ను జిఎం తనిఖీ చేశారు. కోచ్ నిర్వహణ సౌకర్యాలపై అధికారులతో సమీక్ష నిర్వహించడంతో పాటు భవిష్యత్ అభివృద్ధి ప్రణాళికలపై చర్చించారు. షెడ్‌లో నిలిపి ఉన్న అమృత్ భారత్ రైలు రేక్‌ను పరిశీలించి, కోచ్‌లలో అందించిన ఆధునిక సదుపాయాలను సమీక్షించారు.

చర్లపల్లి టెర్మినల్‌లోని ప్లాట్‌ఫామ్ నంబర్–1 వద్ద ప్రతిపాదిత కొత్త ఎంట్రీ అలైన్‌మెంట్, అప్రోచ్ మార్గాన్ని పరిశీలించిన జిఎం, సుస్థిరత మరియు పర్యావరణ పరిరక్షణకు నిదర్శనంగా రన్నింగ్ రూమ్ వద్ద మొక్కలు నాటారు.

## ఎన్నికల నిర్వహణాధికారులకు శిక్షణ




**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** పురపాలక సంఘ ఎన్నికల నిర్వహణలో భాగంగా మేడ్చల్ జిల్లాలో మూడు మున్సిపాలిటీలకు సంబంధించి ఎన్నికల నిర్వహణాధికారులకు శుక్రవారం జిల్లా కలెక్టరేట్‌లో శిక్షణా కార్యక్రమం జరిగింది. మాస్టర్ ట్రైనర్లు మురళి, వేణులు ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు మొదటి స్థాయి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో ఎన్నికలకు ఉపయోగించే సామగ్రి సేకరణ, ఎన్నికలు జరిగే సమయంలో, పోలింగ్ ముగిసిన తర్వాత తీసుకోవాల్సిన జాగ్రత్తలకు సంబంధించిన అంశాలు, ప్రతి పోలింగ్ స్టేషన్‌లో వెబ్ కాస్టింగ్, ఏర్పాట్ల గురించి సవివరంగా తెలియచేసారు. ఎన్నికల్లో ప్రతి ఓటు కీలకమని, పోలింగ్ విధుల్లో పాల్గొనే ఉద్యోగులు తమ ఓటు హక్కు ఫారం 12 వినియోగించుకోవాలని ఈ శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రైనింగ్ నిర్వహణ నోడల్ అధికారి విజయ కుమారి, బ్యాలెట్ బాక్స్ నిర్వహణ నోడల్ అధికారి సాంబశివరావు, పోస్టల్ బ్యాలెట్ పేపర్ నోడల్ అధికారి ఝాన్సీ రాణి, తదితరులు పాల్గొన్నారు.





## మూడు మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తాం

### డిసిసి అధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** రానున్న మున్సిపల్ ఎన్నికల్లో అన్ని వార్డులను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంటుందని మేడ్చల్ జిల్లా డిసిసి అధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్ అన్నారు. శుక్రవారం అలియాబాద్‌లోని లాల్‌గడిమలక్‌పేటలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని డిసిసి అధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్, మాజి ఎమ్మెల్యే మలిపెద్ది సుదీర్‌రెడ్డి, మాజి డిసిసి అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి, నక్క ప్రభాకర్‌గౌడ్‌లు ప్రారంభించారు. అనంతరం డిసిసి అధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్ సమక్షంలో బిఆర్‌ఎస్ నుంచి శ్రీకాంత్‌గౌడ్ కాంగ్రెస్ పార్టీ లో చేరారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌గౌడ్‌కు పార్టీ కండవా కప్పి సాదరం గా ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ మున్సిపాలిటిల్లో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పలు అభివృద్ధి సంక్షేమ పథకాలే అభ్యర్థులను గెలిపిస్తాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కీసర అంజిరెడ్డి, టిపిసిసి ప్రధాన కార్యదర్శి మహిపాల్‌రెడ్డి, రాష్ట్ర హాజ్ కమిటి మెంబర్ మహ్మద్ ముజుబుద్దీన్, మాజీ మేయర్ తోటకూర అజయ్‌యాదవ్, ఎ బ్లాక్ అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి, మున్సిపాలిటి అధ్యక్షులు తుంకి రమేష్, కమఠం కృష్ణారెడ్డి, మాజీ ఎంపిటిసిలు అశోక్‌రెడ్డి, డప్పు సాయిబాబు, మాజీ సర్పంచ్‌లు,తదితరులు పాల్గొన్నారు.



## స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ సెంటర్ల వద్ద నిరంతర పర్యవేక్షణ

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** పురపాలక సంఘ ఎన్నికల్లో భాగంగా మేడ్చల్ జిల్లా పరిశీలకులు కొర్ర లక్ష్మి శుక్రవారం జిల్లాలోని మూడు మున్సిపాలిటీలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంలు, కౌంటింగ్ సెంటర్లను జిల్లా కలెక్టర్ మనుచౌదరి, అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డిలతో కల్సి పరిశీలించారు. ఎన్నికల కమిషన్ నియమావళి ప్రకారం అవసరమైన స్ట్రాంగ్ రూంలు, కౌంటింగ్ సెంటర్లను ఏర్పాటు చేయాలని ఎన్నికల పరిశీలకులు కొర్ర లక్ష్మి ఆదేశించారు. అనంతరం ఆమె సిబ్బందితో మాట్లాడుతూ స్ట్రాంగ్ రూంల వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలతో పాటు కౌంటింగ్ సెంటర్లలో కౌంటింగ్ టెంటింగ్ విషయమై పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. దీంతోపాటు సెంటర్లు, పోలింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూంల వద్ద తగిన సంఖ్యలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయటంతో పాటు నిరంతర పర్యవేక్షణలో ఎలాంటి లోపాలకు తావివ్వద్దన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, ఎన్నికల నోడల్ అధికారులు సాంబశివరావు, తదితరులు పాల్గొన్నారు.

## చివరి రోజు భారీ నామినేషన్లు



**ప్రజాపక్షం/వికారాబాద్ :** చివరి రోజు భారీ నామినేషన్లు వివిధ పార్టీకి చెందిన అభ్యర్థులు నామినేషన్లు సమర్పించారు. అధికార పార్టీనుండి 17వ వార్డు నుండి పట్టణ అధ్యక్షులు సుధాకర్‌రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ చిగుళ్లపల్లి రమేష్, లక్ష్మి కాంత్ రెడ్డి, అనన్య, తదితరులు నామినేషన్లు సమర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వికారాబాద్ మున్సిపల్ పై కాంగ్రెస్ జెండా ఎగురవేయడం జరుగుతుందని అన్నారు. స్పీకర్ గతంలో మంత్రిగా ఉన్నప్పుడు చేసిన అభివృద్ధే వికారాబాద్ మున్సిపల్ కన్పిస్తుంది అని అన్నారు. కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థులను గెలిపిస్తే వికారాబాద్ అన్ని రకాలుగా అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస ముదిరాజ్, పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సభ ఏర్పాటుకు స్థల పరిశీలన

### ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి




**ప్రజాపక్షం/పరిగి :** ముఖ్యమంత్రి సభ ఏర్పాటు కోసం స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి... ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫిబ్రవరి 7వ తేదీన మున్సిపల్ ఎన్నికల సభకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాక సందర్భంగా ఏర్పాట్లు, స్థలం పరిశీలించారు. పరిగి మండల పరిధిలోని రూఫ్‌ఖాన్‌పేట్, నారాయణపూర్ పరిధిలో సభా స్థలాన్ని పరిశీలించడం జరిగిందన్నారు. సభకు భారీగా జనసమీకరణ, వాహన పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ, భద్రత తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల పార్లమెంటు పరిధిలోని అన్ని నియోజకవర్గాల నాయకులు, కార్యకర్తలు పాల్గొంటారని తెలిపారు. ముఖ్యమంత్రి రాకతో పార్లమెంట్ పరిధిలోని అన్ని మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేయడం ఖాయమన్నారు. డిఎస్‌పి శ్రీనివాస్‌రెడ్డి, సిఐ శ్రీనివాస్, విద్యుత్ అధికారులు పాల్గొన్నారు.

## మహాత్మాగాంధీ వర్ధంతి : పలువురు నివాళులు


తెలంగాణ భవన్ రాష్ట్ర కార్యాలయంలో


జగద్గిరిగుట్ట డివిజన్‌లో


ఘట్‌కేసర్‌లో


మల్కాజిగిరి లో


దేవరయాంజాల్‌లో


కూకట్‌పల్లి



## సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

**ప్రజాపక్షం/దుండిగల్ :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 294 డివిజన్ బహదూర్ పల్లి జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలను గణతంత్ర దినోత్సవం రోజున సందర్శించిన బికెఆర్ ట్రస్ట్ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు బొంగునూరి కిషోర్ రెడ్డి అక్కడ ఉన్నటువంటి ప్రధాన సమస్యలు ప్రధానోపాధ్యాయులు కిషోర్ రెడ్డికు తెలియజేయడంజరిగింది. ముఖ్యంగా విద్యార్థులకు గ్రౌండ్ పూర్తిగా గుంతలమయమై మురికి నీటితో విద్యార్థులు పడుతున్న ఇబ్బందులకు వెంటనే స్పందించి 40 ట్రిప్పుల మొరం మట్టిని పంపి ఉదయాన్నే స్కూల్ గ్రౌండ్‌కి చేరుకొని జెసిపి డోజర్లతో లెవెల్ చేయించి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకువచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఇక్కడున్నటువంటి విద్యార్థులకు ఎలాంటి సమస్య ఉన్న అందుబాటులో ఉంటానని టాయిలెట్స్, అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తానని ఉపాధ్యాయులకు విద్యార్థులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సాదు యాదవ్, మాజీ సర్పంచ్ కావలి గణేష్ పిట్ల శ్రీనివాస్, ప్రవీణ్ ముదిరాజ్, వేణు కుమార్, రచ్చ నాయక్, శ్రీనివాస్ చారి, హైమద్ భాయ్ సభ్యులు పాల్గొన్నారు.



## మౌలిక వసతుల కల్పనకు పాటుపడుతా

**ప్రజాపక్షం/కూకట్‌పల్లి :** ప్రజా అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు కెపిహెచ్‌బి డివిజన్ కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు పేర్కొన్నారు. శుక్రవారం కెపిహెచ్‌బి డివిజన్ పరిధిలోని 3వ ఫేజ్‌లోని భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ భవనానికి సంబంధించిన రెండవ అంతస్తు నిర్మాణం కోసం శంకుస్థాపన చేశారు. అనంతరం 6వ ఫేస్‌లోని డా.బిఆర్ అంబేద్కర్ పార్క్ అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం చేశారు. తదుపరి గోపాల్ నగర్ 2ఏ ప్రాంతంలో రోడ్డు పనులను ప్రారంభించడంతో పాటు, హిందూ స్మశాన వాటికలో బోర్వెల్ పనులను కూడా ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ గత పదేళ్ల కాలంలో కెపిహెచ్‌బి డివిజన్‌ను అభివృద్ధి పథంలో నడిపించేందుకు నిరంతరం కృషి చేశామని తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు చొరవతో డివిజన్ దాదాపు 80శాతం అభివృద్ధి పనులు పూర్తయ్యాయని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అప్పట్లో ప్రారంభించిన పనులకు కూడా కొనసాగించడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అభివృద్ధికి ఆటంకాలు కలిగించకుండా ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో కాంగ్రెస్ ప్రభుత్వం బాధ్యతగా వ్యవహరించాని కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు కృష్ణారెడ్డి, అధికారులు ఎఇ శ్రావణి, రాజీవ్, బిఆర్‌ఎస్ నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు, వివిధ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.



## సిసి రోడ్డు పనులు ప్రారంభం

**ప్రజాపక్షం/మల్కాజిగిరి:** కాకతీయనగర్ గౌరీ శంకర్ అపార్ట్‌మెంట్ నుండి లిటిల్ పవర్ల్స్ హైస్కూల్ వరకు రూ.48 లక్షల వ్యయంతో చేపట్టిన సిసి రోడ్డు పనులను వినాయకనగర్ కార్పొరేటర్ కాస్యం రాజ్యలక్ష్మి శుక్రవారం ప్రారంభించారు. దీనివల్ల నేరేడ్‌మెట్ నుండి వాయుపురి మార్గంలో పయనించే వారికి సౌకర్యం ఏర్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి శ్రేణులు ఓం ప్రకాష్, మల్లేష్ యాదవ్, విజయలక్ష్మి, జయమ్మ, బస్తీ, కాలనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## మూడు నెలల్లో బ్రిడ్జి నిర్మాణం పూర్తిచేసి ఇస్తా : కాంట్రాక్టర్ సత్తిరెడ్డి

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** రైల్వే వంతెన నిర్మాణం పనులు ఎన్నో సంవత్సరాల నుండి పొడిగిస్తూ ఇప్పటివరకు పూర్తికాక ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని కాంట్రాక్టర్ సత్తిరెడ్డి తెలిపారు. మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కాంట్రాక్టర్ సత్తిరెడ్డి, రోడ్డు భవనాలశాఖ ఎఇ సింధు ప్రియలు పాల్గొన్నారు. సమావేశంలో సత్తిరెడ్డిని, ఏఈ సింధుప్రియను ప్రజలు ఎన్ని రోజుల్లో బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తి చేస్తారని అడుగగా కాంట్రాక్టర్ మూడు నాలుగు నెలల్లో పూర్తిచేసి ప్రజలకు అందుబాటులో ఉంచే విధంగా చూస్తానని హామీ ఇవ్వడంతో పావనిజంగయ్యాయాదవ్ సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ముల్లి పావనిజంగయ్య యాదవ్ డిసిసి అధ్యక్షులు మేడ్చల్ నియోజకవర్గం ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే మల్లిపెద్ది సుధీర్ రెడ్డి దగ్గరికి కాంట్రాక్టర్‌ని తీసుకుపోగా వారు స్పందించి ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్కగారిని కలిసి నిధుల విషయంపై చర్చిస్తామని తెలిపారు. పావని జంగయ్య యాదవ్ మాట్లాడుతూ గత 5 సంవత్సరాలనుండి ఘట్‌కేసర్ మున్సిపల్ చైర్‌పర్సన్‌గా నాకు బాధ్యతలు అందించిన ప్రజలకు పాలక వర్గం సభ్యులతో కలిసి అనేక అభివృద్ధి డ్రైనేజీ, బిటి రోడ్లు, సిసి రోడ్లు మరుగుదొడ్లు, పార్కులు, వైకుంఠధామాలు, అనేక అభివృద్ధి పనులు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమానికి మాజీ సహకార బ్యాంక్ డైరెక్టర్ బొక్క ప్రభాకర్ రెడ్డి, కడుపోల్ల మల్లేష్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



## అక్రమ సంబంధమే మృతికి కారణం

**ప్రజాపక్షం /మర్పల్లి :** వికారాబాద్ నియోజకవర్గంలోని మర్పల్లి మండల పరిధిలోని బిల్కల్ గ్రామంలో చేరాల నర్సింలు శక్రవారం అనుమానాస్పదంగా మృతి చెందిన సంఘటన జరిగింది. మృతుని భార్య వసంత తన భర్తను అక్రమ సంబందం కారణంగానే హత్య చేసి ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేస్తు బ్యాగరి నర్సమ్మ, పాపయ్యలు కారణమై ఉండవచ్చని ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.




## ప్రశాంతంగా బార్ అసోసియేషన్ ఎన్నికలు

**ప్రజాపక్షం/చర్లపల్లి:** బార్ అసోసియేషన్ ఎన్నికలు మేడ్చల్ మల్కాజ్‌గిరి శుక్రవారం కోర్టు ఆవరణలో ప్రశాంతంగా జరిగాయి. కోర్టు అవరణలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లో 89 శాతం పోలుకాగా 950 ఓట్లకు గాను 848 మంది న్యాయవాదులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని మేడ్చల్ బార్ అసోసియేషన్ ఎలక్షన్ ఆఫీసర్ ఎన్. అమరేందర్‌రెడ్డి తెలిపారు.

## అలియాబాద్‌లో 144, మూడుచింతలపల్లిలో 175



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** అలియాబాద్, మూడుచింతలపల్లి మున్సిపల్‌లో మున్సిపల్ ఎన్నికల నామినేషన్‌లు పర్వం శుక్రవారంతో ముగిసింది. గత మూడు రోజులుగా వివిధ రాజకీయ పార్టీల అభ్యర్థులు, స్వతంత్ర అభ్యర్థులు తమ నామినేషన్ పత్రాలను నామి నేషన్ కేంద్రాల్లో దాఖలు చేశారు. కాగా మూడవరోజు నామినేషన్‌ల పర్వం ముగియడంతో అభ్యర్థులు పెద్ద ఎత్తున నామినేషన్ కేంద్రాలకు చేరుకుని తమ నామినేషన్‌లను ఎన్ని కల అధికారులకు దాఖలు చేశారు. అలియాబాద్ మున్సిపాలిటీలో 20 వార్డులకు గాను 28వ తేది నుంచి 30వ తేది వరకు మూడు రోజుల్లో జరిగిన నామినేషన్ల ప్రక్రియలో బాగంగా మొత్తం 94 మంది అభ్యర్థులు మొత్తం 144 నామినేషన్లను దాఖలు చేశారు. కాంగ్రెస్ 47, బిఆర్‌ఎస్ 38, బిజెపి 31, సిపిఎం 2, జనసేనా 8, ఎ ఐ ఎఫ్ బి 2, బిఎస్‌పి 4, ఇతరులు 12 నామినేషన్లు దాఖలు చేశారని అలియాబాద్ మున్సిపల్ అసిస్టెంట్ ఎన్నికల అధికారి చంద్రశేఖర్ తెలిపారు. మూడుచింతలపల్లిలో 24 వార్డులకు గాను 116 మంది అభ్యర్థులు మొత్తం మూడు రోజులకు గాను 175 నామినేషన్‌లు దాఖలు చేశారు. పార్టీల వారిగా బిఎస్‌పి 2, బిజెపి 41, కాంగ్రెస్ 57, బిఆర్‌ఎస్ 53, జనసేన 2, ఇతరులు 4, స్వతంత్ర అభ్యర్థులు 18, మొత్తం 175 నామినేషన్‌లు దాఖలు అయ్యాయని మున్సిపల్ అసిస్టెంట్ ఎన్నికల అధికారి పవన్‌కుమార్ తెలిపారు.


## మీడియా సెంటర్ ప్రారంభం



**ప్రజాపక్షం/వికారాబాద్ :** 2వ సాధారణ మున్సిపల్ ఎన్నికల సందర్భంగా ఎన్నికల వార్తలపై ప్రత్యేక నిఘా ఉంచాలని, మీడియా సెంటర్‌ను ప్రారంభించిన జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ తెలిపారు. మున్సిపల్ ఎన్నికల నేపధ్యంలో ప్రిం ట్, ఎలక్ట్రానిక్ మీడియా వచ్చే సామాజిక మధ్యమాల్లో వచ్చే రాజకీయ వార్తలపై పటిష్టమై న నిఘా ఉంచాలని ఆదేశించారు. దినపత్రికలు, స్థానిక ఛానళ్లలో వచ్చే వార్తలను నిశితంగా గమనించాలని ఎన్నికల నియమావళికి విరుద్ధంగా ఉండే అంశాలపై వెంటనే గుర్తించాలని సూచించారు. అనుమానిత పెయిడ్ న్యూస్‌పై ప్రత్యేక దృష్టి సారించి వివరాలు, ప్రకటనలపై ఎప్పటికప్పుడు రిజిస్టర్లలో నమోదు చేయాలన్నారు. అప్రమత్తంగా ఉండాలన్నారు. అన్ని రకాల రిజిస్ట్రేషన్ నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు రాజేశ్వరి, సుధీర్, ఆర్‌డిఒ వాసుచంద్ర, డిపిఆర్‌ఒ చెన్నమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## దోపిడీ దొంగల బీభత్సం

### 20 తులాల బంగారం, రూ. లక్ష నగదు చోరీ



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** ఓ ఇంట్లో గుర్తు తెలియని దుండగులు చొరబడి నగలు, నగదు ఎత్తుకెళ్లిన సంఘటన శామీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని బొమ్మరాశిపేటలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన కథనం ప్రకారం.. శామీర్‌పేట డివిజన్ బొమ్మరాశిపేటకు చెందిన కోక రమేష్ తన ఇంటి పక్కన కూల్‌డ్రింక్స్ షాపు పెట్టుకుని అమ్ముతున్నాడు. ఈ క్రమంలో గురువారం సాయంత్రం భోజనం చేసుకుని కూల్ డ్రింకులు అమ్మడానికి డబ్బా వద్దకు వెళ్లాడు. కాగా రాత్రి ఇంటికి వచ్చి చూసే సరికి ఇంటి తాళం, బీరువా తాళం పగులగొట్టి బట్టలు చిందర వందరగా పడి ఉండటం రమేష్ గమనించాడు. బీరువాలో చూసేసరికి అందులో ఉన్న సుమారు 20 తులాల బంగారం, రూ.1 లక్ష నగదు కనిపించలేదు. ఇట్టి విషయాన్ని నగరంలో ఉన్న తన కొడుకు నాగేశ్వర్‌రావుకు సమాచారం ఇవ్వగా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు క్లూస్‌టీమ్, డాగ్ స్క్వాడ్‌లతో పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

## కేంద్రం నిధులతోనే పట్టణాలు అభివృద్ధి

**ప్రజాపక్షం/వికారాబాద్:** కేంద్రం నిధులతోనే పట్టణాలు అభివృద్ధి చెందుతున్నాయని ఎంపి కొండ విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. వికారాబాద్ మున్సిపల్ ఎన్నికల సందర్భంగా అభ్యర్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపి మాట్లాడుతూ బిజెపితోనే పట్టణాల అభివృద్ధి జరుగుతుందన్నారు. వికారాబాద్ జిల్లాలోని మున్సిపల్‌లో పోటీచేసిన బిజెపి అభ్యర్థులను గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో వడ్ల నందు, నాయకులు కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు

## సామాజిక మాధ్యమాలపై ప్రత్యేక నిఘా : ఎస్‌పి స్నేహమెహ్రా

**ప్రజాపక్షం /వికారాబాద్ :** మున్సిపల్ ఎన్నికల వేళ సమాజిక మాద్యమాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా ఎస్‌పి స్నేహమెహ్రా తెలిపా రు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ వికారాబాద్ జిల్లాలో జరుగనున్న నాలుగు మున్సిపాటీల ఎన్నికలను స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించేందుకు జిల్లా పోలీస్ యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు. ఎన్నికల సమయం లో తప్పుడు ప్రచారం, అవాస్తవ వార్తల వ్యాప్తిని అరికట్టేందుకు సామాజిక మాద్యమాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు ఎస్‌పి తెలిపారు. ఎన్నికలను విజయవంతం చేయడంలో ప్రతి పౌరుడు కీలకమని అన్నారు. ముఖ్యంగా యువత సోషల్ మీడియా గ్రూపులలో అత్యంత బాధ్యతగా వ్యవహరించాలని తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు, అభ్యర్థులు పోలీస్ యంత్రాంగానికి పూర్తి సహకారం అందిస్తు ఎన్నికలు ప్రశాంతంగా జరిగుటకు సహకరించాలని అన్నారు.

## వనస్థలిపురం కాంప్లెక్స్‌లో ట్రాఫిక్ సమస్యలు పరిష్కరించండి



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్:** వనస్థలిపురం కాంప్లెక్స్ సెంటర్ వ్యాపార సముదాయాలు అధికంగా ఉండడంతో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉందని స్థానిక కాలనీ ప్రజలు ఎంఎల్‌ఎ దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిని శుక్రవారం క్యాంపు కార్యాలయంలో స్థానిక మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్‌రెడ్డి, బిఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షులు చింతల రవికుమార్ గుప్తాలతో కలిసి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ ట్రాఫిక్ ఎసిపి నవీన్‌రెడ్డితో ఫోన్‌లో మాట్లాడి సమస్యను పరిష్కారం చూపాలని కోరారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు సంజీవ్ రావు, విట్ట దుర్గయ్య, నయిమ్, జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, గోవర్ధన్, లక్ష్మ ణ్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

## డివిజన్ అభివృద్ధికి నిధులు మంజూరు

కార్పొరేటర్ సుజాత నాయక్ వెల్లడి



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్:** హస్తినాపురం డివిజన్ అభివృద్ధి కోసం తొమ్మిదిన్నర కోట్లు మంజూరైనట్లు జిహెచ్‌ఎంసి స్టాండింగ్ కమిటీ మెంబర్, స్థానిక కార్పొరేటర్ బానోతు సుజాత నాయక్ తెలిపారు. జిహెచ్‌ఎంసి కౌన్సిల్‌లో ఇటీవల మరణించిన చంపాపేట్ కార్పొరేటర్ వంగ మధుసూదన్‌రెడ్డి పేరును బైరమల్‌గూడా ఫ్లైఓవర్‌కు నామకరణం చేయాలని జిహెచ్‌ఎంసి మేయర్, కమిషనర్‌కు స్థానిక కార్పొరేటర్లు బానోతు సుజాత నాయక్, ధర్పల్లి రాజశేఖర్‌రెడ్డి, సిఎన్‌రెడ్డి, కొప్పుల నర్సింహ్మారెడ్డి, లచ్చిరెడ్డి వినతి పత్రం అందచేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## దైవచింతనతో మానసిక ప్రశాంతత



**ప్రజాపక్షం/తుర్కయంజాల్:** దైవ చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎంపి ఈటల రాజేందర్, రోడ్డు రోడ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మాల్‌రెడ్డి రాంరెడ్డి అన్నారు. శుక్రవారం ఆదిబట్ల సర్కిల్ రాగన్నగూడలో జరుగుతున్న మహారుద్ర సహిత సహస్ర చండీ యాగంలో ఈటల రాజేందర్, మల్‌రెడ్డి రామ్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కొషికే ఐలయ్య, ఎలిమినేటి నరసింహారెడ్డి, కొంతం వెంకట్ రెడ్డి, సామ భీంరెడ్డి, కొత్త కుర్మ శివకుమార్ పాల్గొన్నారు.

## ముగిసిన నామినేషన్ల ఘట్టం



**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** మున్సిపల్ ఎన్నికల్లో శుక్రవారం చివరి రోజు కావడంతో పెద్దఎత్తున అధికార కాంగ్రెస్ పార్టీతో పాటు ప్రతిపక్ష బిఆర్‌ఎస్, బిజెపి, బిఎస్పీ నుండి అభ్యర్థులు తమ నామినేషన్లు దాఖలు చేశారు. 14వ వార్డు నుండి కాంగ్రెస్ అభ్యర్థి అందె మోహన్ ముదిరాజ్, 18వ వార్డు నుండి కాంగ్రెస్ అభ్యర్థి జమాల్‌పూర్ చందులాల్ నామినేషన్ దాఖలు చేశారు. బిఆర్‌ఎస్ అభ్యర్థులు నేరుగా నామినేషన్లు దాఖలు చేశారు. మున్సిపల్ పరిధిలోని 28 వార్డుల నుండి అన్ని రాజకీయ పార్టీల నేతలు తమ బలాలను నిరూపించుకునే విధంగా ర్యాలీలో వచ్చి నామినేషన్లు వేశారు. ఈనెల 31న మున్సిపల్ పరిధిలోని వివిధ వార్డుల నుండి దాఖలు చేసిన నామినేషన్లను పరిశీలించనున్నట్లు ఎన్నికల అధికారి సునీతారెడ్డి తెలిపారు.

## మెడికల్ కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** మెడికల్ కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యల పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని మెడికల్ కాంట్రాక్ట్ ఉద్యోగులు, కార్మికుల యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు టంగుటూరి నర్సింహ్మారెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం షాద్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో మెడికల్ కాంట్రాక్ట్ ఉద్యోగులు, కార్మికులు రాష్ట్ర 4వ మహాసభ పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో బాలరాజ్, మల్లేష్, యాదమ్మ, కమలమ్మ పాల్గొన్నారు.

## క్రీడల్లో రాణించినప్పడే పేరు ప్రతిష్టలు



**ప్రజాపక్షం/షాబాద్:** విద్యార్థులు చదువులతోపాటు క్రీడల్లో రాణిస్తేనే పేరు ప్రతిష్టలు వస్తాయని రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం షాబాద్ ప్రభుత్వ క్రీడా మైదానంలో వివిధ గ్రామాలకు చెందిన క్రీడాకారులతో ఆటల పోటీలు నిర్వహించారు. క్రీడల్లో గెలుపొందిన జట్లకు బహుమతులు అందంచారు. కార్యక్రమంలో గుడిమల్కాపూర్ మార్కెట్ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్, సర్దార్‌నగర్ మార్కెట్ చైర్మన్ సురేందర్‌రెడ్డి, ఎంపిడిఒ అపర్ణ, లక్ష్మ ణ్‌నాయక్, సర్పంచ్‌లు ప్రభాకర్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, అశోక్, లావణ్య చెన్నయ్య, నవనీత స్వామి, శాంతమ్మ యాదయ్య, క్రీడా నిర్వాహకులు పాల్గొన్నారు.

# ఫైర్ సేఫ్టీపై రెండో రోజూ హైడ్రా తనిఖీలు

జిహెచ్‌ఎంసితో పాటు ఇతర విభాగాలతో సంయుక్తంగా చర్యలు

నిబంధనలు ఉల్లంఘించిన ఆరు ప్రముఖ ఫర్నీచర్ షోరూమ్‌ల సీజ్






**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నగరంలో అగ్ని ప్రమాదాల నివారణే లక్ష్యంగా హైడ్రా తనిఖీలను ఉధృతం చేసింది. శుక్రవారం రెండవ రోజు కూడా జిహెచ్‌ఎంసి, ఫైర్, విద్యుత్ విభాగాలతో కలిసి సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. ఫైర్ నిబంధనలను పూర్తిగా విస్మరించి, షాపులు నిర్వహిస్తున్న నిర్వాహకులపై అధికారులు కఠిన చర్యలు చేపట్టారు. ముఖ్యంగా సెల్లార్లను గోదాములుగా మార్చి ప్రమాదకర వస్తువులు నిల్వ ఉంచడాన్ని అధికారులు తీవ్రంగా పరిగణించారు. కెమికల్స్, పెయింట్ డబ్బాలు, ఫర్నీచర్ తయారీ సామగ్రి, పరుపులు, బ్యాటరీలు వంటి అగ్ని ప్రమాదాలకు ఆస్కారం ఉన్న వస్తువులు భారీగా నిల్వ ఉంచినట్టు గుర్తించారు. పలు భవనాల్లో భవన అనుమతులు, ఫైర్ ఎన్‌ఓసిలు లేకపోవడంతో పాటు, అత్యవసర పరిస్థితుల్లో స్వయంచాలకంగా పని చేసే వాటర్ స్ప్రింక్లర్లు, స్మోక్ డిటెక్టర్లు, ఫైర్ ఎగ్జిట్‌లు అందుబాటులో లేకపోవడాన్ని అధికారులు గుర్తించారు. ఈనేపథ్యంలో నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న 6 ఫర్నీచర్ షాపులను అధికారులు సీజ్ చేశారు. షాపులు ఉన్న భవనాలను గోదాములుగా మార్చరాదని, గోదాములు వేరే చోట ఏర్పాటు చేసుకుని షాపుల్లో ఫర్నీచర్ ప్రదర్శన, అమ్మకాలు మాత్రమే నిర్వహించాలని హైడ్రా అధికారులు స్పష్టం చేశారు. సీజ్ చేసిన షోరూమ్‌ల వద్ద 'ఫైర్ సేఫ్టీ లేని ప్రాంతం' అని సూచించే బోర్డులను అధికారులు ఏర్పాటు చేశారు. భవిష్యత్తులో కూడా నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

### సీజ్ చేసిన షోరూమ్‌ల వివరాలు..

- **లుకింగ్ గుడ్ ఫర్నీచర్ (గచ్చిబౌలి) :** అనుమతులు లేని భవనం, సెల్లార్‌లో ప్రమాదకర నిలువలు ఉండటంతో సీజ్ చేశారు.
- **అను ఫర్నీచర్ (కొంపల్లి క్రాస్ రోడ్స్) :** ఇక్కడ కూడా సెల్లార్ నిబంధనల ఉల్లంఘనను గుర్తించారు.
- **రోయల్ ఓక్ (కూకట్‌పల్లి) :** నిల్వలు ప్రమాదకరంగా ఉండటంతో చర్యలు తీసుకున్నారు.
- **రోయల్ ఓక్ (అత్తాపూర్, పి.వి. ఎక్స్‌ప్రెస్ వే ) :** స్టాక్ నింపేయడంతో సీజ్ చేశారు.
- **బాంటియా ఫర్నీచర్ (ఉప్పల్ – నాగోల్) :** భద్రతా ప్రమాణాలు లేనందున సీజ్ చేశారు.
- **అను ఫర్నీచర్ (నాచారం) :** నిబంధనల ఉల్లంఘన కారణంగా షోరూమ్‌ను సీజ్ చేసి బారికేడ్లు ఏర్పాటు చేశారు.

## స్పర్శలేని మచ్చలపై అశ్రద్ధ వద్దు

డిప్యూటీ డిఎంహెచ్‌ఒ డాక్టర్ పాపారావు



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** స్పర్శ లేని తెల్లని, గోధుమ రంగు మచ్చలు శరీరంపై కనిపిస్తే అశ్రద్ధ చేయకూడదని రంగారెడ్డి జిల్లా అదనపు వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పాపారావు తెలిపారు. శుక్రవారం మహాత్మా గాంధీ వర్ధంతిని పురస్కరించుకొని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మన్సూరబాద్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డాక్టర్ పాపారావు పాల్గొని కుష్ఠు వ్యాధిని గురించి సమగ్రంగా వివరించి, మహాత్మా గాంధీ కుష్ఠువ్యాధి గ్రస్థులకు చేసిన సేవలను కొనియాడారు. జనవరి 30 నుండి ఫిబ్రవరి 13 వరకు జిల్లా వ్యాప్తంగా జాతీయ కుష్ఠు వ్యాధి అవగాహనా సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. ప్రాథమిక దశలో వ్యాధిని గుర్తిస్తే పూర్తి చికిత్స సాధ్యం అవుతుందని వివరించారు. అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స ఉచితంగా లభిస్తుందని తెలిపారు. వ్యాధి లక్షణాలు అయిన స్పర్శ లేని తెల్లని, గోధుమ రంగు మచ్చలు శరీరంపై కనిపిస్తే అశ్రద్ధ చేయకుండా వెంటనే ఆసుపత్రికి వచ్చి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. గ్రామ పంచాయితీలలో, ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో, జూనియర్ డిగ్రీ కళాశాలల్లో కుష్ఠు వ్యాధి అవగాహన పక్షొత్సవం జరుగుతుంది అని తెలిపారు. అనంతరం స్పర్శ్ లెప్రసి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మన్సూరాబాద్ వైద్యాధికారి డాక్టర్ అమితా, జిల్లా పారా మెడికల్ అధికారి సులోచన, సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## పొరపాట్లు జరగకుండా నామినేషన్ల ప్రక్రియ

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సి.నారాయణరెడ్డి



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** మున్సిపల్ ఎన్నికలలో భాగంగా నామినేషన్ల స్వీకరణ ప్రక్రియలో సమయపాలన కచ్చితంగా పాటించాలని జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ సి.నారాయణ రెడ్డి తెలిపారు. శుక్రవారం జిల్లాలోని మొయినాబాద్,చేవెళ్ళ మున్సిపాలిటీ కార్యాలయాలలో ఏర్పాటు చేసిన నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను ఎన్నికల అబ్జర్వర్ మయంక్ మిట్టల్ తో కలిసి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి నామినేషన్ల ప్రక్రియ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్నికల అబ్జర్వర్ మయంక్ మిట్టల్ మాట్లాడుతూ ఎలాంటి పొరపాట్లు జరగకుండా నామినేషన్ల ప్రక్రియను నిర్వహించాలని,నామినేషన్ దరఖాస్తు ఫారాలు తీసుకున్న వారి వివరాలను కూడా రిజిస్టర్ లో నమోదు చేయాలని జనరల్ అబ్జర్వర్ సూచించారు. దాఖలైన నామినేషన్లకు సంబంధించి జిల్లా కేంద్రానికి సకాలంలో రిపోర్టులు పంపించాలని అన్నారు. ప్రతి నామినేషన్ సెంటర్ వద్ద హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశామని, విధుల్లో ఉన్న ప్రభుత్వ సిబ్బంది నామపత్రాలు దాఖలు చేసే విషయంలో అభ్యర్థులకు అవసరమైన సహకారం అందించాలని సూచించారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ నామినేషన్ల ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని, నామినేషన్ల స్వీకరణలో సమయపాలన ఖచ్చితంగా పాటించాలని, సాయంత్రం 5 గంటలకు గేటు మూసివేయాలని, గేటు లోపల ఉన్న వారికి టోకెన్లు అందజేసి వరుస క్రమంలో నామినేషన్లు స్వీకరించాలని, రిటర్నింగ్ అధికారులు నామినేషన్ల స్వీకరణలో అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. నామినేషన్ల స్వీకరణ కొరకు టేరకు ఏర్పాటు చేయడం జరిగిందని, నామినేషన్ దరఖాస్తులు నింపడం, జత పరచవలసిన పత్రాలు, ఇతర వివరాల కొరకు హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. నామినేషన్ దరఖాస్తులు పూర్తిచేసిన అభ్యర్థులు హెల్ప్ డెస్క్ వద్ద పరిశీలించుకుని సరైన నామినేషన్లు దాఖలు చేయాలని తెలిపారు. 31వ తేదీన నామినేషన్లు పరిశీలించి అర్హత గల అభ్యర్థుల జాబితా ప్రకటన, ఫిబ్రవరి 1వ తేదీన నామినేషన్లపై అభ్యంతరాలు, ఫిర్యాదుల స్వీకరణ, 2వ తేదీన అభ్యంతరాలు, ఫిర్యాదుల పరిష్కారం, 3వ తేదీన నామినేషన్ల ఉపసంహరణ అనంతరం పోటీలో ఉండే అభ్యర్థుల తుది జాబితా ప్రకటన జరుగుతుందని తెలిపారు. ఫిబ్రవరి 11వ తేదీన పోలింగ్,12వ తేదీన రీపోలింగ్ (ఏమైనా ఉన్నట్లయితే),13వ ఓట్ల లెక్కింపు ప్రక్రియ చేపట్టి గెలుపొందిన అభ్యర్థుల ప్రకటన జరుగుతుందని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో భాగంగా జిల్లాలోని గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో కంట్రోల్ రూమ్ నం. 9849906949 ఏర్పాటు చేయడం జరిగిందని, ఎన్నికల సంబంధించిన సమాచారం, ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనపై ఫిర్యాదుల కొరకు సంప్రదించవచ్చని తెలిపారు. జిల్లాలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో చేవెళ్ళ ఆర్‌డిఒ వెంకట్ రెడ్డి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగులు ఆత్మన్యూనతాభావంతో ఉండొద్దు

దివ్యాంగ సంక్షేమ డైరెక్టర్ శైలజ



**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** దివ్యాంగులు ఆత్మన్యూనతభావంతో ఉండవద్దని, ఏదో ఒకటి సాధించాలనే సంకల్పంతో ముందుకెళ్లాలని రాష్ట్ర దివ్యాంగ, వృద్ధుల సంక్షేమ విభాగ డైరెక్టర్ బి.శైలజ సూచించారు. శుక్రవారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో రోటరీ క్లబ్ ఆఫ్ మదరస్ ఈస్ట్ ఆధ్వర్యంలో సిఎస్‌ఆర్ భాగస్వామ్యం మువెట్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ సీనియర్ డెలివరీ డైరెక్టర్ కె.సాయి సురేశ్ కుమార్ సహకారంతో దివ్యాంగులకు బ్యాటరీ ఆపరేటెడ్ మొబిలిటీ వెహికిల్స్‌ను అందజేత కార్యక్రమం జరిగింది. దీనికి గౌరవ అతిథిగా విచ్చేసి, దివ్యాంగులకు బ్యాటరీ ఆపరేటెడ్ మొబిలిటీ వెహికిళ్లను అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ దివ్యాంగులకు విద్యకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ప్రభుత్వం దివ్యాంగులకు 4శాతం రిజర్వేషన్ కల్పించిందని, బాగా చదివి ఉన్నత ఉద్యోగాలను సాధించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున ఇప్పటికే ఎంపికైన వందలాది మంది దివ్యాంగులకు అవసరమయ్యే పరికరాలను అందజేశామన్నారు. సిఎస్‌ఆర్ ముందుకొచ్చి ప్రభుత్వ సహకారం తీసుకొంటే చాలామంది దివ్యాంగులకు వెహికిల్స్‌ను అందజేయవచ్చన్నారు. కార్యక్రమంలో స్పైనల్ కార్డ్ ఇంజూరిస్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ అధ్యక్షులు ఎండి.షఫీ అహ్మద్, రోటరీ క్లబ్ అధ్యక్షులు బాలాజీ శ్రీనివాస్, తుడుం రాజేందర్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

## ఇబ్రహీంపట్నంలో 191 నామినేషన్లు

**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం :** మున్సిపాలిటీ ఎన్నికల నామినేషన్లో భాగంగా ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ కేంద్రంలో శుక్రవారం అధికారులు నామినేషన్లు స్వీకరించారు. ఇబ్రహీంపట్నం, శేరిగూడ, సీతరాంపేట్, ఖానాపూర్ గ్రామలలో మొత్తం 24వార్డులకు చివరి రోజు నాటికి 191 నామినేషన్లు దాఖలైనట్లు అధికారులు తెలిపారు. కాంగ్రెస్, బిఆర్‌ఎస్, బిజెపి, బిఎస్‌పి, జనసేన, స్వతంత్ర్య అభ్యర్థులతో పాటు వివిధ పార్టిల అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. 18వ వార్డు నుండి కాంగ్రెస్ పార్టి బలపరిచిన కౌన్సిలర్ అభ్యర్థిరాలు బర్ల మంగజగదీశ్వర్ యాదవ్ నామినేషన్ దాఖలు చేశారు.



## లక్ష్మీ దేవిపల్లి రిజర్వాయర్‌తో వలసల నివారణ : హరగోపాల్



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** లక్ష్మీ దేవిపల్లి రిజర్వాయర్ నిర్మిస్తేనే వలసలు అగుతాయని, అందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రొఫెసర్ హరగోపాల్ కోరారు. శుక్రవారం ఫరూఖ్‌నగర్ మండలం మొగిలిగిద్ద గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లుకు ప్రొఫెసర్ హరగోపాల్ వినతిపత్రం అంధించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు..భట్టి విక్రమార్క పాదయాత్ర చేసిన సమయంలో స్వయంగా లక్ష్మీ దేవిపల్లి రిజర్వాయర్ నిర్మించే ప్రాంతాలకు తీసుకువెళ్ళి వివరించడం జరిగిందని తెలిపారు. షాద్‌నగర్ డివిజన్ ఎత్తైన ప్రాంతంలో ఉందని, అందుకే లక్ష్మీ దేవిపల్లి ప్రాజెక్టు నిర్మిస్తే ప్రజలకు, రైతులకు సాగునీరు, తాగునీరు లభిస్తుందని వివరించారు. దాంతో వ్యవసాయ పొలాలు పచ్చగా మారి అభివృద్ధి సాధించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. వర్షాధార పంటలపై ఆధార పడి ఉన్న నేపథ్యంలో వేసవి కాలం వచ్చిందంటే హైదరాబాద్, ముంబాయి, పుణే వంటి ప్రాంతాలకు వలసలు వెళ్తున్నారని వివరించారు. ఇప్పటికే అనేక గ్రామాలు, తండాల ప్రజలకు వలసలు వెళ్ళారని వివరించారు. బిఆర్‌ఎస్ ప్రభుత్వం రిడిజైన్ పేరుతో ప్రాజెక్టులను నిర్మించి ప్రజలను అనేక ఇబ్బందులకు గురి చేసిందని వాపోయారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే లక్ష్మీ దేవిపల్లి రిజర్వాయర్ నిర్మిస్తామని ప్రజలకు హామీ ఇచ్చారని గుర్తు చేశారు. త్వరగా పనులు చేపట్టేందుకు కృషి చేయాలని ఆకాంక్షించారు. నీటి వనరులు లేకపోవడంతోనే ఈ ప్రాంతం ఏడారిగా మారుతుందని, ప్రభుత్వ పెద్దలు ఒక్కసారి ఆలోచించి నిర్ణయం తీసుకొని పనులు మొదలు పెట్టాలని కోరారు. ఎన్నికల హామీ కాకుండా రిజర్వాయర్ పనులు చేపడితే షాద్‌నగర్, పరిగి, వికారాబాద్, చేవేళ్ళ, నల్గొండ ప్రాంతాలు అభివృద్ధి సాధించడంతోపాటు వలసలు నియంత్రించేందుకు అవకాశం ఉంటుందని వివరించారు. ఇందుకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు స్పందిస్తూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో చర్చించి లక్ష్మీ దేవిపల్లి రిజర్వాయర్ పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## ప్రశాంతంగా బార్ అసోసియేషన్ ఎన్నికలు

**ప్రజాపక్షం/హయత్‌నగర్:** రంగారెడ్డి జిల్లా కోర్టు ఆవరణలో శుక్రవారం న్యాయవాదుల రాష్ట్ర స్థాయి ఎన్నికలు ప్రశాంతంగా ముగిసాయి. 203 మంది అభ్యర్థులు పోటీలో ఉండగా 25 మందిని మొదటి ప్రాధాన్యత ఓటుతో ఎన్నుకుంటారు. రంగా జిల్లా కోర్టులో 5000 మంది న్యాయవాదులు ఉండగా 3500 మంది తమ ఓటు హక్కు వినయోగించుకున్నారు. ఫలితాలు ఫిబ్రవరి 10న వెలుబడుతాయి అని ఎన్నికల అధికారి తెలిపారు 25 మందిలో ఒకరిని చైర్మన్‌గా ఫిబ్రవరి చివరి మాసంలో ఎన్నుకోనున్నారు కార్యక్రమంలో అభ్యర్థుల తరుపున రంగారెడ్డి జిల్లా న్యాయవాదులు బొడ్డు బిక్షపతి, సత్యనారాయణ, భవ్య, గోపాల్ గౌడ్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



## విద్య, వైద్యరంగాలకు మొదటి ప్రాధాన్యం



డిప్యూటీ సిఎం భట్టి, మంత్రి పొన్నం ప్రభాకర్ విద్యార్థినీలతో కలిసి భోజనం, వసతి సౌకర్యాలపై ఆరా



**ప్రజాపక్షం/ఫరూక్‌నగర్:** రంగారెడ్డి జిల్లా మొగిలిగిద్ద ప్రభుత్వ పాఠశాల 150 వసంతాల కార్యక్రమానికి హాజరైన డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి స్థానికంగా ఉన్న కస్తూరిబా గాంధీ బాలికల వసతిగృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో, వసతి గృహంలో ఉన్న సౌకర్యాల గురించి విద్యార్థినీలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినీలతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క విద్యార్థినీలతో మాట్లాడి వసతి గృహంలో బోధన, బోధ నేతర అంశాలపై ప్రశ్నించి పలు విషయాలు ఆరా తీశారు.

### ఏకీకృత పాఠశాలలతోనే కులమత భేదాలు దూరం

**షాద్‌నగర్:** ఏకీకృత పాఠశాలలతోనే కులమత భేదాలు దూరమయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, అందుకే ప్రభుత్వం ఇంటిగ్రేటేడ్ పాఠశాలలకు మొదటి ప్రాధాన్యత ఇస్తుందని ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వివరించారు. శుక్రవారం ఫరుక్‌నగర్ మండల పరిధిలోని మొగిలిగిద్ద ప్రభుత్వ పాఠశాల వార్షికోత్సవానికి వచ్చిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు మొదటి ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు.

### మంత్రులకు భారీ గజమాల, బోనాలతో స్వాగతం

ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌లకు ఫరూఖ్‌నగర్ మండలం మొగిలిగిద్దలో భారీ గజమాలతోపాటు బోనాలతో ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి, మాజీ జడ్పిటిసిలు మామిడి శ్యాంసుందర్‌రెడ్డి, పి.వెంకట్‌రాంరెడ్డి, మాజీ ఎంపిపిలు శివశంకర్ గౌడ్, మండల అధ్యక్షులు చల్లా శ్రీకాంత్‌రెడ్డి, కృష్ణారెడ్డి, రాజు, వీరేష్, ఏసిపి లక్ష్మీ నారాయణ, సిఐ విజయ్‌కుమార్, తహశీల్దార్ నాగయ్య, ఎంపిడిఒ బన్సీలాల్, ఎంఇఒ మనోహర్ పాల్గొన్నారు.

**కొత్తూరు:** షాద్‌నగర్ ముఖద్వారం కొత్తూరు మండలం తిమ్మాపూర్ వద్ద రాష్ట్ర మంత్రులకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచులు, కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

# వరేహం, గార్డ్‌నర్ బౌండరీల మోత..

మహిళల ప్రీమియర్ లీగ్ ప్లే ఆఫ్స్ రేసులో ఉన్న ముంబై ఇండియన్స్‌కు భారీ లక్ష్యాన్ని నిర్దేశించింది గుజరాత్ జెయింట్స్. పవర్ ప్లేలో ముంబై బౌలర్ల జోరుతో తడబడిన గుజరాత్‌ను కెప్టెన్ అష్లీ గార్డ్‌నర్(46), జార్జియా వరేహం(44 నాటౌట్)లు ఆదుకున్నారు. 71కే 3 వికెట్లు పడిన వేళ వీరిద్దరూ తమ విధ్వంసక ఆటతో చెలరేగారు. బౌండరీల మోతతో ముంబై బౌలర్లను బెంబేలిత్తించారు. దాంతో, గుజరాత్ నిర్ణీత ఓవర్లలో నాలుగు వికెట్లే కోల్పోయి 167 పరుగులు చేసింది. టాస్ గెలిచిన గుజరాత్ భారీ స్కోర్ కొట్టాలనుకుంది. కానీ. పవర్ ప్లేలోనే ఓపెనర్ బేత్ మూనీ(5)ని సంజన కళ్లుచెదిరే డైవింగ్ క్యాచ్‌తో పెవిలియన్ పంపింది. సోఫీ డెవినె (25), అనుష్క శర్మ(33)లు ఆచితూచి ఆడుతూ ఇన్నింగ్స్ నిర్మించారు. అమేలియా ఓవర్లో సిక్సర్ బాదిన అనుష్క.. ఆ తర్వాతి బంతికే షబ్నం చేతికి చిక్కింది. బ్రంట్ ఓవర్లో పెద్దషాట్ ఆడిన డెవినె బౌండరీ వద్ద క్యాచ్ ఇచ్చి వెనుదిరిగింది. దాంతో.. 71కే మూడు వికెట్లు పడ్డాయి. కెప్టెన్ అష్లీ గార్డ్‌నర్(46), జార్జియా వరేహం(44 నాటౌట్)లు ఆదుకున్నారు. క్రీజులో కుదురుకునేంత వరకూ నింపాదిగా ఆడిన గార్డ్‌నర్, వరేహంలు ఆ తర్వాత రెచ్చిపోయారు. 15వ ఓవర్లో గేర్ మార్చిన గార్డ్‌నర్ వరుసగా 6, 4, 4 నాలుగో బంతికి బౌండరీతో ఏకంగా19 రన్స్ పిండుకుంది. ఆ తర్వాతి ఓవర్లో షబ్నం ఇస్మాయిల్‌ను ఉతికేస్తూ వరేహం, ఆమె రెండేసి ఫోర్లు కొట్టడంతో స్కోర్ 140 దాటింది. గార్డ్‌నర్ ఔటయ్యాక భారతి ఫుల్‌మాలి (5 నాటౌట్) జతగా వరేహం రెచ్చిపోయింది. బ్రంట్ బౌలింగ్‌లో సిక్స్, ఫోర్ సంధించిన తను.. ఆఖరి ఓవర్లో 7 పరుగులే రాబట్టింది. ఫలితంగా.. గుజరాత్ నిర్ణీత ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 167 పరుగులు చేసింది. ముంబై బౌలర్లలో అమేలియా కేర్ (2–26) రాణించింది.



## మారథాన్ మ్యాచ్‌లో జ్వెరెవ్ ఓటమి.. ఫైనల్లో అల్కరాస్



కొత్త ఏడాదిలో మొదటి గ్రాండ్‌స్లామ్‌లో కార్లోస్ అల్కారాస్ ఫైనల్‌కు దూసుకెళ్లాడు. ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో అదరగొడుతున్న ఈ టాప్ సీడ్ పురుషుల సింగిల్స్ సెమీస్‌లో అలెగ్జాండర్ జ్వెరెవ్‌కు చెక్ పెట్టాడు. అలాఅనీ జ్వెరెవ్ అలవోకగా తల వంచలేదు. స్పెయిన్ కెరటానికి ముచ్చెమటలు పట్టించిన అతడు.. ఐదు గంటల 27 నిమిషాల పాటు పోరాడాడు. కానీ, చివరకు క్లాస్ ఆటతో చెలరేగిన అల్కరాస్‌ను విజయం వరించింది. ఓపెన్ ఎరాలో చిన్నవయసులోనే నాలుగు గ్రాండ్‌స్లామ్స్ ఫైనల్ చేరిన ఆటగాడిగా అల్కరాస్ రికార్డు నెలకొల్పాడు. నిరుడు ఫ్రెంచ్ ఓపెన్ ఫైనల్లోనూ చెమటోడ్చిన అల్కరాస్‌కు ఈసారి ఆస్ట్రేలియన్ ఓపెన్ సెమీస్‌లో అలెగ్జాండర్ జ్వెరెవ్ రూపంలో కఠిన ప్రత్యర్థి ఎదురయ్యాడు. అప్పుడు సిన్నర్‌ను ఓడించేందుకు ఐదు గంటలు కష్టపడిన అతడు.. జ్వెరెవ్‌ను మట్టికరిపించేందుకు ఐదు గంటల 27 నిమిషాలు తీసుకున్నాడు. దూకుడైన ఆటతో జర్మనీ కుర్రాడికి షాకిస్తూ వరుసగా రెండు సెట్లు గెలిచిన అల్కరాస్.. నిర్ణయాత్మక సెట్‌ను ఒక్క పాయింట్‌తో కోల్పోయాడు. దాంతో.. నాలుగో సెట్ ఆద్యంతం ఉత్కంఠగా సాగింది. దాదాపు ఐదున్నర గంటలు ప్రేక్షకులను అలరించిన ఈ మారథాన్ మ్యాచ్‌లో 6–4, 7–6, 6–7, 7–6, 7–5తో అల్కరాస్ విజేతగా నిలిచాడు. రెండో సెమీఫైనల్లో తలపడుతున్న జన్నిక్ సిన్నర్ , నొవాక్ జకోవిచ్‌లో ఒకరితో అతడు ఫైనల్ ఆడనున్నాడు. ఓపెన్ ఎరాలో అత్యంత చిన్న వయసు(22 ఏళ్లు)లోనే నాలుగు గ్రాండ్‌స్లామ్స్ ఫైనల్ చేరిన ఆటగాడిగా అల్కరాస్ రికార్డు సృష్టించాడు. 1993లో జిమ్ కొరియర్ పేరుతో ఉన్న రికార్డును ఈ యంగ్ సంచలనం బద్ధలు కొట్టాడు.



## వరల్డ్‌కప్ మ్యాచ్ అధికారులుగా శ్రీనాథ్, నితిన్

టి–20 ప్రపంచకప్ టోర్నీకి గడవు సమీపిస్తున్న వేళ మ్యాచ్ అధికారులను ఐసిసి ప్రకటించింది. ఈ మెగా టోర్నీలో లీగ్ దశ నిర్వహణ బాధ్యతలు చూసేందుకు 30మందిని ఎంపిక చేయగా వీరిలో ఇద్దరు భారతీయులకు మాత్రమే చోటు దక్కింది. అంపైర్‌గా నితిన్ మీనన్, రిఫరీగా జవగళ్ శ్రీనాథ్ ఎంపికయ్యారు. 24 మంది ఆన్‌ఫీల్డ్ అంపైర్లుగా వ్యవహరించనుండగా.. ఆరుగురు మ్యాచ్ రిఫరీలుగా సేవలందించనున్నారు. ఫిబ్రవరి 7వ తేదీ నుంచి భారత్, శ్రీలంక వేదికగా పొట్టి ప్రపంచకప్ షురూ కానుంది. ఇప్పటికే షెడ్యూల్ ప్రకటిచడంతో పాటు.. బంగ్లాదేశ్ స్థానంలో స్కాట్లాండ్‌కు చోటు కల్పించిన ఐసీసీ శుక్రవారం మ్యాచ్ అఫీషియల్స్‌ను ప్రకటించింది. అంతర్జాతీయ అనుభవానికి ప్రాధాన్యమిస్తూ 30 మంది (24మంది ఆన్ ఫీల్డ్ అంపైర్లు, ఆరుగురు మ్యాచ్ రిఫరీలు)కి వరల్డ్‌ప్ మ్యాచ్‌ల నిర్వహణ బాధ్యతలు కట్టబెట్టింది.

**మ్యాచ్ రిఫరీలు :** జవగళ్ శ్రీనాథ్, డీన్ కొస్కెర్, డేవిడ్ గిల్బర్ట్, రంజన్ మడుగల్లే, ఆండ్రూ పైక్రాఫ్ట్, రికీ రిచర్డ్‌సన్.

**అంపైర్లు :** నితిన్ మీనన్, రొనాల్డ్ బ్లాక్, క్రిస్ బ్రౌన్, కుమార ధర్మసేన, క్రిస్ గఫానే, అడ్రియన్ హోల్డ్‌టాక్, రిచర్డ్ ఇల్లింగ్‌వర్త్, రిచర్డ్ కెటిల్‌బరో, వేనీ నైట్స్, డొనొవాన్ కాచ్, జయరామన్ మదనగోపాల్, సామ్ నొగజస్కీ, కేఎన్‌ఏ పద్మనాభన్, అల్లాహుద్దీన్ పాలేకర్, అహ్సాన్ రజా, లెస్లీ రీఫర్, పాల్ రీఫిల్, లాంగ్టన్ రుసెరె, షర్ఫుద్దౌలా ఇబ్నే షాహిద్, గాజీ సోహెల్, రాడ్ టక్నర్, అలెక్స్ వార్ఫ్, రవీంద్ర విమలసిరి, అసిఫ్ యాకుబ్.

# సైన్స్



## విస్తరణకు అర్థం ఏమిటి?

విశ్వం విస్తరిస్తోంది అని వినగానే, అది ఎందులోకి లేదా ఏ ప్రాంతంలోకి విస్తరిస్తుంది? అనే ప్రశ్న రావడం సహజం. అయితే, ఇక్కడే మన దైనందిన అనుభవం మనల్ని తప్పుదారి పట్టిస్తుంది. మనకు తెలిసిన ప్రతి విస్తరణ ఒక ఖాళీ స్థలంలోనే జరుగుతుంది. గది విస్తరిస్తే బయట గాలి ఉంటుంది. బెలూన్ ఊదితే దాని చుట్టూ గాలి ఉంటుంది. కానీ విశ్వం అలాంటిది కాదు. విశ్వానికి బయట ఖాళీ గది లేదు. బయట అన్న భావననే ఇక్కడ అర్థం లేదు. ఎందుకంటే విస్తరిస్తోంది అనేది వస్తువులు కాదు.. స్థలం మాత్రమే. గెలాక్సీలు ఒకదాన్నొకటి దూరంగా పారిపోతున్నట్లు కనిపిస్తాయి.. కానీ అవి కదలడం లేదు. వాటి మధ్య ఉన్న స్థలం లాగబడుతోంది. ఇది చాలా ముఖ్యమైన తేడా. రబ్బరు షీట్ మీద బొట్లు గీసి దాన్ని లాగితే, బొట్లు కదలకుండా దూరమవుతాయి. అదే విధంగా విశ్వంలో గెలాక్సీలు ప్రయాణం చేయడం లేదు.. స్థలమే పెరుగుతోంది. అందుకే విశ్వం దేనిలోకి విస్తరిస్తోంది? అన్న ప్రశ్నకు 'ఎందులోకీ కాదు' అనేదే నిజమైన సమాధానం. ఇది మనకు అలవాటైన భౌతిక తర్కానికి విరుద్ధంగా ఉంటుంది. మన మెదడు స్థలాన్ని ఒక కంటైనర్‌లా ఊహించుకుంటుంది. స్థలం కూడా ఒక వస్తువులాంటిదే. అది వక్రంగా వంగుతుంది. దానికి లాగితే సాగే లక్షణం ఉంటుంది. రూపం కూడా మారుతుంది. ఇదే ఆధునిక భౌతిక శాస్త్రం ప్రతిపాదిస్తున్న కొత్త సిద్ధాంతం. అంటే విశ్వానికి అంచు లేదు, గోడ లేదు, బయట ఖాళీ లేదు. అది ఒక మ్యాప్ లాంటిది కాదు. నియమాల ప్రకారం మారే ఒక నిర్మాణం. మనకు స్థలం అనిపించే దానే అసలు మౌలిక వస్తువు కాదు. అది కూడా విశ్వంతో పాటు పుట్టింది, విశ్వంతో పాటు మారుతోంది. ఈ వాదన విచిత్రంగా అనిపించొచ్చు. కానీ శాస్త్రంలో నిజాలు చాలాసార్లు మన అలోచనలకు, అంచనాలకు పూర్తి భిన్నంగా ఉంటాయి. ఏదిఏమైనా, విశ్వం విస్తరిస్తోంది అనేది ఒక భౌగోళిక సంఘటన కాదు.. అది వాస్తవం తానే ఎలా ప్రవర్తిస్తుందో చూపించే సంకేతం.

# గురుత్వాకర్షణకు కొత్త సిద్ధాంతం



సాధారణంగా మనం గురుత్వాకర్షణను ఒక బలంగా ఊహిస్తాం. భూమి మనల్ని లాగుతుంది, సూర్యుడు గ్రహాలను పట్టుకుంటాడు అన్నట్టుగా. కానీ, గురుత్వాకర్షణ స్వతంత్ర బలం కాకపోవచ్చునని, అది లోతైన అనుసంధానాల ఫలితంగా అనుభూతి అయ్యే ప్రభావం మాత్రమే కావచ్చనీకొంతమంది భౌతిక శాస్త్రవేత్తలు ఒక భిన్నమైన దృష్టికోణాన్ని ప్రతిపాదిస్తున్నారు. అంటే, ఈ సిద్ధాంతం ప్రకారం విశ్వం అనేది విడివిడిగా ఉన్న వస్తువుల సమాహారం కాదు. అది ఒక అంతర్గతంగా అనుసంధానమైన జాలం. కణాలు ఒకదానితో ఒకటి సమాచారం పంచుకుంటాయి. ఆ సమాచార సంబంధాలు ఏర్పరిచే నమూనాలనే మనం ఆకర్షణగా అనుభవిస్తున్నామని ఈ ఆలోచన చెబుతుంది. ఉదాహరణకు, రెండు వ్యవస్థలు ఎంత బలంగా పరస్పరం అనుసంధానమై ఉంటాయో, అవి అంతగా ఒకదానిపై ఒకటి ప్రభావం చూపిస్తాయి. ఆ ప్రభావాన్నే మనం లాగుతున్నాయి అని భావిస్తున్నాం. అంటే గురుత్వాకర్షణ బలం కాదు... అనుసంధానాల తీవ్రతకు కనిపించే రూపం కావచ్చు. ఈ ఆలోచన ఎందుకు ఆకర్షణీయంగా అనిపిస్తుంది అంటే, ఇది విశ్వాన్ని చాలా సరళంగా చూస్తుంది. అదృశ్య బలాలకంటే, సంబంధాలే ప్రధానమని చెబుతుంది. వస్తువులకంటే, వాటి మధ్య ఉన్న బంధాలే ముఖ్యం అంటుంది. ఇది నిజమైతే, భౌతిక శాస్త్రంలోని క్వాంటం భౌతిక శాస్త్రం, గురుత్వాకర్షణ, సమాచారం సిద్ధాంతం అనే వేర్వేరు రంగాలను ఒకే దారంలో కలపగలదు. అలాగే ఇది మన ఆలోచనలపై కూడా ప్రభావం చూపుతుంది. విశ్వాన్ని చల్లగా, నిర్లిప్తంగా కాకుండా అనుసంధానంతో నిండిన వ్యవస్థగా ఊహించుకునేలా చేస్తుంది. అందుకే చాలామందికి ఇది భావోద్వేగంగా కూడా దగ్గరగా అనిపిస్తుంది. అయితే, ఈ సిద్ధాంతం ఇంకా ప్రతిపాదన రూపంలోనే ఉంది. కొంత మంది శాస్త్రవేత్తలు దీనిని వ్యతిరేకిస్తుండగా, మరికొందరు మరింత లోతైన అధ్యయనం అవసరమని అంటూ, మెరుగులు దిద్దే ప్రయత్నం చేస్తున్నారు. నిజానికి సమీక్షలు, పరీక్షలు, విమర్శలు వంటివి శాస్త్రానికి అత్యవసరం. ఇవే పురోగతిని సుసాధ్యం చేస్తాయి. భవిష్యత్తులో ఈ ఆలోచన మారవచ్చు, లేదా కొంత భాగం తప్పు కావచ్చు. అయినా ఇది ఇప్పటికే ఒక మంచి పని చేసింది.. మన ఆలోచనల్ని కదిలించింది. ఇప్పటి వరకు మనకు ఉన్న అనేకానేక అభిప్రాయాలపై పునఃసమీక్షించుకోవాల్సిన పరిస్థితిని కల్పించింది. వేర్వేరు రంగాల మధ్య చర్చకు తలుపులు తెరిచింది. గురుత్వాకర్షణ నిజంగా అనుసంధానాల నుంచి పుట్టిందా? అన్న ప్రశ్నకు ఇప్పుడే తుది సమాధానం లేదు. కానీ, సాధారణంగా కనిపించే వివరణల వెనుక చాలా లోతైన అందం దాగి ఉండొచ్చనే ఒక పాఠాన్ని ఈ ఆలోచన మనకు చెబుతుంది. శాస్త్రం ముందుకు సాగేది నమ్మకంతో కాదు. ఆసక్తితో, వినడానికి సిద్ధంగా ఉండటంతో, కలిసి పరీక్షించాలనే మనస్తత్వంతో.

# జోరుగా సిపిఐ అభ్యర్థుల నామినేషన్లు


**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఏదులాపురం మున్సిపాలిటీ ఎన్నికలలో భాగంగా 28,29,30, 31,32,16,3వార్డులకు సిపిఐ అభ్యర్థులు శుక్రవారం అట్టహాసంగా నామినేషన్లు దాఖలు చేశారు. అభ్యర్థుల నామినేషన్ల కార్యక్రమంలో సిపిఐ జాతీయ సమితి సభ్యుడు భాగం హేమంత్‌రావు, సిపిఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి దండి సురేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు పుచ్చకాయల కమలాకర్, మిడకంటి చిన్న వెంకట్‌రెడ్డి, మండల కార్యదర్శి పుచ్చకాయల సుధాకర్, చెరుకుపల్లి భాస్కర్, వెంపటి సురేందర్, చిన్న సైదిరెడ్డి పాల్గొన్నారు.




**దేవరకొండ :** నల్లగొండ జిల్లా దేవరకొండ మున్సిపాలిటి 10వ వార్డు సిపిఐ అభ్యర్థిగా జూలూరి మమత జ్యోతిబస్ శుక్రవారం నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు.



**చండూరు :** నల్లగొండ జిల్లా చండూరు మున్సిపాలిటీలోని అంగడిపేట నాలుగో వార్డు సిపిఐ అభ్యర్థిగా జెల్ల ధనమ్మ శ్రీనివాస్ శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ కార్యక్రమానికి సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రామలింగయ్య, చండూరు మండల కార్యదర్శి నల్పరాజు సతీష్ కుమార్ తదితరులు హాజరయ్యారు.



**చిట్యాల :** నల్లగొండ జిల్లా చిట్యాల మున్సిపాలిటీలోని రెండవ వార్డుకు సిపిఐ పట్టణ కార్యదర్శి షేక్ షరీఫ్, ఏడవ వార్డుకు బొలుగూరి లింగయ్య భార్య సుగుణమ్మ నామినేషన్ దాఖలు చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు లొడంగి శ్రవణ్‌కుమార్, అక్బర్, జిల్లా సత్యం పాల్గొన్నారు.



**మధిర :** మధిర మున్సిపాల్టీ ఎన్నికల్లో మడుపల్లిలోని 5, 6, 7 వార్డులకు, పట్టణంలో 8వ వార్డులో సిపిఐ అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేశారు. 5వ వార్డుకి పెరుమాళ్ళపల్లి వసంత, 6వ వార్డుకు ఊట్ల మరుద్వతి, 7వ వార్డుకు ఊట్ల కొండలరావు, 8వ వార్డుకి బెజవాడ రవిబాబు నామినేషన్ వేశారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బెజవాడ రవిబాబు, పెరుమాళ్ళపల్లి ప్రకాశరావు, ఊట్ల కామేశ్వరరావు, ఏఐఎస్ఐ జిల్లా అధ్యక్షులు ముడపల్లి లక్ష్మణ్, తలారి రమేష్, జిల్లా బ్రహ్మం, అన్నవరపు సత్యనారాయణ, రంగు నాగకృష్ణ, పున్నవల్లి అప్పారావు, ఊట్ల పూర్ణచంద్రరావు, చింతలపట్ల కృష్ణ, నాగుల్ మీరా, శిలువేరు శ్రీనివాసరావు, గాంధీ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



**భూపాలపల్లి :** భూపాలపల్లి మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ, కమ్యూనిస్టులు పొత్తులో భాగంగా బలపరిచిన నలుగురు అభ్యర్థులతో పాటు 30 వార్డుల కౌన్సిలర్ అభ్యర్థులను అధిక మెజార్టీతో గెలిపించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి కొలిమి రాజ్ కుమార్ పిలుపునిచ్చారు. సిపిఐ నుండి 5వ వార్డులో గంగ సరం శ్రీనివాస్, 7వ వార్డులో నూకల భూలక్ష్మీచంద్రమౌళి, 24 వార్డు వేముల జ్యోతి శ్రీకాంత్, 28 వార్డు సొత్కు ప్రవీణ్ కుమార్ లు నామినేషన్ వేశారు.

**నాగర్‌కర్నూల్ :** నాగర్‌కర్నూల్ మున్సిపాలిటీ 20వవార్డు కౌన్సిలర్‌గా సిపిఐ అభ్యర్థిగా కపిలవాయి మానస గోపిచారి రిటర్నింగ్ అధికారికి నామినేషన్‌పత్రాలు అందజేశారు. నామినేషన్ల కార్యక్రమంలో సిపిఐ రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యుడు ఎం.బాల్‌నర్సింహ్మా, సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యులు హెచ్.ఆనందజి, సిపిఐ జిల్లా కౌన్సిల్‌సభ్యులు శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.





**అమరచింత :** మున్సిపల్ ఎన్నికల నామినేషన్ ప్రక్రియ శుక్రవారం భారత కమ్యూనిస్టు పార్టీ అధ్వర్యంలో నాలుగు వార్డులలో అభ్యర్థులు నామినేషన్లు ఎన్నికల అధికారులకు సమర్పించారు. 2వ వార్డు అభ్యర్థిగా కె.భారతమ్మ, 3వ వార్డు అభ్యర్థిగా కె.శంకర్, 4వ వార్డు అభ్యర్థిగా ఏ.బాలేశ్వరి, 9వ వార్డు అభ్యర్థిగా ఏ.భాస్కర్ నామినేషన్ పత్రాలను అధికారులకు సమర్పించారు. నామినేషన్ల కార్యక్రమానికి సిపిఐ వనపర్తి జిల్లా కార్యదర్శి కె.విజయరాములు, మండల కార్యదర్శి అబ్రహం, పట్టణ కార్యదర్శి ఏ.రవీందర్, నాయకులు పి.సురేష్, లక్ష్మీ నారాయణ, సీఎన్.శెట్టి, శ్యాంసుందర్, కుతుబ్ , బాలస్వామి, హాజరయ్యారు మున్సిపాలిటీ ఎన్నికల్లో సిపిఐ నుంచి ఏడు వార్డుల్లో నామినేషన్లు వేశారని సిపిఐ జిల్లా కార్యదర్శి కె.విజయ రాములు తెలిపారు. సిపిఐ నుంచి రెండవ వార్డు అభ్యర్థిగా కె.భారతమ్మ, మూడవ వార్డు అభ్యర్థిగా కె.శంకర్, 4వ వార్డు అభ్యర్థిగా ఏ.బాలేశ్వరమ్మ, 5వ వార్డు అభ్యర్థిగా ఎస్.స్వప్న అరవ వార్డు అభ్యర్థిగా భీమన్న, 8వ వార్డు అభ్యర్థిగా ఎండి కుతుబ్, 9వ వార్డు అభ్యర్థిగా ఏ.భాస్కర్ నామినేషన్లు సమర్పించినట్లు తెలిపారు.



**సూర్యాపేట కలెక్టరేట్ :** సూర్యాపేట పట్టణంలోని 37వ వార్డు నుండి సిపిఐ కౌన్సిలర్ అభ్యర్థిగా పార్టీ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, 4వ వార్డు నుండి ఐతరాజు లింగమ్మలు శుక్రవారం నామినేషన్‌లు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరంతరం ప్రజా సమస్యలపై పోరాటం చేస్తున్న సిపిఐ అభ్యర్థులను మున్సిపల్ ఎన్నికల్లో గెలిపించాలని నామినేషన్ల కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ దోరెపల్లి శంకర్, నాయకులు ఖమ్మంపాటి రాము, చామల అశోక్ కుమార్, రేగట్టి లింగయ్య, ఏడెల్లి శ్రీకాంత్, ఐతరాజు వెంకన్న, పాషా, పొదిల లింగయ్య, పొదిల వెంకటమ్మ, ఐతరాజు లింగయ్య పాల్గొన్నారు.



**కల్లూరు :** ఖమ్మం జిల్లా కల్లూరు మునిసిపాలిటీలోని 16వ వార్డుకు శుక్రవారం సిపిఐ తరఫున దామల దయాకర్‌రావు నామినేషన్ వేశారు.



**యాదగిరిగుట్ట :** యాదగిరిగుట్ట మున్సిపల్ ఎన్నికల బరిలో సిపిఐ అభ్యర్థిగా పోటీ చేస్తున్న బబ్బురి శ్రీధర్‌కు పార్టీ అధికారిక ధృవీకరణ పత్రం శుక్రవారం నాయకులు అందజేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్లెం కృష్ణ, బండి జంగమ్మ, పేరబోయిన మహేందర్‌లు శ్రీధర్‌కు అందజేశారు.





**నిజామాబాద్ :** మున్సిపల్ కార్పొరేషన్‌లో సిపిఐ నుంచి 1వ డివిజన్ అభ్యర్థిగా గొలుసుల రమేష్, 17వ డివిజన్ అభ్యర్థిగా బి.స్వప్నలు శుక్రవారం నామినేషన్ వేశారు. నామినేషన్ల కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పి.సుధాకర్, నగర కార్యదర్శి ఓమయ్య, నాయకులు ముత్యాలు, అనిల్, సయ్యద్ ఫిరోజ్‌అలీ, గోవర్ధన్, తిరుపతి, నాగేష్, రవి, లక్ష్మి పాల్గొన్నారు.

## కొత్తగూడెం కార్పొరేషన్ ఎన్నికల బరిలో.. 60 డివిజన్లలో సిపిఐ నామినేషన్లు





**భద్రాద్రి కొత్తగూడెం :** కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలో సిపిఐ అభ్యర్థులు 60కి 60 డివిజన్లలో నామినేషన్లు అందజేశారు. దీంతో కార్పొరేషన్‌లో సిపిఐ సింగిల్ ఫైట్‌కు సిద్ధ పడుతున్నట్లు తెలుస్తోంది. కాంగ్రెస్‌తో డివిజన్ల సర్దుబాటు ఎటూ తేలికపోవడంతో తప్పని సరీ పరిస్థితుల్లో అన్నిడివిజన్లలో నామినేషన్లు వేయాల్సి వచ్చింది. ఫిబ్రవరి 3వ తేదీ ఉపసంహరణ నాటికి ఓ కొలిక్కి వచ్చే అవకాశం ఉన్నటు తెలుస్తోంది. ఇదిలా ఉండగా కాంగ్రెస్ పార్టీతో సిపిఎం పొత్తు కుదుర్చున్నట్లు తెలుస్తోంది. సిపిఎంకు 21,31 డివిజన్లను కాంగ్రెస్ ఇచ్చే అవకాశం ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. ఇక బిఆర్‌ఎస్, బిజెపి పార్టీల అభ్యర్థులు ఇప్పటి వరకు ఎవ్వరితో ఎలాంటి పొత్తులు పెట్టుకోకుండానే నామినేషన్లు దాఖలు చేశారు. కొత్తగూడెం కార్పొరేషన్ ఎన్నికల పోరు రసవత్తరంగా మారనుంది. సిపిఐ, కాంగ్రెస్‌ల మధ్య సీట్లు సర్దుపాటు కాకుంటే ఒంటరిగా పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వంతో జత కట్టి ఉన్న సిపిఐకి గత గ్రామ పంచాయితీ ఎన్నికల్లో ఒకట్రెండు చోట్ల తప్ప కాంగ్రెస్ ఎక్కడా మద్దతు పలకలేదు. అయినప్పటికీ భారీ స్థానాలతో పాటు మేజర్ గ్రామ పంచాయితీలను సైతం సిపిఐ కైవసం చేసుకుని సత్తా చాటింది. ఆ ఎన్నికల ఫలితాల అనంతరం సిపిఐతో పొత్తు పెట్టుకుని ఉంటే బాగుండంటూ కాంగ్రెస్ శ్రేణులు బాహాటంగానే చర్చించాయి. గ్రామ పంచాయితీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ శ్రేణులు చులకన చేసి మాట్లాడటంతో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుని ముందుకు నడిపించారు. దీంతో కాంగ్రెస్ ఖంగు తినాల్సిన పరిస్థితి ఏర్పడింది. కాంగ్రెస్ అధిష్టానం పొత్తు వ్యవహారంలో సుముఖంగానే ఉన్నప్పటికీ క్షేత్రస్థాయిలో పరిస్థితులు అందుకు విరుద్దంగా ఉన్నాయనే చర్చ సాగుతోంది. కార్పొరేషన్ ఎన్నికల్లో సైతం సిపిఐ ఒంటరిపోరుకు దిగితే పెద్ద ఎత్తున డివిజన్లలో సత్తా చాటి మేయర్ స్థానాన్ని కైవసం చేసుకునే అవకాశం లేకపోలేదని రాజకీయ విశ్లేషకులు వాదన. కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలో సిపిఐకి మంచి పట్టు ఉండటంతో ఈ ఎన్నికలు రసవత్తరంగా మారనున్నాయి.



ఖమ్మంలో...





## సిపిఐలోకి చేరికలు

**ప్రజాపక్షం/అమరచింత :** అమరచింత మున్సిపాలిటీలోని ఐదవ వార్డుకు సంబంధించిన స్వప్న క్రాంతిలు సిపిఐ పార్టీలో శుక్రవారం మండల కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో సిపిఐ పార్టీ మండల కార్యదర్శి అబ్రహం, పట్టణ కార్యదర్శి ఏ.రవీందర్ ఆధ్వర్యంలో చేరారు. సిపిఐ పార్టీలో చేరిన వ్యక్తులకు కండువాలు కప్పి నాయకులు స్వాగతించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా నాయకులు పి.సురేష్, ఆర్ఎన్ శంకర్, శ్రీహరి, నాయకులు భాస్కర్, శ్యాంసుందర్, లక్ష్మీనారాయణ, కుతుబ్, ఎర్రన్న, సౌలు, కుమార్, భీమ , గోవిందమ్మ, తదితరులు పాల్గొన్నారు.



## మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నర్సింహ్మా

**ప్రజాపక్షం/పెద్దకొత్తపల్లి :** మార్కెట్‌కమిటిచైర్మన్‌గా పసుపుల నర్సింహ్మాను ఎక్సైజ్ టూరిజంశాఖమంత్రి జూపల్లికృష్ణారావు ప్రకటించారు. నియమితులైన పసుపుల నర్సింహ్మాను మాజీ జడ్పిటిసి హన్మంతునాయక్, మాజీకౌన్సిలర్ బాలస్వామి, కొండూరు సర్పంచ్ ధర్మతేజ శాలువాతో సన్మానించారు. అనంతరం నూతనంగా నియమితులైన మార్కెట్‌కమిటిచైర్మన్ పసుపుల నర్సింహ్మా మాట్లాడుతూ తనపై నమ్మకంతో కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు అప్పగించిన మంత్రి జూపల్లికృష్ణారావుకు కృతజ్ఞతలు తెలుపుతూ , రైతుల సమస్యల పరిష్కారానికి విశ్వాసంగా కృషిచేస్తానన్నారు.



## ఆధార్ పనిచేయని కేంద్రాల్లో శిబిరాలు ఏర్పాటు చేయాలి

**ప్రజాపక్షం/నారాయణపేట్ :** ఆధార్ పనిచేయని కేంద్రాల్లో శిబిరాలు ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశించారు. నారాయణపేట్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయం లో జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అధ్యక్షతన డిఎల్ఎమ్‌సి సమావేశం జరిగింది. డిఎల్ఎమ్‌సి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి రాష్ట్ర ఆధార్ ప్రాజెక్ట్ అసిస్టెంట్ మేనేజర్ దామోదర్, అసిస్టెంట్ కలెక్టర్ శ్రీను రెవెన్యూ అడిషనల్ డి.ఎస్ పి కమిటీ సభ్యులందరూ హాజరయ్యారు. ఈ సమావేశంలో చర్చించిన అంశాలు ఎన్‌బియు పెండెన్సీ యుడైస్ పాఠశాల వారీగా పెండెన్సీ, ఆధార్ కేంద్రాలు పనిచేయని మండలాల్లో శిబిరాలను ఏర్పాటు చేయించడానికి సూచనలు ఇవ్వబడ్డాయి. ప్రతి ఎఇకె కేంద్రంలో కొత్త రేటు చార్జులు, చెల్లుబాటు అయ్యే సహాయక పత్రాల జాబితా ప్రదర్శన చెయ్యాలి అని ఆదేశించారు. సహాయక పత్రాల ధృవీకరణ, ఆధార్ సంతృప్తతతో పాటు అనాథ వ్యక్తుల కోసం ప్రత్యేక శిబిరాలను నిర్వహించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రెవిన్యూ శ్రీను డి.ఎస్ .పి లింగయ్య, ఎల్. డి యం విజయ్ కుమార్ ఈ డి.యం.విజయ్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## 'ప్రజాపక్షం' క్యాలెండర్ ఆవిష్కరించిన సర్పంచ్

**ప్రజాపక్షం/శ్రీరంగాపూర్ :** ప్రజాపక్షం దినపత్రిక నూతన క్యాలెండర్‌ను జానంపేట సర్పంచ్ ఇ.రాములు, నాగసానిపల్లి సర్పంచ్ సుజాత రాజశేఖర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాపక్షం దినపత్రిక ప్రజల అభిమానం చూరగొని మరింత ముందుకు సాగాలని కోరారు. సమాజంలో నాలుగో స్తంభంగా పిలవబడే మీడియా ప్రజల సమస్యలపై ప్రభుత్వానికి వారధిగా ఉండాలని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో డీలర్ మోహన్‌రెడ్డి, బాల్‌రెడ్డి, దయాకర్‌రెడ్డి, మూస, బోయ రాముడు, వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

## ఎంపిఒకు సమ్మె నోటీస్ ఇచ్చిన పారిశుద్ధ్య కార్మికులు

**ప్రజాపక్షం/పెబ్బేరు :** దేశవ్యాప్తంగా జరుగుతున్న ఫిబ్రవరి 12వ తేదీన సమ్మెలో తాము కూడా పాల్గొంటున్నట్లు పెబ్బేరు మండల మల్టీపర్పస్ వర్కర్లు స్థానిక మండల పంచాయితీ అధికారి రోజా రెడ్డి కి సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా కార్మిక నాయకుడు అనీఫ్ మాట్లాడుతూ కార్మికుల సమస్యలను తీర్చడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. కావున తమ పారిశుద్ధ్య కార్మికులందరూ ఫిబ్రవరి 12వ తారీకు ఒకరోజు సమ్మెలో పాల్గొంటున్నామని ప్రకటించారు.

## పారదర్శకంగా నామినేషన్ల ప్రక్రియ

**ప్రజాపక్షం/మక్తల్ :** నామినేషన్ల ప్రక్రియను అత్యంత పారదర్శకంగా నిర్వహించాలని చివరి రోజు నామినేషన్లు అధిక సంఖ్యలో దాఖలయ్యే అవకాశం ఉందని, సాయంత్రం 5 గంటల లోపు కేంద్రంలో ఎంత మంది అభ్యర్థులు ఉన్నా. టోకెన్‌లు ఇచ్చి వారి నుంచి నామినేషన్లు స్వీకరించాలని కలెక్టర్ ఆర్వో లకు సూచించారు. శుక్రవారం కలెక్టర్ మక్తల్ మున్సిపాలిటీ లో ఏర్పాటు చేసిన నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను సందర్శించి అక్కడి ఏర్పాట్లను పరిశీలించారు. నామినేషన్లు దాకలు చేసే అభ్యర్థుల బ్యాంక్ అకౌంట్ నంబర్లు, అఫిడవిట్లు, అవసరమైన ఇతర ధ్రువ పత్రాలు తీసుకుంటున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. కేంద్రాలలో వీడియో గ్రఫీ, సిసి కెమెరాల ఏర్పాటు ను చూశారు. ఈ కార్యక్రమంలో మక్తల్ మున్సిపల్ ఎన్నికల స్పెషల్ ఆఫీసర్ రాజేందర్ గౌడ్, తహసిల్దార్ సతీష్ కుమార్, మున్సిపల్ కమిషనర్ శ్రీ రాములు, సిఐ రామ్ లాల్, మున్సిపల్ కార్యాలయ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

# తలరాతను మార్చే శక్తి విద్య ఒక్కటే

### మంత్రి వాకిటి శ్రీహరి



**ప్రజాపక్షం/మాగనూర్ :** మాగనూర్ మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు మురళీధర్ రెడ్డి ఉద్యోగ విరమణ సన్మాన మహోత్సవ కార్యక్రమంలో గురువారం మంత్రి వాకిటి శ్రీహరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి చాలా పవిత్రమైందని, భావిభారత పౌరులను సక్రమ మార్గంలో తీర్చిదిద్దేది ఒక్క ఉపాధ్యాయుడే అని అన్నారు. మీ తలరాతను మార్చే శక్తి విద్య ఒక్కటే అని అభిప్రాయపడ్డారు. అబ్దుల్ కలాం చెప్పిన విధంగా కలలు కని వాటిని సాకారం చేసే దిశగా విద్యార్థులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రయివేటు బడుల కన్నా ప్రభుత్వ బడిలోనే నాణ్యమైన విద్య అందుబాటులో ఉంటుందని, ప్రభుత్వ బడుల్లో చదివినవారే ఎక్కువగా సివిల్స్‌కు ఎంపికవుతున్నారని తెలిపారు. మక్తల్‌లో 230 కోట్లతో 25 ఎకరాల్లో త్వరలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ కూడా ప్రారంభం అవుతుందని వెల్లడించారు. విద్య, జ్ఞానం ఎవ్వరిసొత్తు కాదని, కష్టపడి చదివితే అది అందరి సొంతం అవుతుందని పేర్కొన్నారు. కష్టపడకుండా ఏదీ రాదని కష్టపడకుండా వచ్చింది ఎల్ల కాలం నిలవదని హితవు పలికారు. విద్యార్థులు చదువులోనే కాకుండా, క్రీడల్లో కూడా రాణించాలన్నారు. గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహించడం కోసం ప్రభుత్వం స్పోర్ట్స్ పాలసీ తీసుకొచ్చిందని మంత్రి గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో సురేష్, ఎంపిడిఒ శ్రీనివాస్, మాగనూర్ సర్పంచ్ దండు జనార్ధనమ్మ, ఉప సర్పంచ్ పెద్దింటి రాజు, స్కూల్ చైర్మన్ ఇందిరమ్మ, పాఠశాల బృందం, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆనంద్ గౌడ్, నరసింహ రెడ్డి, శివరాం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## గ్రామాల అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

### ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ

**ప్రజాపక్షం/వంగూర్ :** గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని అన్నారం గ్రామంలో రూ.4కోట్ల 75లక్షల నిధులతో బిటి రోడ్డు, రూ.2లక్షల నిధులతో పాఠశాలలో మరుగుదొడ్ల గదులకు గ్రామ సర్పంచ్ మెరుగు గోవర్దన్‌రెడ్డితో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో గ్రామాల అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిరంతరం కృషిచేస్తున్నారని, పల్లెలు అభివృద్ధిచెందితే దేశం అభివృద్ధి చెందుతుందని అన్నారు. అన్నారం గ్రామాభివృద్ధి కోసం సహకరిస్తున్న సర్పంచ్ మెరుగు గోవర్ధన్‌రెడ్డి, కుమారుడు మెరుగు రమేష్‌రెడ్డిని ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ నారాయణ, వ్యవసాయ డైరెక్టర్ మెరుగు నారాయణరెడ్డి, కాంగ్రెస్‌పార్టీ సీనియర్ నాయకులు రమేష్‌రెడ్డి, రమేష్‌గౌడ్, మాజీ సర్పంచ్ శంకర్‌యాదవ్, కొండల్‌రెడ్డి, వివిధశాఖల అధికారులు, పార్టీనాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# నామినేషన్ కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్లు





**ప్రజాపక్షం/మక్తల్ :** మక్తల్‌లో 16 మున్సిపాలిటీ వార్డులకు సంబంధించి జరుగుతున్న మున్సిపల్ ఎన్నికల నామినేషన్ ప్రక్రియలో భాగంగా శుక్రవారం మూడవ రోజు జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ మక్తల్ మున్సిపల్ నామినేషన్ కేంద్రాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. నామినేషన్ కేంద్రాల్లో అభ్యర్థులు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని ఆమె సూచించారు. ఎన్నికల నామినేషన్ ప్రక్రియ చివరిరోజు కావడంతో, మక్తల్ మున్సిపాలిటీలో ఏర్పాటు చేసిన ఎన్నికల నామినేషన్ ప్రక్రియ చివరిరోజు కావడంతో, మక్తల్ మున్సిపాలిటీలో ఏర్పాటు చేసిన ఎన్నికల నామినేషన్ల స్వీకరణ కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించారు. నామినేషన్ కేంద్రాల్లో అవలంబించాల్సిన విధి విధానాలపై అధికారులకు స్పష్టమైన సూచనలు చేశారు. నామినేషన్ల ప్రక్రియలో ఏవైనా సమస్యలు తలెత్తితే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని, ఎన్నికల నామినేషన్ ప్రారంభం నుంచి ఎన్నికల ఘట్టం ముగిసే వరకు అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. శుక్రవారం చివరిరోజు కావడంతో సాయంత్రం ఐదుగంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తామని తెలిపారు. శనివారం ఉదయం 11 గంటల నుంచి స్క్రూటినీ ప్రారంభమవుతుందని, ఈనెల 3వ తేదీన బరిలో నిలిచిన అభ్యర్థుల జాబితాను ముద్రణ చేస్తామని వెల్లడించారు. ఈనెల 11వ తేదీన పోలింగ్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని, 13వ తేదీన ఓట్ల లెక్కింపు చేపట్టి తుది ఫలితాలు ప్రకటిస్తామని తెలిపారు. ఎన్నికలు పూర్తిగా శాంతియుత స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో పకడ్బందీ భద్రతా ఏర్పాట్లు చేపట్టామని అన్నారు. కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీరామ్, తాహసీల్దార్ సతీష్ కుమార్, స్పెషల్ ఆఫీసర్ రాజేందర్ గౌడ్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

**భూత్పూర్ మున్సిపాలిటీలో ...**

**ప్రజాపక్షం/మహబూబ్ నగర్ :** మున్సిపాలిటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ల స్వీకరణ కేంద్రంను కలెక్టర్ విజయేందిర బోయి శుక్రవారం సందర్శించారు. నామినేషన్ స్వీకరణ నిబంధనకు అనుగుణంగా పూర్తి చేశారా, వార్డు స్థానాలకు ఎన్ని నామినేషన్లు దాఖలు అయ్యాయి తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఏవైనా సందేహాలు ఉంటే పై అధికారులను సంప్రదించి నివృత్తి చేసుకోవాలని, అనవసర తప్పిదాలకు తావు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రశాంత వాతావరణంలో సజావుగా ఎన్నికలు జరిగేందుకు అందరూ సహకరించాలని కలెక్టర్ కోరారు.

## తెలంగాణ బార్ కౌన్సిల్ ఎన్నికలు ప్రశాంతం

**ప్రజాపక్షం/కల్వకుర్తి :** తెలంగాణ బార్ కౌన్సిల్ ఎన్నికల్లో భాగంగా శుక్రవారం కల్వకుర్తిలో ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్లో 25మంది కౌన్సిల్ సభ్యులను ఎన్నుకోవడానికి ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికలలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా 203 మంది కౌన్సిల్ సభ్యులకు పోటీపడ్డారు. కల్వకుర్తి కోర్టులో 29 మంది న్యాయవాదులకు ఓటుహక్కు కలిగి ఉన్నారు. వీరంతా మధ్యాహ్నం 2గంటలకే ఓటువేయడంతో వందశాతం ఓటింగ్ జరిగింది. జూనియర్ సివిల్ జడ్జి జె.కావ్య ఎన్నికల అబ్జర్వర్‌గా బార్ ఆసోసియేషన్ అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి ఎన్నికల అధికారిగా ఎన్నికల సహాయకులుగా ఎస్.మల్లేష్‌లు ఎన్నికలను నిర్వహించారు. ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా ఎన్నికలు జరగడంపట్ల న్యాయమూర్తి కావ్య హర్షం వ్యక్తం చేశారు.

# సామాజిక మాధ్యమాలపై ప్రత్యేక నిఘా

### జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్

**ప్రజాపక్షం/నారాయణపేట :** నారాయణపేట జిల్లాలో జరగనున్న నాలుగు మున్సిపాలిటీల నారాయణపేట్, మక్తల్, కోస్గి, మాద్దూర్ ఎన్నికల నేపథ్యంలో స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా, శాంతియుత వాతావరణంలో నిర్వహించేందుకు జిల్లా పోలీసు యాంత్రాంగం అన్నివిధాలా సిద్ధంగా ఉందని అన్నివిధాలా సిద్ధంగా ఉందని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల సమయంలో తప్పుడు ప్రచారం, అవాస్తవ వార్తల వ్యాప్తిని అరికట్టేందుకు సామాజిక మాధ్యమాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు ఎస్పీ పేర్కొన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా ఎవరైనా తప్పుడు సమాచారం, రెచ్చగొట్టే పోస్టులు లేదా అసత్య ప్రచారాలు చేస్తే, అట్టి వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సోషల్ మీడియాపై నిఘా కొరకు ప్రత్యేక సోషల్ మీడియా మానిటరింగ్ సెల్ ఏర్పాటు చేయడం జరిగిందని, వీరు నిరంతరం సోషల్ మీడియాలో వస్తున్న వార్తలను, పోస్టులను గమనిస్తూ ఉంటారని, ఎవరైనా ఒకరిని కించపరిచేవిధంగా ఒక వర్గానికి చెందిన వారిపై తప్పుడు పోస్టులు చేస్తే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్పీ హెచ్చరించారు.

ఎన్నికలను విజయవంతం చేయడంలో ప్రతి పౌరుడి పాత్ర కీలకమని ఎస్పీ పేర్కొన్నారు. ముఖ్యంగా యువత, సోషల్ మీడియా గ్రూపుల అడ్మిన్లు అత్యంత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, సమాజంలో విద్వేషాలు రెచ్చగొట్టే మెసేజ్‌లు, వీడియోలు లేదా పోస్టులను ప్రోత్సహించవద్దని సూచించారు. ఏదైనా సమాచారాన్ని ఇతరులకు ఫార్వార్డ్ చేసే ముందు దాని నిజానిజాలను నిర్ధారించుకోవాలని, అభ్యంతరకర కంటెంట్ విషయంలో గ్రూపు అడ్మిన్లు తక్షణమే వాటిని తొలగించాలని తెలిపారు. జిల్లా ప్రజలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, అభ్యర్థులు పోలీసు యంత్రాంగానికి పూర్తి సహకారం అందిస్తూ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా సహకరించాలని ఎస్పీ కోరారు.

# ముగిసిన మున్సిపాలిటీ ఎన్నికల నామినేషన్

### ఎంపి డికె.అరుణ



**ప్రజాపక్షం/నారాయణపేట్ :** నారాయణపేట మున్సిపాలిటీలో 24వ వార్డు ఉండగా, 12 అన్ రిజర్వ్యాడ్, 8 బిసి, 3 ఎస్సీ, 1 ఎస్టీలుగా రిజర్వేషన్ కాగా, అందులో 50 శాతం మహిళా రిజర్వేషన్ ఉన్నదని ఎంపి డికె.అరుణ అన్నారు. 24 వార్డులకు బిజెపి అభ్యర్థులు నామినేషన్ వేయడం జరిగింది. 24 స్థానాలకు గానూ 18 స్థానాలు బిసిలకు కేటాయించడం జరిగింది. ఎస్సీలకు 4 కేటాయించడం జరిగింది. ఒక ఎస్టీ, ఒక అన్ రిజర్వ్యాడ్ లు బిజెపి నుంచి నామినేషన్ వేయడం జరిగింది. బిజెపి మున్సిపాలిటీ కౌన్సిల్ అభ్యర్థులను నారాయణపేట మున్సిపాలిటీ లో బిజెపి జెండాను ఎగురవేయాలని పట్టణ ప్రజలను కోరుతున్నానని ఆమె అన్నారు. గతంలో బిజెపి అభ్యర్థులను గెలిపించిన మున్సిపాలిటీ చైర్మన్ కూడా. అప్పటి అధికార పార్టీ లో అభివృద్ధి పేరు చెప్పి పార్టీ మారారు. హామీలు అమలు చేయాలంటే అధికార పార్టీలో ఉంటే అభివృద్ధి జరుగుతుందని ప్రలోభాలు పెట్టీ. ఇతర పార్టీలో ఉంటే నిధులు రావని భయపడి పార్టీ లో చేర్చుకున్నారు. నారాయణపేట మున్సిపాలిటీ అభివృద్ధికి 34 కోట్లు అమృత్ పథకం కింత నిధులు కేంద్ర ప్రభుత్వం ఇచ్చింది. నారాయణపేట మున్సిపాలిటీ అభివృద్ధి బీజేపీ తోనే సాధ్యం. నా పై నమ్మకం తో ఎంపిగా బాధ్యత ఇచ్చారు. ఈ ప్రాంత అభివృద్ధి కి నా వంతు పూర్తి కృషి అందజేస్తాను. ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో ఉన్న అన్ని మున్సిపాలిటీ లో ప్రజలు బీజేపీ నీ గెలిపించాలని కోరుతున్నాను. నారాయణపేట మున్సిపాలిటీలో బిజెపిని అత్యధిక మెజారిటీ తో గెలిపించండి. నారాయణపేట అభివృద్ధి పూర్తిగా కుంటుపడింది.

# రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా పనిచేయాలి

### జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు సమర్థవంతమైన కార్యాచరణ ప్రణాళిక సిద్ధంచేసుకోవాలని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని వీడియోకాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో శుక్రవారం ఆర్అండ్‌బి శాఖ ఆధ్వర్యంలో జిల్లా ఎస్పి డాక్టర్ సంగ్రామ్ సింగ్‌జి పాటిల్‌తో కలిసి జిల్లా కలెక్టర్ అధ్యక్షతన రహదారి భద్రత కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. రోడ్ సేఫ్టీ మాసంలో గుర్తించిన ప్రమాద స్థలాలను, మిగిలి ఉన్న పనులను వెంటనే పూర్తి చేయాలని ఆర్అండ్‌బి జాతీయ రహదారి శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ మాట్లాడుతూ ఇటీవల జిల్లాలో రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్నాయని, ఈ ప్రమాదాలను నివారించేందుకు వివిధ ప్రభుత్వశాఖల సమన్వయంతో చేపడుతున్న భద్రతాపరమైన చర్యలపై మరింత దృష్టిసారించాలని అధికారులను ఆదేశించారు. వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, రోడ్డు భద్రత విషయంలో పోలీసు శాఖ రాజీపడబోదని, ప్రమాదాల నివారణకు నిరంతరం కఠిన చర్యలు కొనసాగిస్తామన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అమరేందర్, దేవసహాయం, అదనపు ఎస్పి వెంకటేశ్వర్లు, జిల్లా రవాణాధికారి చిన్నబాలు, డిఇఒ రమేష్‌కుమార్, పోలీసు, ఎన్‌హెచ్, వైద్య ఆరోగ్యశాఖల అధికారులు పాల్గొన్నారు.

**మాదకద్రవ్యాల రవాణాను ఆరికట్టాలి :**

మాదకద్రవ్యాల అక్రమ రవాణా వెనుక ఉన్న మూలాలపై గట్టి దెబ్బకొట్టేలా జిల్లా అధికారులు అంతర్గత సమాచారాన్ని సేకరించి, జిల్లాను మాదకద్రవ్య రహితంగా మార్చేందుకు కృషిచేయాలని సంబంధిత శాఖల అధికారులను జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియోకాన్ఫరెన్స్ సమావేశమందిరంలో జిల్లాస్థాయి మాదకద్రవ్యాల నియంత్రణ కమిటీ సమావేశాన్ని జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. జిల్లాలో గత సంవత్సరం మాదకద్రవ్యాల రవాణాలో నమోదైన 9 కేసులపై కలెక్టర్ ఆరాతీశారు. ఆయా కేసుల పురోగతిపై అదనపు ఎస్‌పితో అడిగి తెలుసుకున్నారు. మాదకద్రవ్యాల రవాణా, విక్రయం, సరఫరాచేసేవారికి విధిగా శిక్షలుపడేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అదనపు ఎస్‌పిని ఆదేశించారు. ఈసమావేశంలో అదనపు కలెక్టర్లు అమరేందర్, దేవసహాయం, అదనపు ఎస్‌పి వెంకటేశ్వర్లు, డిఎంహెచ్‌ఓ డాక్టర్ రవినాయక్, డిఇఓ రమేష్‌కుమార్, అచ్చంపేట డిఎస్‌పి శ్రీనివాసులు, వివిధశాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

**ఎన్నికల వార్తలపై నిఘా ఉంచాలి :**

రెండవ సాధారణ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా, సామాజిక మాధ్యమాల్లో ప్రచారమవుతున్న రాజకీయ వార్తలపై పటిష్టమైన నిఘా ఉంచాలని జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని డిపిఆర్‌ఓ కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ కేంద్రాన్ని అదనపు కలెక్టర్ దేవసహాయంతో కలిసి జిల్లా కలెక్టర్ ప్రారంభించారు.

కార్యక్రమంలో జిల్లాపౌర సంబంధాలశాఖ అధికారి కిరణ్‌కుమార్, పౌరసంబంధాలశాఖ కార్యాలయ సిబ్బంది వెంకటయ్య, శ్రీను, శివ, రాము, పాష ఉన్నారు.

## జలాల్ పూర్ చెక్‌పోస్ట్ వద్ద రూ.4,17,200ల నగదు పట్టివేత

### ఎస్సై వెంకటేశ్వర్లు



**ప్రజాపక్షం/నారాయణపేట్ :** మున్సిపాలిటీ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున నారాయణపేట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జలాల్ పూర్ చెక్‌పోస్ట్ వద్ద ఎఫ్ఎస్‌టీ ఫ్లయింగ్ స్కాడ్ టీం వాహనల తనిఖీల సందర్భంగా యాద్గిరి నుండి నారాయణపేట వస్తున్న మహమ్మద్ యూనస్ వద్ద 2,17,200/ రూపాయలు.కర్నాటక నుండి నారాయణపేట కు వస్తున్న నాగిరెడ్డి, అశోక్ నగర్, నారాయణపేట కి చెందిన వ్యక్తి వద్ద రూ. 2,00,000/ లక్షల నగదును మొత్తం 4,17,200 రూపాయలు పట్టుకున్నట్లు ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు. తదుపరి చర్యల నిమిత్తం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని నగదు గ్రీవెన్స్ కమిటీకి తప్పగించడం జరిగిందని ఎస్సై వెంకటేశ్వర్లు వెల్లడించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో చెక్‌పోస్టుల వద్ద నిరంతరం వాహనాల తనిఖీలు మరింత కఠినంగా కొనసాగుతాయని, ప్రజలు నగదు, మద్యం, ఇతర విలువైన వస్తువులు తీసుకురావొద్దు అని ఎస్సై తెలిపారు.

## కాంగ్రెస్ పార్టీలో చేరిన 12వ వార్డు రాజనగరం బిఆర్ఎస్ నాయకులు

**ప్రజాపక్షం/వనపర్తి న్యూటౌన్ :** వనపర్తి మున్సిపాలిటీ 12వ వార్డు రాజనగరం వడ్డే వాడకు చెందిన పలువురు బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం నంది హిల్స్ ఎమ్మెల్యే కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి వనపర్తి శాసనసభ్యుడు తూడి మేఘారెడ్డి కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. 12వ వార్డు రాజనగరం వడ్డేవాడకు చెందిన 50 మంది బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు రాజనగరంకు చెందిన కాంగ్రెస్ నాయకులు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీ కండువాలను కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. నేడు కాంగ్రెస్ పార్టీ హయాంలో రాజానగరం త్వరితగతిన అభివృద్ధి చెందుతుందని కాంగ్రెస్ పార్టీ ప్రజాపాలన, సంక్షేమ పథకాలను ఆకర్షించి నేడు ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రతి ఒక్కరినీ గుండెల్లో పెట్టుకుని చూసుకుంటుందని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నక్క రాణి భర్త నక్క రాజుని భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో 12వ వార్డు రాజనగరం కాంగ్రెస్ నాయకులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, మాజీ పార్టీ అధ్యక్షులు కార్యకర్తలు, మహిళా కాంగ్రెస్ నాయకురాలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## కన్నయ్యకు ఇచ్చిన హామీని నిలబెట్టుకున్న ఎమ్మెల్సీ సత్యం

### దివ్యాంగునికి ట్రై సైకిల్ అందజేత




**ప్రజాపక్షం/నాంపల్లి:** నాంపల్లి మండలం దేవత్‌పల్లి కి చెందిన సిపిఐ సీనియర్ కార్యకర్త దివ్యాంగుడు ముదిగొండ కన్నయ్య కు దివ్యాంగుల ఎలక్ట్రానిక్ బ్యాటరీ ట్రై సైకిల్‌ని సిపిఐ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం నల్లగొండలో అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ సత్యం మాట్లాడుతూ జిల్లాలో ఎస్ఎల్ బి సి సొరంగమార్గం, నక్కలగండి ప్రాజెక్టు పూర్తి చేసి దేవరకొండ, మునుగోడు నియోజకవర్గంకు సాగునీరు అందించి శశ్యామలం చేయాలని సిపిఐ ఆధ్వర్యంలో 2023 మే నెలలో చేపట్టిన పాదయాత్రలో దివ్యాంగుడైన కనకయ్య దివంగత్వాన్ని లెక్కచేయకుండా పాదయాత్రలో ముందు నడిచిన సమయంలో కాలు లేక ఇబ్బంది పడడం చూసి ఇచ్చిన ట్రై సైకిల్ ఇప్పిస్తానని హామీ ఇచ్చి హామీ మేరకు సైకిల్ అందజేయడం జరిగిందన్నారు.జిల్లాలో దివ్యాంగులకు ప్రభుత్వం అందించే పథకాలను అర్హులైన వారికీ పారదర్శకంగా అందజేయాలన్నారు. కన్నయ్య మాట్లాడుతూ తన ఆరోగ్య పరిస్థితి,పడుతున్న బాధలు గ్రహించి,వంటికాలుతో ఇబ్బంది పడుతున్న తనకు బ్యాటరీ ట్రై సైకిల్ సహకారం అందించిన ఎమ్మెల్సీ సత్యంకు కృతజ్ఞతలు తెలిపారు.

## ఆరోగ్య పరిరక్షణే లక్ష్యం: ఎమ్మెల్యే




**ప్రజాపక్షం/నకిరేకల్ :** ప్రజారోగ్య పరిరక్షణలో ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు భాగస్వాములవ్వడం అభినందనీయమని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం పేర్కొన్నారు. శుక్రవారం నకిరేకల్ పట్టణంలోని ఏవియం.స్కూల్ ప్రాంగణంలో లయన్స్ క్లబ్ ఆఫ్ నకిరేకల్ ఆధ్వర్యంలో, యశోద హాస్పిటల్ సౌజన్యంతో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలు, నిరుపేదలు ఆరోగ్య సమస్యలను ముందుగానే గుర్తించి తగిన చికిత్స పొందేందుకు ఇలాంటి వైద్య శిబిరాలు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చౌగోని రజిత శ్రీనివాస్,లయన్ క్లబ్ జిల్లా గవర్నర్ రేపాల మదన్ మోహన్, వై. మోహన్ రెడ్డి, కొండ సంతోష్ ,బుడిగె శ్రీనివాసులు ఎ.న్. రామ్మోహన్ రావు,కందాళ పాపిరెడ్డి, వేణుగోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

## ముగిసిన నామినేషన్ల పర్వం

### చివరి రోజున భారీ ఎత్తున నామినేషన్ల దాఖలు

### కొందరు అభ్యర్థులు డబుల్ నామినేషన్ సెట్ల దాఖలు



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** హుజూర్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని హుజూర్‌నగర్, నేరేడుచర్ల మున్సిపాలిటి లకు జరుగుతున్న రెండవ సాధారణ 2026 ఎన్నికలకు సంబంధించిన నామినేషన్ల స్వీకరణ కార్యక్రమం శుక్రవారం ముగిసింది. రెండు మున్సిపాలిటికిలకు సంబంధించి మూడవ రోజు ఆశావాహులు భారీ ఎత్తున నామినేషన్లు దాఖలు చేశారు. అధికార పార్టీ కాంగ్రెస్, ప్రధాన ప్రతిపక్షమైన బిఆర్ఎస్, బిజేపి, సిపిఐ, సిపిఐ(ఎం) పార్టీల నుండి పోటీచేయదలిచిన అభ్యర్థులు రెండు, మూడు నామినేషన్ల సెట్లను దాఖలు చేయడం జరిగింది. స్క్రూట్నీలో ఎంతమంది ఆశావాహులు నామినేషన్ల తిరస్కరణకు గురవుతాయో ఎంతమంది నామినేషన్లు యాక్సెప్ట్ అవుతాయో వేచిచూడాల్సిందే. ఇదిలా ఉండగా హుజూర్‌నగర్ మున్సిపాలిటి పరిధిలోని 28 వార్డులలో , నేరేడుచర్ల మున్సిపాలిటి పరిధిలోని 15 వార్డులలో భారీ ఎత్తున నామినేషన్లు దాఖలు అయ్యాయి. హుజూర్‌నగర్ మున్సిపల్ ఎన్నికల్లో నిలిచేందుకు వివిధ పార్టీలు, రెబల్, ఇండిపెంటెంట్ అభ్యర్థులు నామినేషన్లు 00 దాఖలు చేయగా, నేరేడుచర్ల మున్సిపాలిటి ఎన్నికల్లో పోటీ చేసేందుకు 90 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. ప్రధాన పార్టీల నుండి పోటీ చేయదలిచిన కొందరు అభ్యర్థులు రెం డు, మూడు నామినేషన్లుసెట్లు దాఖలు చేయడంతో పాటు వారి సమీప బం ధువులు, స్నేహితులతో నామినేషన్లు దాఖలు చేయించడం జరిగింది.

## 90మంది 117 నామినేషన్లు దాఖలు



**ప్రజాపక్షం/చండూరు:** మున్సిపాలిటీ ఎన్నికల్లో భాగంగా మూడు రోజుల నామినేషన్ల స్వీకరణలో చండూరు మున్సిపాలిటీలో మొత్తం 90మంది కి 117 నామినేషన్లను దాఖలు చేశారు. మొదటి రోజు నాలుగు నామినేషన్లు , రెండవ రోజు 29 నామినేషన్లు , నామినేషన్లకు చివరిరోజు శుక్రవారం రోజున ఏకంగా 60మంది 84 నామినేషన్లు దాఖలు చేశారు. చండూరు మున్సిపాలిటీలో ఉన్న మొత్తం 10 వార్డులకు గాను మొత్తం 117 నామినేషన్లు దాఖలు చేయడం జరిగిందని జిల్లా ఎన్నికల సహాయ అధికారి, చండూరు మున్సిపల్ కమీషనర్ మల్లేశం తెలిపారు. కాంగ్రెస్ నుండి 45 నామినేషన్లు, బిఆర్ఎస్ నుండి 26 నామినేషన్లు, బిజెపి నుండి 20 నామినేసన్లు, బిఎస్‌పి నుండి 03 నామినేషన్లు , సిపిఐ నుండి 02 నామినేషన్లు, ఇతర రిజిస్టేషన్ పార్టీల నుండి 05, స్వతంత్రులు 16 మంది తమ నామినేషన్లను దాఖలు చేశారు.

## హాలియాలో 135 నామినేషన్లు



**ప్రజాపక్షం/హాలియా:** మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల నామినేషన్ల ప్రక్రియ శుక్రవారం ముగిసింది.హాలియా మున్సిపాలిటీలో మొత్తం 135 నామినేషన్లు దాఖలు అయినట్లు కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.నామినేషన్ల చివరి రోజైన శుక్రవారం 95 నామినేషన్లు వచ్చినట్లు ఆయన చెప్పారు. మొత్తం 108 మంది అభ్యర్థులు, 135 నామినేషన్లు వేసినట్లు చెప్పారు. ఇందులో బిజెపి 11,బిఎస్‌పి4,కాంగ్రెస్ పార్టీ నుంచి61,బీఆర్ఎస్ నుంచి40 నామినేషన్లు వచ్చినట్లు,రిజిస్టర్ అయిన పార్టీల నుంచి ఒకటి,స్వతంత్ర అభ్యర్థుల నుంచి 18 నామినేషన్లు దాఖలు అయినట్లు చెప్పారు.అధికార కాంగ్రెస్ పార్టీ నుంచి ఎక్కువమంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయడం గమనార్హం.

# కాంగ్రెస్‌తోనే పట్టణాల సమగ్రాభివృద్ధి

### ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య

### యాదగిరిగుట్టలో కాంగ్రెస్, సిపిఐ 'నగారా'..

### అభ్యర్థుల నామినేషన్ ర్యాలీలో హోరెత్తిన జనసందోహం

### ముఖ్య అతిథిగా హాజరైన సిపిఐ రాష్ట్ర నాయకుడు గోదా శ్రీరాములు



**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** యాదగిరిగుట్ట మున్సిపల్ ఎన్నికల ప్రచార పర్వంలో సిపిఐ, కాంగ్రెస్ పార్టీ తన బలాన్ని చాటుకుంది. పట్టణంలోని మున్సిపల్ కౌన్సిలర్ అభ్యర్థుల నామినేషన్ల దాఖలు సందర్భంగా నిర్వహించిన భారీ ర్యాలీ గుట్ట వీధుల్లో జనసంద్రాన్ని తలపించింది. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, సిపిఐ రాష్ట్ర నాయకులు గోదా శ్రీరాములు ముఖ్య అతిథిలుగా హాజరై అభ్యర్థులకు మద్దతుగా నిలిచారు. పట్టణంలోని లక్ష్మీ నరసింహ ఫంక్షన్ హాల్ వద్ద ప్రారంభమైన ఈ ప్రదర్శన మున్సిపల్ కార్యాలయం వరకు కొనసాగింది. కాంగ్రెస్, సిపిఐ జెండాలు, ఉత్సాహభరితమైన నినాదాల మధ్య కార్యకర్తలు, అభిమానులు భారీ ఎత్తున తరలివచ్చారు. ర్యాలీ పొడవునా ప్రజలు అభ్యర్థులకు, ఎమ్మెల్యేకు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య మాట్లాడుతూ.. పట్టణాల సమగ్ర అభివృద్ధి కేవలం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమన్నారు. స్థానిక సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించే సత్తా కాంగ్రెస్ కౌన్సిలర్లకే ఉంది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇందిరమ్మ ఇళ్లు, ఉచిత విద్యుత్, మహాలక్ష్మి వంటి పథకాలతో ప్రజలకు అండగా నిలుస్తోంది. తాగునీరు, డ్రైనేజీ, సీసీ రోడ్లు, పారిశుధ్యం మెరుగుపరచడంతో పాటు మహిళా సంఘాల బలోపేతానికి, యువత ఉపాధికి తమ పార్టీ కట్టుబడి ఉంది. ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయని ఏకైక పార్టీ కాంగ్రెస్. రాబోయే ఎన్నికల్లో మన అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించి, యాదగిరిగుట్టను ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుకుందాం' అని అయిలయ్య పిలుపునిచ్చారు. సిపిఐ రాష్ట్ర రాష్ట్ర సమితి సభ్యులు గోదా శ్రీరాములు మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల్లో మిత్రపక్షాలుగా పోటీ చేస్తున్న కాంగ్రెస్ సిపిఐ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. గత పది సంవత్సరాలు పరిపాలన చేసిన బిఆర్ఎస్ పాలకులు యాదగిరిగుట్టను అభివృద్ధి పేరిట విధ్వంసం చేశారని స్థానికులకు ఉపాధి లేకుండా బతుకుదెరువు లేకుండా చేశారని మండిపడ్డారు. బిఆర్ఎస్ ఓటు వేస్తే అభివృద్ధి జరగదని స్పష్టం చేశారు. మున్సిపల్ ఎన్నికల వేళ ఈ ర్యాలీ పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. కాంగ్రెస్ గాలి బలంగా వీస్తోందని, మెజారిటీ వార్డుల్లో పార్టీ జెండా ఎగరడం ఖాయమని స్థానిక నాయకులు ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా కార్పొరేషన్ ఛైర్పర్సన్ బండ్రు శోభారాణి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్లెం కృష్ణ, యాదగిరిగుట్ట కాంగ్రెస్ పార్టీ టౌన్ ప్రెసిడెంట్ బిక్షపతి, ముక్కెర్ల మల్లేష్, గుండ్లపల్లి భరత్, సాదునేని మధుకర్, సిపిఐ పట్టణ కార్యదర్శి బబ్బురి శ్రీధర్, మండల కార్యదర్శి మహేందర్, సీనియర్ నాయకులు పేరు బోయిన పెంటయ్య, భారీ సంఖ్యలో కాంగ్రెస్, సిపిఐ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 13 వార్డులకు 84 నామినేషన్లు

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** పురపాలక సంఘం రెండవ సాధారణ ఎన్నికలు 2026 భాగంగా భూదాన్ పోచంపల్లి మున్సిపాలిటీ ఎన్నికలకు సంబంధించి 13 వార్డులకు గాను నామినేషన్ల స్వీకరణ ప్రశాంతంగా ముగిసింది. కాంగ్రెస్ టిఆర్ఎస్ బిజెపి సిపిఎం స్వతంత్ర అభ్యర్థుల నుంచి మొదటిరోజు 2, రెండవ రోజు 16 మూడవరోజు 56 మొత్తం 84 నామినేషన్లు వేసినట్టు సహాయ ఎన్నికల అధికారి అంజన్ రెడ్డి శుక్రవారం వివరాలు వెల్లడించారు. కాంగ్రెస్ 31, బిఆర్ఎస్ 31, బిజెపి 19, సీపీఎం 2, స్వతంత్రులు 1 చొప్పున 61 మంది అభ్యర్థులు నామినేషన్లు వేశారు. ఉదయం నుంచి మొదలైన నామినేషన్ల ప్రక్రియ నెమ్మదిగా మొదలయ్యి చివరి నిమిషంలో అన్ని పార్టీల నుంచి జోరుగా నామినేషన్ల పర్వం కొనసాగింది. మద్దతుదారులతో భారీ ర్యాలీలతో వచ్చి కీలక పార్టీ మున్సి చైర్మన్ కౌన్సిలర్ అభ్యర్థులు నామినేషన్లు వేయటం ప్రత్యేక ఆకర్షణ నిలిచింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నామినేషన్లు ముగిశాయి. నామినేషన్ కేంద్రాల వద్ద పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.



## ఓట్ల లెక్కింపునకు అనువైన కేంద్రాలు చూడాలి

### నల్లగొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపుకు గాను అనువైన కేంద్రాన్ని చూడాలని నల్లగొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు.శుక్రవారం అయన జిల్లా కేంద్రం సమీపంలోని ఆర్జాల బావి వద్ద ఉన్న ఎస్‌డబ్ల్యూసి గోదామును మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపుకై పరిశీలించారు. జిల్లాలో ఎన్నికలు నిర్వహించనున్న 6 మున్సిపాలిటీలు,నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్‌కు సంబంధించిన ఓట్ల లెక్కింపు ఒకే చోట చేపట్టే విధంగా ఓట్ల లెక్కింపు కేంద్రం ఉండాలని,ప్రతి మున్సిపాలిటీకి ఒక కౌంటింగ్ హాల్ తో పాటు,స్ట్రాంగ్ రూమ్,సీలింగ్ రూమ్ తదితర సౌకర్యాలు ఉండాలని, ఆ విధంగా అధికారులు ఓట్ల లెక్కింపు కేంద్రాలను చూడాలని చెప్పారు.ఆర్జాల బావి ఎస్‌డబ్ల్యుసి గోదాంతో పాటు,ఇంకా ఏవైనా అనువైన భవనాలలో ఓట్ల లెక్కింపుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్,ఆర్‌డిఓ వై.అశోక్ రెడ్డిని ఆదేశించారు.ముఖ్యంగా అన్ని మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్ ఓట్ల లెక్కింపుకు అనువైన విధంగా హాల్స్,పోటీ చేసిన అభ్యర్థులు,ఓట్ల లెక్కింపు సిబ్బంది అందరికీ సౌకర్యంగా ఉండేలా రవాణా సదుపాయం అన్నింటిని దృష్టిలో ఉంచుకుని కౌంటింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ వై.అశోక్ రెడ్డి,ఎస్ బ్ల్యుసి రీజనల్ మేనేజర్ వీరమల్లు, మేనేజర్ మురళి ,మున్సిపల్ కమిషనర్ శరత్ చంద్ర,స్థానిక తహసిల్దార్ పరశురాం కలెక్టర్ వెంట ఉన్నారు.

## ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలకు ఏర్పాట్లు

### 143 కళాశాలల నుండి 9,251మంది విద్యార్థులకు..

### 86 ప్రాక్టికల్ పరీక్షా కేంద్రాలు

### ఫిబ్రవరి 2 నుండి 11వరకు పరీక్షలు

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు.శుక్రవారం కలెక్టరేట్లోని తన చాంబర్లో జిల్లా ఇంటర్మీడియట్,సంబంధిత శాఖల అధికారులతో ఇంటర్ ప్రాక్టికల్స్ పరీక్షల పై సమావేశం నిర్వహించారు.ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు ఫిబ్రవరి 2 నుండి 11వరకు ఉంటాయని,ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు తిరిగి మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ఉంటాయని తెలిపారు.ఈ పరీక్షలకు జిల్లాలోని 143 జూనియర్ కళాశాలల నుండి మొత్తం 9,251మంది విద్యార్థులు హాజరుకానున్నారని,ఇందులో జనరల్ విభాగంలో 6,092 మంది,వొకేషనల్ విభాగంలో3,159 మంది పరీక్షలకు హాజరుకానున్నారని తెలిపారు.అలాగే రెండవ సంవత్సరం విద్యార్థుల్లో ఎంపిసి లో 3,850 మంది, బైపిసిలో 2,016 మంది పరీక్షలకు హాజరవుతున్నట్లు వెల్లడించారు.పరీక్షల నిర్వహణకు జిల్లాలో మొత్తం 86 ప్రాక్టికల్ పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు అదనపు కలెక్టర్ తెలిపారు. ఇందులో57 జనరల్ జూనియర్ కళాశాలలు,29 వొకేషనల్ జూనియర్ కళాశాలలు పరీక్షా కేంద్రాలుగా గుర్తించినట్లు వెల్లడించారు.జిల్లా ఇంటర్ విద్యాశాఖ అధికారి దశ్రు నాయక్,ప్రిన్సిపల్స్ రాకేందు కుమార్,ధనరాజ్ ,పద్మ, శ్రీదేవి పాల్గొన్నారు.

## బాధ్యతతో సమర్థవంతంగా మున్సిపల్ ఎన్నికలు

### ఎన్నికల అబ్జర్వర్ పి.గౌతమి ఐఎఎస్



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** ఫిబ్రవరి 11న జరిగే పురపాలక సంఘం రెండవ సాధారణ ఎన్నికలు 2026లో ప్రతి ఎన్నికల అధికారి బాధ్యతతో సమర్థంగా పనిచేసి ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా ఎన్నికలు నిర్వహించాలని భువనగిరి జిల్లా ఎలక్షన్ అబ్జర్వర్ పి.గౌతమి అధికారులకు ఆదేశాలిచ్చారు. శుక్రవారం ఆమె పోచంపల్లి పట్టణ కేంద్రంలోని వినోద్ మందిరం వద్ద ఏర్పాటుచేసిన నామినేషన్ కేంద్రాలను శుక్రవారం ఆమె పరిశీలించారు. ఏర్పాట్లు చూసి సంతోషం వ్యక్తం చేశారు. మున్సిపల్ కమిషనర్ అంజన్ రెడ్డిని ఎస్ఐ భాస్కర్ రెడ్డిని అభినందించారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ అంజన్ రెడ్డిని ఆమె ఎన్నికల సిబ్బంది ఆర్వోలు ఏఆర్ఓల వివరాలు ఓటర్ల జనాభా జాబితా వార్డుల వారిగా స్త్రీ, పురుషుల ఓటర్ల సంఖ్య కౌన్సిలర్ల కేటగిరీల వారిగా రిజర్వేషన్లు పోలింగ్ కేంద్రాల సంఖ్య, బూత్‌ల సంఖ్య, పోలింగ్ కేంద్రాల లొకేషన్స్, పోలీసు భద్రత సిబ్బంది, వాహనాల సంఖ్య పోలీస్ సిబ్బంది తదితర ఎలక్షన్లకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. నామినేషన్‌ల పరిశీలన, విత్‌డ్రా, తుది జాబితా, గుర్తుల కేటాయింపు, ఎన్నికల ప్రక్రియ కౌంటింగ్ పూర్తయి విజేతల ప్రకటించే వరకు ప్రతి ఒక్క సిబ్బంది అప్రమత్తంగా ఉండి క్రియాశీలకంగా వ్యవహరించాలని సూచించారు. 2011 నాటి పోచంపల్లి జనాభా సెన్సెస్ ఓటర్ల జాబితా 17010, ప్రస్తుత మున్సిపల్ పరిధిలోని ఓటర్ల ఫోటో గుర్తింపు జాబితా 15827 లాంటి వివరాలను ఆమెకు అందించారు. సహాయ ఎన్నికల అధికారి అంజన్ రెడ్డి, రిటర్నింగ్ అధికారి పి.శ్రీనివాస్ రెడ్డి, భాస్కర్, నాగేశ్వర రావు, రెవెన్యూ ఇన్స్పెక్టర్ గుత్తా వెంకట్ రెడ్డి, మజీద్ దామోదర్ రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ రాజేష్, ఆదిత్య, మైథిలి, ఎన్నికల సిబ్బంది తదితరులు ఆయన వెంట ఉన్నారు.

## ఎమ్మెల్యే కుటుంబసభ్యుల నామినేషన్



**ప్రజాపక్షం/మిర్యాలగూడ:** మిర్యాలగూడ మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా నామినేషన్ల ఆఖరు రోజు శుక్రవారం ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి కుటుంబసభ్యులు ముగ్గురు వార్డు సభ్యులుగా నామినేషన్లు వేశారు. ఎమ్మెల్యే సతీమణి బత్తుల మాధవి 39వ వార్డు, పెద్ద కుమారుడు బత్తుల సాయిప్రసన్నకుమార్‌రెడ్డి 40వ వార్డు నుంచి, చిన్న కుమారుడు బత్తుల గణేష్‌ఈశ్వర్‌రెడ్డి 28వ వార్డు నుంచి నామినేషన్లు దాఖలు చేశారు. మున్సిపల్ ఛైర్మన్ పదవి మహిళా జనరల్ రిజర్వేషన్ కావడంతో సతీమణి మాధవిని వార్డు అభ్యర్థిగా నిలబెట్టారా అని ప్రజలు చర్చించుకుంటున్నారు. మిర్యాలగూడ పుర పీఠంపై ఎవరు కూర్చొనేది వచ్చే నెల 13న తేలనుంది.

## ముగిసిన నామినేషన్ల పర్వం

### రాత్రి పొద్దుపోయేంత వరకు సాగిన నామినేషన్ల దాఖలు



**ప్రజాపక్షం/సూర్యాపేట :** మున్సిపల్ ఎన్నికల్లో నామినేషన్ దాఖలాల శుక్రవారం ముగిసింది. చివరి రోజు కావడంతో ఆయా పార్టీల నుండి నామినేషన్లు భారీగా దాఖలయ్యాయి. ఉదయం 10.30 గంటల నుండి ప్రారంభమైన నామినేషన్ల దాఖలాలు సాయంత్రం 5 గంటల వరకు ముగియాల్సి ఉండగా సాయంత్రం 4 గంటల తరువాత ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసేందుకు ఆయా మున్సిపాలిటి కార్యాలయాల వద్దకు భారీగా తరలివచ్చారు. దీంతో అధికారులు మున్సిపల్ కార్యాలయంలోకి 5 గంటలలోపు వచ్చిన వారందరికి నామినేషన్లు దాఖలు చేసేందుకు అవకాశం కల్పించారు. సూర్యాపేట, హుజూర్‌నగర్ మున్సిపాలిటిలలో దాఖలైన నామినేషన్లు ఎన్ని అనేది అధికారులు అధికారికంగా రాత్రి పొద్దుపోయేంత వరకు వెల్లడించలేదు.

### దాఖలైన నామినేషన్ల వివరాలు...

కోదాడ మున్సిపాలిటిలో శుక్రవారం మొత్తం 35 వార్డులకు గాను 283 నామినేషన్లు దాఖలు కాగా మొత్తం 333 నామినేషన్లు దాఖలు అయినట్లు అధికారులు వెల్లడించారు. ఇందులో కాంగ్రెస్ నుండి 152, బిఆర్ఎస్ నుంచి 73, బిజెపి నుండి 28, టిడిపి నుండి 4, సిపిఎం 3, బిఎస్‌పి నుండి ఒక్కరు, ఇతర పార్టీల నుండి 8, స్వతంత్రులుగా 64 మంది నామినేషన్ల దాఖలాలు చేశారు. తిరుమలగిరి మున్సిపాలిటిలో మొత్తం 15 వార్డులు ఉండగా చివరి రోజు 102 నామినేషన్లు దాఖలు కాగా మూడు రోజులు కలిపి మొత్తం 160 నామినేషన్లు దాఖలు అయినట్లు అధికారులు ప్రకటించారు. ఇందులో కాంగ్రెస్ నుండి 73, బిఆర్ఎస్ నుంచి 39, బిజెపి నుండి 24, సిపిఎం 3, ఇతర పార్టీల నుండి 3, స్వతంత్రులుగా 18 మంది నామినేషన్ల దాఖలయ్యాయి. నేరేడుచర్ల మున్సిపాలిటిలో మొత్తం 15 వార్డులు ఉండగా చివరి రోజు 52 నామినేషన్లు దాఖలు కాగా మూడు రోజుల్లో మొత్తం 90 నామినేషన్లు దాఖలు అయినట్లు అధికారులు ప్రకటించారు. ఇందులో కాంగ్రెస్ నుండి 33, బిఆర్ఎస్ నుంచి 19, బిజెపి నుండి 18, సిపిఎం 4, టిడిపి 1, ఇతర పార్టీల నుండి 2, స్వతంత్రులుగా 13 మంది నామినేషన్ల దాఖలాలు చేశారు.

## నల్లగొండలో ఒక కార్పొరేషన్ 6మున్సిపాలిటీలలో 1795 నామినేషన్లు

### చిట్యాల మున్సిపల్‌లో ట్రాన్స్ జెండర్ నామినేషన్

### నేడు నామినేషన్ల పరిశీలన

**ప్రజాపక్షం/నలగొండ:** కార్పొరేషన్ మున్సిపల్ పోరుకు నామినేషన్ల దాఖల పర్వం శుక్రవారంతో ముగిసింది. నల్లగొండ జిల్లాలో ఒక్క కార్పొరేషన్ తోపాటు ఆరు మున్సిపాలిటీ లో 162వార్డులకు గత మూడు రోజులవారీగా అభ్యర్థులు తమ నామినేషన్ పత్రాలను ఎన్నికల అధికారికి దాఖాలు చేశారు. మొదటి రోజు43మంది అభ్యర్థులకు 44నామినేషన్ లు దాఖలు చేయగా రెండో రోజు 532మంది అభ్యర్థులు 597నామినేషన్ రాగ చివరి రోజు 1795 నామినేషన్ దాఖలు చేశారు. గడువు ముగిసే సమయానికి కార్యాలయాల ఆవరణలో ఉన్న వారందరికీ నామినేషన్లు దాఖలు చేసేందుకు ఎన్నికల అధికారులు ప్రత్యేక అనుమతిని కల్పించారు. దీనితో చివరి నిమిషం వరకు ప్రధాన పార్టీల అభ్యర్థులతో పాటు స్వతంత్రులు కూడా భారీ ఎత్తున పత్రాలను సమర్పించారు. నల్లగొండ కార్పొరేషన్‌లో 48వార్డులకు 334 మంది అభ్యర్థులు 581నామినేషన్‌లు వేశారు. హాలియాలో 108మంది అభ్యర్థులు 135 నామినేషన్, చండూరు 90 మంది అభ్యర్థులు 117నామినేషన్‌లు, చిట్యాలలో 73మంది అభ్యర్థులకు 106 మిర్యాలగూడలో 327మంది అభ్యర్థులు 507నామినేషన్, దేవరకొండ 138మంది 254 నామినేషన్,నందికొండలో 90మంది అభ్యర్థులకు 95నామినేషన్‌లు దాఖలు చేశారు. అయితే చిట్యాల మున్సిపాలిటీలో మొట్టమొదటిసారిగా జనరల్ ఎస్‌సి స్థానమైన 1వ వార్డు (శివనేని గూడెం) స్థానంలో అదే వార్డుకు చెందిన ట్రాన్స్‌జెండర్ నాగిళ్ళ కావేరి (సుధాకర్) నేడు నామినేషన్ సమర్పించారు. చిట్యాల ఎన్నికల చరిత్రలో ఒక ట్రాన్స్ జెండర్ నామినేషన్ దాఖలు చేయడం మొదటి సారి కావడం విశేషం.

**నేడు నామినేషన్ల పరిశీలన :** ఈ ఎన్నికల ప్రక్రియలో తదుపరి అధికారులు నామినేషన్ల పరిశీలనచేపట్టనున్నారు.అభ్యర్థులు సమర్పించిన పత్రాల్లో ఏవైనా సాంకేతిక లోపాలు ఉన్నాయా లేదా అని నిశితంగా పరిశీలిస్తారు.ఆ తరువాత నిబంధనల ప్రకారం ఉన్న నామినేషన్లను ఆమోదించి పేర్లను ప్రకటిస్తారు. వచ్చే నెల 3వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఇచ్చారు.రాజకీయ సమీకరణాలు,బుజ్జగింపుల పర్వం ముగిసిన తర్వాత అదే రోజు సా యంత్రం పోటీలో తుది అభ్యర్థుల జాబితాను అధికారికంగా విడుదల చేయనున్నారు.

## చివరి రోజు 327 నామినేషన్లు దాఖలు



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో భాగంగా చేపట్టిన నామినేషన్ ప్రక్రియ శుక్రవారంతో ముగిసింది. మూడో రోజైన శుక్రవారం రికార్డు స్థాయిలో 327 నామినేషన్లు దాఖలు అయ్యాయి. తొలి రోజు కేవలం 4 నామినేషన్లు దాఖలు కాగా రెండవ రోజు 176 నామినేషన్లు రాగా చివరి రోజు 327 నామినేషన్లను కలిపి పట్టణంలోని 48 వార్డులకు గాను 327 మంది అభ్యర్థులు 507 నామినేషన్లు సమర్పించినట్లు అధికారులు తెలిపారు. పార్టీల వారీగా చూస్తే ఆమ్ ఆద్మీ పార్టీ 5, బీజేపీ 56, బీఎస్పీ 5, సీపీఎం 11, కాంగ్రెస్ 213, ఎంఐఎం 1, బీఆర్ఎస్ 139, టీడీపీ 2, అదర్ రిజిస్టర్ పార్టీల తరుపున 19, ఇండిపెండెంట్లు 56తో కలిపి 507 నామినేషన్ సెట్లను స్వీకరించినట్లు తెలిపారు. ప్రక్రియ పూర్తయిన అనంతరం కమీషనర్ గనవేని శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రక్రియ సజావుగా సాగేందుకు సహకరించిన రెవెన్యూ, పోలీసు శాఖలకు కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట తహసీల్దార్ శ్రీనివాస్, అధికారులు బాలు, కోటయ్య, వెంకన్న, అంజయ్య, జ్ఞానేశ్వరి తదితరులు ఉన్నారు.

## చిట్యాల మున్సిపాలిటీలో 106 నామినేషన్లు దాఖలు

**ప్రజాపక్షం/చిట్యాలః** నల్లగొండ జిల్లా చిట్యాల మున్సిపాలిటికి జరగనున్న ఎన్నికల కోసం 12 వార్డులకు గాను శుక్రవారం నామినేషన్‌ల గడువు ముగిసే సరికి మొత్తం 106 మంది అభ్యర్థులు తమ నామినేషన్‌లను దాఖలు చేశారు. అత్యధికంగా కాంగ్రెస్ పార్టీ ఆశావాహులు 34 మంది, బిఆర్ఎస్ పార్టీ టికెట్‌ను ఆశిస్తున్న 33 మంది, బిజెపి నుండి 15, సిపిఎం నుండి 3, బిఎస్‌పి నుండి 3, ఇండిపెండెట్లు 7, ఇతర గుర్తింపు పొందిన పార్టీల నుండి 11 మంది నామినేషన్లు దాఖలు చేయడం జరిగింది. ఇందులో పలువురు అభ్యర్థులు రెండు సెట్ల నామినేషన్లు దాఖలు చేయడం జరిగింది. నామినేషన్ల ప్రక్రియ శుక్రవారంతో ముగిసింది. నేడు శనివారం దాఖలైన నామినేషన్‌లను అధికారులు పరిశీలించి చెల్లుబాటు అయ్యే అభ్యర్థుల వివరాలను వెల్లడిస్తారు.

హనుమాన్ సినిమా హీరో తేజ సజ్జ మెగాస్టార్ చిరంజీవిని కలిశారు. 'మన శంకర వర ప్రసాద్ గారు' సినిమా సంక్రాంతికి విడుదలై బ్లాక్ బస్టర్ హిట్‌గా నిలిచిన నేపథ్యంలో ఘనంగా సన్మానించారు. చిరంజీవి ఇంద్ర సినిమాలో తేజ సజ్జ బాల నటుడిగా నటించారు.

# రీల్

## 'నీమాయలో' అంటున్న నరేష్ అగస్త్య



నరేష్ అగస్త్య హీరోగా నటిస్తున్న థ్రిల్లర్ 'అసురగణ రుద్ర'. సంగీర్తన విపిన్, ఆర్యన్ రాజేష్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. మురళీ కాట్రాగడ్డ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. కమ్ముల ప్రొడక్షన్స్ పతాకంపై మురళి కమ్ముల, వంశీ నిర్మిస్తున్నారు.తాజాగా 'నీ మాయలో పడేట్టుగా' అనే సాంగ్ను రిలీజ్ చేశారు. శేఖర్ చంద్ర ఈ పాటను హృదయాన్ని తాకే బ్యూటీఫుల్ మెలోడీగా కంపోజ్ చేయగా, చైతు సత్సంగి అందించిన సాహిత్యం పాటకు మరింత ప్రాణం పోశాయి. రమ్య బెహరా, సిద్ధార్థ్ మీనన్ గాత్రం మెలోడీని మరో స్థాయికి తీసుకెళ్లాయి.కొత్తగా పెళ్లయిన జంట ప్రేమను సెలబ్రేట్ చేసే ఈ సాంగ్లో లీడ్ పెయిర్ మధ్య కెమిస్ట్రీ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. మొత్తం మీద ఈ పాట మ్యూజిక్ లవర్స్ మనసుల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకుంటోంది.ఈ చిత్రానికి అమర్నాథ్ బొమ్మిరెడ్డి డీవోపీ, శ్రీకాంత్ పట్నాయక్ ఆర్ ఎడిటర్, ప్రొడక్షన్ డిజైనర్ రఘు కులకర్ణి. ఇతర పాత్రల్లో మురళీ శర్మ, శత్రు, రవివర్మ, శుభలేఖ సుధాకర్, ప్రియాంక శర్మ, ఆర్యన్ రాజేష్, అమిత్ శర్మ, దేవి ప్రసాద్, ఆమని, నిఖిల్ దేవదూల, బేబీ శ్రీదేవి నటిస్తున్నారు.ఈ చిత్రానికి సహ నిర్మాతలు: సుధాకర రెడ్డి విప్పల, అప్పి రెడ్డి, సంగీతం: శేఖర్ చంద్ర,సినిమాటోగ్రఫీ అమర్నాథ్ బొమ్మిరెడ్డి,ఎడిటింగ్ శ్రీకాంత్ పట్నాయక్ ఆర్, కొరియోగ్రాఫి : పోలాకి విజయ్, వెంకట్ దీప్, స్టంట్స్: నబా మాస్టర్, నందు మాస్టర్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ : శ్రీహరి గౌడ్.

## శ్రీనివాస మంగాపురం'లో 'మంగ' ఫస్ట్ లుక్ రిలీజ్



ఆర్ ఎక్స్ 100, 'మంగళవారం' చిత్రాల లో ప్రశంసలు పొందిన దర్శకుడు అజయ్ భూపతి ప్రస్తుతం క్రేజీ ప్రాజెక్ట్ 'శ్రీనివాస మంగాపురం' కు దర్శకత్వం వహిస్తున్నారు. సూపర్స్టార్ కృష్ణ, మహేష్ బాబుల వారసత్వాన్ని కొనసాగిస్తూ, జయ కృష్ణ ఘట్టమనేని ఈ చిత్రంతో వెండితెరకు పరిచయం అవుతున్నారు. ఈ చిత్రంలో బాలీవుడ్ నటి రవీనా టాండన్ కుమార్తె, 'ఉయ్ అమ్మ' పాటతో గుర్తింపు పొందిన రాషా థడానీ తెలుగు చిత్రసీమలో అరంగేట్రం చేస్తోంది. నిర్మాత అశ్విని దత్ ఈ ప్రాజెక్ట్‌ను సమర్పిస్తుండగా, 'చందమామ కథలు' బ్యానర్ పై నిర్మాత పి కిరణ్ దీనిని నిర్మిస్తున్నారు. టైటిల్ రివిల్, ఆకట్టుకునే ఫస్ట్ లుక్ పోసర్‌తో ఈ సినిమా ఇప్పటికే మంచి బజ్ క్రియేట్ చేసింది. తాజాగా శుక్రవారం ఈ చిత్రం నుంచి రాషా థడానీ ఫస్ట్ లుక్ను విడుదల చేశారు, ఇందులో ఆమెను 'మంగ' పాత్రలో పరిచయం చేశారు. సాంప్రదాయ దుస్తులలో రాషా హుందాతనం, బలమైన స్క్రీన్ ప్రెజెన్స్ తో ఆకట్టుకుంది. మోషన్ పోస్టర్‌లో ఆమె ఆకట్టుకునే లుక్స్ ఇప్పటికే ప్రేక్షకులు, సినీ వర్గాలని అలరించాయి. ఈ చిత్రం ఇటీవల 30 రోజుల పాటు సాగిన మొదటి షెడ్యూల్ను పూర్తి చేసుకుంది. ప్రస్తుతం రెండవ షెడ్యూల్ జరుగుతోంది. ఉన్నత నిర్మాణ విలువలు, క్రియేటివ్ విజన్ తో టీం వేగంగా ముందుకు సాగుతోంది.మహేష్ బాబుతో సహా తెలుగు చిత్రసీమలో అనేక పెద్ద స్టార్స్ ని పరిచయం చేసి, కృష్ణతో కూడా ఒక సినిమా నిర్మించిన అశ్విని దత్, ఇప్పుడు మరో కొత్త జయ కృష్ణ ఘట్టమనేనిని పరిచయం చేయడం ఇక్కడ చెప్పుకోదగ్గ విశేషం. ఈ చిత్రానికి జివి ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తుండగా, జయకృష్ణ ఐవిస్సి డీవోపీగా పని చేస్తున్నారు. మాధవ్ కుమార్ గుల్లపల్లి ఎడిటర్, సాహి సురేష్ ప్రొడక్షన్ డిజైనర్. రియల్ సతీష్ యాక్షన్ కొరియోగ్రఫీ చేస్తున్నారు.

## ఫిబ్రవరి 6న 'సుమతీ శతకం' విడుదల



విజన్ మూవీ మేకర్స్ బ్యానర్ పై సాయి సుధాకర్ కొమ్మాలపాటి నిర్మాతగా ఎంఎం నాయుడు రచన దర్శకత్వం లో ప్రేక్షకుల ముందుకు రానున్న చిత్రం సుమతీ శతకం. అమర్ దీప్ చౌదరి, శైలి చౌదరి జంటగా నటిస్తున్న ఈ చి త్రంలో తేజ, మహేష్ విట్ట, జేడివి ప్రసాద్, ఆకెళ్ళ గోపి కృ ష్ణ, కిరణ్ విజయ్, మిర్చి కిరణ్, నెల్లూరు నీరజ, మలక్పేట్ శై లజ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఫిబ్రవరి 6వ తే దీన మైత్రి మూవీస్ డిస్ట్రిబ్యూటర్స్ సంస్థ ద్వారా ఆంధ్ర, తెల ంగాణ రాష్ట్రాలలో ప్రేక్షకుల ముందుకు రానున్న సంద ర్భం గా తిరుపతిలోని శ్రీరామ ఇంజనీరింగ్ కాలేజ్ లో ఈ చిత్ర ట్రైలర్ లాంచ్ చేయడం జరిగింది. ఈ సందర్భంగా డైరెక్టర్ నాయుడు మాట్లాడుతూ మా హీరో అమర్ దీప్ మన పక్కి ంటి అబ్బాయిలా కనిపిస్తూనే అద్భుతమైన నటన కనబరిచా రు. షూటింగ్ సమయంలో చేతికి తీవ్రమైన గాయమైనా, స ర్జరీ జరిగే పరిస్థితి వచ్చినా, సినిమా కోసంఅ బాధను భరించి షూటింగ్ పూర్తి చేశారు. ఫిబ్రవరి 6న విడుదలవుతున్న ఈ చి త్రం మీ అంచనాలకు ఏమాత్రం తగ్గ కుండా ఉంటుంది, అందరూ తప్ప కుండా థియేటర్లో చూసి ఆద రించాలని కోరుకుంటు న్నాను' అ న్నారు. నిర్మాత సుధాకర్ మా ట్లాడుతూ 'శ్రీరామ ఇంజనీరి ంగ్ కాలేజీలో మా 'సుమతి శతకం' ట్రైలర్ లాంచ్ జరగ డం, ఇక్కడ విద్యా ర్థుల నుండి వచ్చిన స్పందన చూడటం చా లా ఆనందంగా ఉంది. మేము మా ప్రమోషన్ కార్యక్రమాలను రాయ లసీ మ నుంచే ప్రారంభించాము. కర్నూలు, అనంతపురం, క డప ప్రాంతాల్లో ప్రేక్షకుల ఆదరణ అద్భుతంగా ఉంది. ఫిబ్రవరి 6న రెండు తెలుగు రాష్ట్రాల్లో గ్రాండ్ గా విడుద ల చేస్తున్నాము అని అన్నారు. హీరోయిన్ షైని మాట్లాడుతూ మీ అందరినీ ఇలా చూస్తుంటే చాలా ఆన ందంగా ఉంది. మీ ఎనర్జీ చూస్తుంటేనే చాలా ఉత్సాహంగా అనిపిస్తోంది. ఇప్పుడే మీరు మా సినిమా ట్రైలర్ చూశారు. మీ అందరికీ నచ్చిందని ఆశిస్తున్నాను అని అన్నారు. హీరో అమర్దీప్ మాట్లాడుతూ 'అందరికీ నమస్కారం.నా కెరీర్ 'రామ' అనే పేరుతోనే మొదలైంది అన్నారు.

## వచ్చే ఏడాది ఏప్రిల్ 7న రానున్న వారణాసి




మహేష్ బాబు హీరోగా, ప్రియాంక చోప్రా హీరోయిన్‌గా ఎస్ ఎస్ రాజమౌళి దర్శకత్వంలో తెరకెక్కుతున్న వారణాసి సినిమా విడుదల తేదీ ఖరారు చేశారు. ఏళ్ళ తరబడి సినిమాలు తీస్తున్నారు అనే ఆరోపణలకు రాజమౌళి చెక్ పెడుతూ వారణాసి విడుదల తేదీని ప్రకటిస్తూ శుక్రవారం ఒక పోస్టర్‌ను విడుదల చేశారు. ఇందులో మహేష్ బాబు రాముడి పాత్రను పోషిస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటికే టీజర్ రిలీజ్ కార్యక్రమాన్ని ఘనంగా జరిపిన రాజమౌళి శరవేగంగా షూటింగ్ చేస్తున్నారు. రామోజీ ఫిలిం సిటీలో వేసిన భారీ సెట్ లో ఈ సినిమా షూటింగ్ జరుగుతోంది. శ్రీ దుర్గ ఆర్ట్స్ బ్యానర్ పై కె ఎల్ నారాయణ నిర్మిస్తున్న ఈ చిత్రంపై ప్ర పంచ వ్యాప్తంగా భారీ అంచనాలు నెల కొన్నాయి. ఆర్ ఆర్ ఆర్ సినిమా ఆస్కార్ అవార్డు తరువాత రాజమౌళి చేస్తున్న సినిమా కావడంతో ఈ సినిమాపై భారీగా అంచ నాలు పెరిగాయి. ఆస్కార్ అవార్డు గ్రహీత ఎం ఎ ం కీరవాణి ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. సినిమా షూటింగ్ ఒక పక్క జరుగుతుంటే మరో పక్క పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా జరుగుతున్నాయని నిర్మాత కె ఎల్ నారాయణ చెప్పారు. ఈ సినిమా మహేష్ బాబు అభిమానులకు ఓ పండుగలా ఉంటానని ఆయన పేర్కొన్నారు. ప్రిథ్వి సుకుమారన్ , ప్రకాష్ రాజ్ మరో కీలకపాత్రను పోషిస్తున్న ఈ చిత్రానికి మూల కథ విజయేంద్ర ప్రసాద్, సినిమాటోగ్రఫీ పీ ఎస్ వినోద్ పని చేస్తున్నారు.

## ఒక కొత్త అనుభూతిని ఇచ్చే సినిమా



తరుణ్ భాస్కర్ నటించిన తాజా చిత్రం 'ఓం శాంతి శాంతి శాంతిః. ఈషా రెబ్బా హీరోయిన్ గా నటిస్తున్నారు.ఈ సినిమా జనవరి 30న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా నిర్మాత సృజన్ మీడియాతో చిట్ చాట్ చేశారు. నాకు యూఎస్ లో ఫస్ట్ డే మార్నింగ్ షో సినిమా చూడటం అలవాటు. దాదాపు అన్ని భాషల సినిమాలు చూస్తుంటాను. ఈ సినిమా చూసిన మరుక్షణమే ఇది తెలుగు లో బాగా వర్క్ అవుట్ అవుతుందని పించింది. అప్పటికి నేను మలయాళం లో ఒక సినిమా చేస్తున్నాను. ఆ సినిమా హీరో ద్వారా బాసిల్ జోసెఫ్ నెంబర్ తీసుకుని నిర్మాతలతో మాట్లాడాను. వెంటనే రీమేక్ రైట్స్ తీసుకున్నాను.చిన్నప్పుడు నుంచి ఊర్లో కనిపించిన పాత్రలు అనిపించాయి. అమ్మాయిలపై చేయి చేసుకోవడం చూస్తుంటాం. కానీ వాళ్లు రివర్స్ అయితే పరిస్థితి ఏమిటి అనే పాయింట్ నాకు చాలా నచ్చింది. ఆ సినిమా చూస్తున్నప్పుడు తెలుగు సెన్సిబిలిటీస్ కి ఎలా మార్చుకోవచ్చు అన్నది ఆలోచించుకున్నాను. ఓటిటిలో తెలుగు డబ్బింగ్ ఉన్నప్పటికీ ఈ సినిమాని ఇంకా చాలామంది ఆడియన్స్ చూడలేదు. అయితే చూసినవాళ్లు కూడా ఒక కొత్త అనుభూతి ఇవ్వాలి. దాన్ని ఎలా చేయాలనే ప్రయత్నంతో ఈ సినిమా చేశాం. అది మీరు సినిమా చూస్తున్నప్పుడు అర్థమవుతుంది. కథపరంగా మార్పులు ఉండవు కానీ తెలుగు నేటివిటీకి తగ్గట్టుగా చాలా మార్పులు చేశాం.ఒరిజినల్ సినిమా హీరోయిన్ దర్శనతో తనకి పోలికే ఉండదు. షూటింగ్ అంతా గోదావరి ప్రాంతంలో చేశాం. దర్శకుడు కి పూర్తి స్వేచ్ఛ ఇచ్చాము. షూటింగ్ ఎలా చేయబోతుందని ఎలా చేయబోతున్నాం అనేది పూర్తిగా పేపర్ మీద ఉంటుంది. నేను యూఎస్ లో ఉంటాను కాబట్టి షూటింగ్ కి వెళ్లడం కుదరలేదు.జై క్రిష్ మ్యూజిక్ గురించి చాలా ప్రత్యేకంగా మాట్లాడుకుంటారు. ఈ సినిమా తర్వాత తనకు చాలా మంచి అవకాశాలు వస్తాయి.మలయాళం లో కంటే సినిమా చాలా అద్భుతంగా వచ్చింది. మొదటినుంచి నేను కంటెంట్ సినిమాలు చేస్తూ వచ్చాను. ఇప్పుడు కంటెంట్ కమర్షియల్ సినిమాలపై దృష్టి పెట్టాను. 35 చిన్న కథ కాదు కమర్షియల్ సినిమానే. ఈ సినిమా కూడా అందరికీ రిలేట్ అయ్యే కమర్షియల్ ఎంటర్టైనర్. నెక్స్ట్ చేయబోయే సినిమాలు కూడా కాన్సెప్ట్ పరంగా చాలా కమర్షియల్ గా ఉంటాయి. ప్రస్తుతం గతం2, ఈ నగరానికి ఏమైంది రిపీట్, అలాగే ప్రియదర్శితో ఒక సినిమా నడుస్తున్నాయి.



## రొమాంటిక్ పొలిటికల్ డ్రామా భగవంతుడు

హీరో తిరువీర్ నటిస్తున్న కొత్త సినిమా 'భగవంతుడు'. ఈ సినిమాలో ఫరియా అబ్దుల్లా హీరోయిన్గా నటిస్తోంది. కన్నడ నటుడు రిషి ప్రధాన పాత్రలో కనిపించనున్నారు. ఈ సినిమాను ఏషియన్ ఫిలిమ్స్ నారాయణ దాస్ నారంగ్, పనస శంకరయ్య గౌడ్ సమర్పణలో రవి పనస ఫిలిం కార్పొరేషన్ బ్యానర్ పై ప్రొడక్షన్ నెంబర్ వన్ గా నిర్మిస్తున్నారు. ఈ సినిమాతో జి.జి. విహారి దర్శకుడిగా పరిచయమవుతున్నారు. రొమాంటిక్ పీరియడ్ పొలిటికల్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతున్న 'భగవంతుడు' సినిమా ఈ సమ్మర్ రిలీజ్ కు రెడీ అవుతోంది. హైదరాబాద్ లో చిత్ర టీజర్ ను హీరోలు విశ్వక్ సేన్, సందీప్ కిషన్ చేతుల మీదుగా రిలీజ్ చేశారు. ఈ కార్యక్రమంలోప్రొడ్యూసర్ సెవెన్ హిల్స్ సతీష్ మాట్లాడుతూ రవి పనస నాకు మంచి మిత్రుడు. ఆయన నా విరాటపర్వం మూవీకి రైటర్ గా వర్క్ చేశారు. మీడియాలో పనిచేస్తున్న గోపిని ధైర్యంగా ఇండస్ట్రీకి రమ్మని నేనే ప్రోత్సహించాను. ఆయన దగ్గర ఉన్న రెండు మూడు కథలు విన్నాను అని అన్నారు.డైరెక్టర్ జి.జి. విహారి,హీరోయిన్ ఫారియా అబ్దుల్లా ,ప్రొ డ్యూసర్ రవి పనస, హీరో తిరువీర్‌హీరో విశ్వక్ సేన్ మాట్లాడారు.

# డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పర్యవేక్షణ..

# ఇక 'గృహ నిర్మాణ సంస్థ' చేతికి

కీలక నిర్ణయం తీసుకున్న ప్రభుత్వం
అన్ని ప్రాజెక్టులు ఇకపై గృహ నిర్మాణ సంస్థ పరిధిలోకి బదిలీ
ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు చేపట్టిన డబుల్ బెడ్‌రూమ్ గౌరవ గృహాల పథకంలో ప్రభుత్వం కీలకమైన పాలనాపరమైన మార్పులు చేపట్టింది. రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రభుత్వ శాఖల పర్యవేక్షణలో ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ప్రాజెక్టులన్నింటిని ఇకపై తెలంగాణ గృహ నిర్మాణ సంస్థ (టిజిహెచ్‌సిఎల్) పరిధిలోకి బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

**సమన్వయ లోపానికి చెక్–అంతా ఒకే గొడుగు కిందకు**


ఇప్పటివరకు ఈ ఇళ్ల నిర్మాణ బాధ్యతలు పంచాయతీ రాజ్, జిహెచ్ఎంసి, రోడ్లు, భవనాల శాఖ (ఆర్ అండ్ బి), ప్రజారోగ్య శాఖ వంటి విభిన్న విభాగాల ఆధ్వర్యంలో కొనసాగుతున్నాయి. దీనివల్ల శాఖల మధ్య సమన్వయ లోపం, నిధుల విడుదలలో జాప్యం, పనుల పురోగతిపై స్పష్టత లేకపోవడం వంటి సమస్యలు ఎదురవుతున్నాయి. వీటిని అధిగమించేందుకు ప్రభుత్వం ఈ 'సింగిల్ విండో' విధానాన్ని తీసుకొచ్చింది. పెండింగ్‌లో ఉన్న నిర్మాణ దశలో ఉన్న అన్ని ప్రాజెక్టులను తక్షణమే టిజిహెచ్‌సిఎల్‌కు అప్పగించాలని ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఆదేశించారు. సంబంధిత ఇంజనీరింగ్ విభాగాలు తమ వద్ద ఉన్న ప్రాజెక్టు రికార్డులు, నిధులు, నిర్వహణ బాధ్యతలను గృహ నిర్మాణ సంస్థకు బదిలీ చేయాల్సి ఉంటుంది. హైదరాబాద్ కేంద్రంగా పని చేసే టిజిహెచ్‌సిఎల్ ఇకపై అన్ని జిల్లాల్లోని పనులను నేరుగా పర్యవేక్షిస్తుంది. దీనివల్ల కాంట్రాక్టర్ల బిల్లుల చెల్లింపులు వేగవంతం కావడమే కాకుండా, నిర్మాణ నాణ్యతలో జవాబుదారీతనం పెరుగుతుందని ప్రభుత్వం భావిస్తున్నారు.

**లబ్ధిదారులకు ఊరట :** రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 5.72 లక్షల ఇళ్ల నిర్మాణమే లక్ష్యంగా పెట్టుకోగా, వేల సంఖ్యలో ఇళ్లు 90 శాతం పూర్తి చేసుకుని, కేవలం విద్యుత్, నీరు వంటి చిన్న చిన్న వసతులు లేక లబ్ధిదారులకు అందకుండా పోయాయి. తాజా నిర్ణయంతో మౌలిక వసతుల పనుల్లో వేగం పెరిగి, ఇళ్లు త్వరగా లబ్ధిదారులకు అందుతాయి. కొత్తగా ప్రవేశపెట్టిన 'ఇందిరమ్మ ఇళ్లు' పాత డబుల్ బెడ్‌రూమ్ పథకాలు రెండూ ఒకే సంస్థ పరిధిలోకి రావడంతో నిధుల పంపిణీలో స్పష్టత ఉంటుంది. లబ్ధిదారుల డేటా, కేటాయింపు ప్రక్రియ అంతా ఒకే చోట ఉండటం వల్ల గందరగోళానికి తావుండదు. పెండింగ్ బిల్లుల కారణంగా నిలిచిపోయిన పనులను పరుగులు పెట్టించి, అర్హులైన పేదలకు త్వరగా సొంతింటిని అందించాలనే సంకల్పంతో ప్రభుత్వం ఈ కీలక అడుగు వేసింది.

## పిటి ఉష భర్త మరణం దిగ్భ్రాంతి కలిగించింది: మంత్రి వాకటి శ్రీహరి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** భారత ఒలింపిక్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు,రాజ్యసభ సభ్యురాలు పి.టిఉష భర్త శ్రీనివాసన్ ఆకస్మిక మరణం తనను తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించిందని క్రీడల శాఖమంత్రి వాకటి శ్రీహరి పేర్కొన్నారు. ఆయన మరణం పట్ల సంతాపం వ్యక్తం చేశారు. కష్టకాలంలో ఆమెకు, కుటుంబ సభ్యులకు దేవుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని మంత్రి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

# భక్తజన గుడారం... మేడారం



**ప్రజాపక్షం/మేడారం :** సమ్మక్క సారలమ్మలను కొలిచేందుకు తరలిస్తున్న ప్రజలతో మేడారం భక్తజన గుడారంగా మారింది. లక్షలాదిగా తరలిస్తున్న భక్తుల భక్తిపారవశ్యంతో తడిసి ముద్దవుతోంది. ఎలాంటి గుడి, గోపురం లేని చిన్న అడవిపల్లె నేడు మహా ఆధ్యాత్మిక శిఖరమై మెరిసిపోతున్నది. నాలుగురోజుల పాటు జరిగే మహాజాతరలో గురువారం మహా ఘట్టం ఆవిష్కృతమై జనం కోసం పుట్టిన వనదేవత సమ్మక్క భక్తుల జయజయధ్వానాల నడుమ గద్దెపై కొలువుదీరింది. దీంతో సమ్మక్క రాకతో భక్తులు శుక్రవారం వరదలా పోటెత్తుతున్నారు. మేడారానికి ఇప్పటికే సుమారు 90లక్షల మంది వరకు వచ్చారని అంచనా వేస్తున్నారు. శుక్రవారం మొక్కుబడుల రోజు వీరి సంఖ్య భారీగా పెరిగింది. ఈ సారి కోటికి పైగా భక్తులు రావచ్చునని అంచనా వేస్తున్నారు. ముందు జాగ్రత్తగా జాతరకు కొన్ని రోజుల ముందే 50లక్షల మందికిపైగా భక్తులు వనదేవతలను దర్శించుకున్నారు. అయినా భక్తుల తాకిడి అంతకంతకు పెరుగుతోంది. తల్లుల గద్దెల వద్ద ఇసుకవేస్తే రాలనంత జనం ఉన్నారు. క్యూ లైన్లలో భక్తులు బారులు తీరి నిల్చొని ఉండడం కనిపిస్తోంది. గతంలో వనదేవతలను దర్శించుకోవడానికి మూడు, నాలుగు గంటల సమయం పట్టగా ఈ సారి భారీ మార్పులు చేపట్టి గద్దెల పునర్నిర్మాణం చేపట్టడం, దారులు వెడెల్పు చేయడంతో దర్శనం గంటలోపే పడుతోంది. కాగా భక్తులు తల్లులను దర్శనం చేసుకొని త్వరత్వరగా బయటకు వెళ్లేలా చర్యలు తీసుకుంటున్నా తాకిడి మాత్రం తగ్గడం లేదు.



**పది రోజుల ముందు నుండే భారీగా జనం**

తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్గఢ్, ఒడిశా నుంచి భక్తులు భారీగా తరలివస్తున్నారు. జాతర సమయంలోనే సమ్మక్క, సారలమ్మలను దర్శించుకోవాలని తపించే లక్షలమంది నాలుగు రోజుల నుంచి మేడారానికి బాటపట్టారు. వాహనాలు, బస్సులు, ఎడ్లబండ్లలో తరలి వచ్చి మేడారం చుట్టుపక్కల విడిదిచేశారు. దీనితో మేడారానికి ఎటు అయిదు కిలోమీటర్ల వరకు ఎటు చూసిన భక్తు జనసందోహమే కనిపిస్తోంది. వనం అంతా జనం మయమైంది. జంపన్న వాగులో పుణ్యస్నానాలు చేసి గద్దెల దర్శనానికి బారులుతీరారు. లక్షలమంది భక్తులతో జంపన్నవాగు కిటకిటలాడుతోంది. బ్యాటరీ ఆఫ్ ట్యాప్స్ కింద కొందరు స్నానాలు చేస్తుండగా వాగునీటిలో మూడు మునకలు వేసి మరికొందరు తలారా పుణ్యస్నానమాచరిస్తున్నారు. ఇక్కడే కొలువైన జంపన్న, నాగులమ్మ గద్దెలకు తొట్టెలు, ముడుపులు కట్టి కొబ్బరికాయలు కొడుతున్నారు. వాగులో శివసత్తులు పూనకాలతో ఊగిపోతున్నారు. కడుపు పండాలని, వ్యాధులు నయం కావాలని భక్తులు వరంప ట్టారు. ఆ తర్వాత వనదేవతల గద్దెలను దర్శించుకొని మొక్కులు చెల్లించుకొని కోళ్లు, మేకలను బలిస్తున్నారు.

**పెరుగుతున్న విఐపిల తాకిడి**



సామాన్య భక్తజనంతో శుక్రవారం తెలుగు రాష్ట్రాల్లోని వివిధ రంగాల్లోని వీఐపీలు వనదేవతలను దర్శించుకున్నారు. రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ దంపతులు, రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, రాష్ట్ర డిజిపి శవధర్ రెడ్డి, హైడ్రా కమిషనర్ ఏవి.రంగనాథ్, పలువురు ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలతో పాటు పలువురు రాజకీయ, వివిధ రంగాలకు చెందిన విఐపిలు వనదేవతలను దర్శించుకున్నారు. వీరి వెంట పంచాయితీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, మహిళ శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క), జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ తదితరులు ఉన్నారు.

## మళ్లీ నోటీసు (మొదటి పేజీ తరువాయి)

అధికారిక లేఖను విడుదల చేశారు. కెసిఆర్ తన ప్రస్తుత నివాసం సిద్ధిపేట జిల్లా మార్కుక్ మండలం ఎర్రవల్లి గ్రామంలో విచారణ జరపాలని కోరుతూ ఈ నెల 29న ఇచ్చిన అభ్యర్థనకు పోలీసులు ఈ లేఖ ద్వారా సమాధానం ఇచ్చారు. పోలీసులు విడుదల చేసిన లేఖలో, కెసిఆర్ ఎన్నికల అఫిడవిట్, శాసనసభ రికార్డులలో పేర్కొన్న అధికారిక నివాసం హైదరాబాద్‌లోనే ఉందని స్పష్టం చేశారు. ఆ మేరకు నోటీసు హైదరాబాద్ నివాసానికే సక్రమంగా అందజేశామని పేర్కొన్నారు. సిఆర్‌పిసి సెక్షన్ 160 ప్రకారం కేసు వివరాలు తెలిసిన వ్యక్తులు సంబంధిత లేదా సమీప పోలీస్ స్టేషన్ పరిధిలో విచారణకు హాజరు కావాల్సి ఉంటుందని లేఖలో వివరించారు. కెసిఆర్ వయసును దృష్టిలో ఉంచుకుని చట్టంలోని నిబంధనల ప్రకారం విచారణను ఆయన నివాసంలోనే చేపట్టేందుకు అధికారులు ముందుకొచ్చినప్పటికీ, అధికారిక రికార్డులలో ఉన్న నివాసానికి భిన్నమైన ప్రాంతంలో విచారణ జరపాలన్న అభ్యర్థనను అంగీకరించలేమని పోలీసు శాఖ స్పష్టం చేసింది. అదేవిధంగా, ఈ కేసు విచారణలో పలు సున్నితమైన ఎలక్ట్రానిక్, భౌతిక ఆధారాలు పరిశీలించాల్సి ఉండటంతో వాటిని ఎర్రవల్లి గ్రామానికి తరలించడం పరిపాలనా పరంగా సాధ్యం కాదని తెలిపారు. ఈ నేపథ్యంలో ఫిబ్రవరి 1వ తేదీన మధ్యాహ్నం 3 గంటలకు హైదరాబాద్‌లోని ఆయన నివాసంలోనే విచారణకు హాజరుకావాలని కెసిఆర్‌ను పోలీసులు ఆదేశించారు. ఈ ఆదేశాలను తప్పనిసరిగా పాటించాలని నోటీసులో స్పష్టం చేశారు.

## శానిటరీ ప్యాడ్స్

(మొదటి పేజీ తరువాయి)

దెబ్బతింటాయని, ఇది సమానత్వ హక్కుకు కూడా విరుద్ధమని న్యాయస్థానం అభిప్రాయపడింది. పాఠశాలల్లో కేవలం శానిటరీ ప్యాడ్స్ అందించడం మాత్రమే కాకుండా, మౌలిక వసతుల విషయంలో కూడా కోర్టు కఠిన ఆదేశాలు జారీ చేసింది. ప్రతి పాఠశాలలో బాలికలు, బాలురకు విడివిడిగా టాయిలెట్లు ఏర్పాటు చేయాలని తెలిపింది. అదేవిధంగా దివ్యాంగులకు అనుకూలంగా ప్రత్యేక టాయిలెట్లు తప్పనిసరిగా ఉండాలని పేర్కొంది. పరిశుభ్రత, భద్రత, గోప్యతకు ప్రాధాన్యం ఇచ్చే విధంగా సౌకర్యాలు కల్పించాలని రాష్ట్రాలకు సూచించింది.

**ఆదేశాలను పాటించకపోతే గుర్తింపును రద్దు చేసే చర్యలు :** ప్రభుత్వ పాఠశాలలతో పాటు ప్రైవేటు పాఠశాలలు కూడా ఈ నిబంధనలను తప్పనిసరిగా అమలు చేయాలని కోర్టు స్పష్టం చేసింది. ఒకవేళ ప్రైవేటు విద్యాసంస్థలు ఈ ఆదేశాలను పాటించకపోతే వాటి గుర్తింపును రద్దు చేసే చర్యలు తీసుకోవాలని హెచ్చరించింది. బాలికలకు కనీస సదుపాయాలు కల్పించకపోవడం తీవ్ర నిర్లక్ష్యంగా పరిగణించబడుతుందని తెలిపింది. ఇక ప్రభుత్వాల బాధ్యతలపై కూడా సుప్రీంకోర్టు గట్టిగా స్పందించింది. టాయిలెట్లు, ఉచిత శానిటరీ ప్యాడ్స్ అందించడంలో రాష్ట్రాలు విఫలమైతే వాటిని జవాబుదారులుగా నిలబెడతామని స్పష్టం చేసింది. అవసరమైన బడ్జెట్ కేటాయింపులు చేసి, పాఠశాల స్థాయిలో పర్యవేక్షణ వ్యవస్థ ఏర్పాటు చేయాలని సూచించింది.

**తుది తీర్పు రిజర్వ్ :** దేశవ్యాప్తంగా బాలికల కోసం కేంద్ర ప్రభుత్వం రూపొందించిన మెన్స్ట్రువల్ హైజీన్ పాలసీని అమలు చేయాలంటూ జయా ఠాకూర్ దాఖలు చేసిన ప్రజాహిత వ్యాజ్యంపై విచారణ సందర్భంగా ఈ ఆదేశాలు వెలువడ్డాయి. 6వ తరగతి నుంచి 12వ తరగతి వరకు చదువుతున్న బాలికలకు ఈ విధానాన్ని సమగ్రంగా అమలు చేయాలని పిటిషన్‌లో కోరారు. ఈ కేసులో తుది తీర్పును సుప్రీంకోర్టు రిజర్వ్‌లో ఉంచింది.

## భూ సంస్కరణలకు ఆద్యుడు

(మొదటి పేజీ తరువాయి)

గుర్తు చేశారు. రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితి అనుకూలిస్తే ప్రభుత్వ పాఠశాలల్లో ఉచితంగా అల్పాహారం ఏర్పాటు చేయాలని సిఎం రేవంత్ రెడ్డి తో పాటు యావత్ క్యాబినెట్ ఆలోచన చేస్తుందని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. సిఎం రేవంత్ రెడ్డి నియోజకవర్గంలో అల్పాహార పథకం పైలెట్ ప్రాజెక్టు కింద ఇప్పటికే ప్రారంభించామని తెలిపారు. కామన్ స్కూల్ విధానం ఉంటేనే సమాజం ఉమ్మడి కుటుంబం గా ఎదుగుతుందని, చిన్ననాటి నుంచే అందరం కలిసిపోయాం అనే భావన కులం, మతం, ధనిక, పేద తేడా లేదన్న నిర్మాణాత్మక ఆలోచన సమాజంలో పెరుగుతుందనే ప్రభుత్వం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మిస్తుందని తెలిపారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా మొట్టమొదటిసారి ఒక్కో పాఠశాలను 25 ఎకరాలు విస్తీర్ణంలో 200 కోట్ల బడ్జెట్ తో రాష్ట్రవ్యాప్తంగా 100 నియోజక వర్గాల్లో 20వేల కోట్లు వెచ్చిస్తూ ఒకేసారి నిర్మాణాలు ప్రారంభించామని ఆయన గుర్తు చేశారు. గత పాలకులు ఐటిఐ లను అనాథలుగా వదిలేస్తే మారిన కాలానికి అనుగుణంగా వాటిలో శిక్షణ ఇవ్వాలని,ఆధునిక యంత్ర పరికరాలను తీసుకువచ్చి ప్రస్తుతం మార్కెట్లో ఉన్న పారిశ్రామికవేత్తలను తీసుకువచ్చి ఉపాధి పొందేందుకు అవసరమైన సిలబస్ను రూపొందించామని,రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లోని ఐటిఐలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా మారుస్తున్నామని తెలిపారు. హైదరాబాద్ చుట్టూ ఆధునిక ఆసుపత్రుల నిర్మాణం జరుగుతుంది,జిల్లా కేంద్రాల్లోని ప్రభుత్వ ఆసుపత్రులను ఆధునికరించామని వివరించారు. హైదరాబాద్ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు తీసుకున్న విప్లవాత్మక నిర్ణయాలు ఈ తరానికి తెలిసి ఉండకపోవచ్చు ఈ దేశంలో భూ సంస్కరణలకు ఆధ్యుడు బూర్గుల రామకృష్ణారావు అని వివరించారు.దివంగత ముఖ్యమంత్రులు బూర్గుల రామకృష్ణారావు, మర్రి చెన్నారెడ్డి తో పాటు ఉత్తరప్రదేశ్ మాజీ గవర్నర్ సత్యనారాయణ రెడ్డి,ప్రముఖ ప్రొఫసర్ హరగోపాల్ వంటి అనేకమంది ప్రముఖులను మొగిలిగిద్ద ప్రభుత్వ పాఠశాల దేశానికి సమాజానికి అందించిందని తెలిపారు. 150 సంవత్సరాల చరిత్ర కలిగిన మొగిలిగిద్ద పాఠశాల గొప్పది ఈ పాఠశాలలో 1952 వరకు ఉర్దూ మీడియం లో కొనసాగగా,ఆ తరువాత తెలుగు మీడియాను ప్రవేశపెట్టారని వివరించారు.2008లో దివంగత సిఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఉమ్మడి రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలో ఇంగ్లీష్ మీడియం ఉండాలని పట్టుబట్టి ప్రవేశపెట్టారని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మల్లు వివరించారు. కార్యక్రమంలో విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ సోమిరెడ్డి,జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి,జిల్లా విద్యాశాఖ అధికారి సుసింధర్ రావు,గ్రామ సర్పంచ్ కృష్ణయ్య,అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్పర్సన్ బండారి సంతోష సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com